సంపుటి: 27
సంచిక: 3

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 45 రూపాయలు
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

అక్టోబరు, 1978

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెమ్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వీ. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

తొలిమాట

నమస్కారము. పత్రికలను మరింత ముందుగా మార్కెట్లోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వచ్చే రెండునెలల పత్రికలను 15 రోజుల తేడాతో రిలీజ్ చేస్తున్నాము. అంటే, నవంబరునెల సంచిక అక్టోబరు 15వ తేదీనాటికి, డిసెంబరు నెల సంచిక నవంబరు 1వ తేదీ నాటికి మార్కెట్లో వుంటుంది. ఈ మార్పును పాఠకులు, ఏజెంట్లు గమనించ గోర్తాము.

గత నెలలో, హోం.డె. సభ్యులు ఏ కారణం చేతనైనా వి. పి. తిరిగొచ్చినప్పుడు, వాటి పైకం వెంటనే M. O. చేస్తే, కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతామని తెలియజేశాము. అందుకు చాలామంది సభ్యులు తమ సంతోషాన్ని తెలియజేశారు. అలాగే పాత కాపీలు కావలసిన సభ్యులు కూడా వాటి పైకం M. O. చేస్తే, వారు కోరిన కాపీలు ఆనెల వి. పి. ప్యాకెట్ లో వేసి పంపగలము. ఎక్కువ కాపీలు కావలసినవారు సెట్టుకు రు. 5/-లు చొప్పున పంపితే చాలు. ఒకవేళ మీరు కోరిన పాత కాపీలు మా దగ్గర లేకపోతే, వాటి పైకం మీకు పంపే వి.పి.లో తగ్గించివేస్తాము.

ఈ సంచికలో మీ తీర్పు ఏమిటి, పాఠకుల ప్రశ్నలు శీర్షికలు తిరిగి ప్రవేశపెట్టాము. పాఠకులందరినీ ఉత్సాహపరిచే మరో సరికొత్త శీర్షిక వివరాలు వచ్చే సంచికలో ప్రచురించగలము. తిరిగి అక్టోబరు 15వ తేదీన కలుసుకుందాము. సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. మాయమైన మాత్రలు—లలితకుమారి
25. తెగిన గాలిపటం—వసుంధర
42. వేట—మల్లేశ్వరరావు
52. పాండురాళ్ళు—యస్. కృష్ణవేణి
67. మూడుగుద్దులు-ముంతెడు నీళ్ళు—'సికిందర్'
97. దంతవైద్యుడు—అజీజ్
111. కదిలే బొమ్మలు—చాగాపురం నాగేశ్వరరావు
121. లంకె బిందెలు—చైతన్య
132. నాకు ఓటమిలేదు—యస్. యస్. శాస్త్రి
147. అతీంద్రియ శక్తులు(సీరియల్)—రమణశ్రీ

నవలలు (సప్లిమెంట్)

3. పారగన్ సర్కస్—'సికిందర్'
48. చిత్రమైన ఖైదు—వసుంధర
80. మిస్. శోభాసింగ్—సంపత్
104. నకిలీ భర్తలు—ఏ. వీ. మోహన్రావ్
145. అంగారక (సీరియల్)—శ్యాంబాబు.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, పాఠకుల పరిశోధన పోటీ, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు, పాఠకుల ప్రశ్నలు, మీ తీర్పు ఏమిటి, మరెన్నో ఆకర్షణలు!!!

మాయమైన మాత్రలు

లలిత కుమారి

"లోపలికి రావచ్చా అమ్మా?"

"ఎస్, ప్లీజ్!"

స్ప్రింగ్‌డోర్స్ తెరుస్తూ ఏభై ఏళ్ళ స్త్రీ వచ్చింది లోనికి.

ముడతలుపడ్డ చర్మం, నెరసిన జుత్తు, ఎరుపురంగు ముతకచీర. చాలా బీదగా కనిపిస్తోంది. కళ్ళు జేవురించి ఉన్నాయి.

"డిటెక్టివ్ ప్రమీలగారు మీరేనా అమ్మా?" అని అడిగింది నా యెదురుగా కుర్చీలో కూర్చుంటూ.

తలూపి, "చెప్పండి, మీకు వచ్చిన ఇబ్బందేమిటో?" అన్నాను.

"నా పేరు జానకమ్మ! చిన్నప్పుడే తలిదండ్రుల్ని కోల్పోయి, సవతితల్లి ప్రాపకంలో పెరిగాను. పదహారేళ్ళ వయసులో నన్నో తాగుబోతుకిచ్చి పెళ్ళిచేశారు. తాగుతూ, తంతూ నా భర్త ఓ సంవత్సరం నాతో సంసారంజేసి, నేను ఆరోనెల చూలాలిగా ఉన్నప్పుడు వదిలి వెళ్ళిపోయాడు.

నా పిన్ని మళ్ళీ నన్ను తనింటికి రానివ్వలేదు. ఆ నాటి నించీ ఇరవైయేళ్ళపాటు అష్టకష్టాలూ పడి, వంటమనిషిగా ఆయాగా,దాసీగా పనిజేసి, నా పొట్ట నేను పోషించుకుంటూ నా కూతురు భారతికి చదువు చెప్పించి, నర్సు ట్రేనింగ్ ఇప్పించాను. రెండేళ్ళనించీ నా బిడ్డే నన్ను పోషిస్తోంది!"

అంతవరకూ చాలా ఓపిగ్గా విని, "అసలు విషయం?" అడిగాను.

"క్షమించండి. నా సోది చెప్పి మిమ్మల్ని విసిగిస్తున్నాను. నాకు మీ సహాయం కావాలి. మీరు న్యాయమూ, దయా కలవారనీ, అమాయకులనూ, నిర్దోషులనూ రక్షిస్తారనీ విన్నాను. పేదదాన్ని. అట్టే ఫీజు ఇచ్చుకోలేనమ్మా!" అంది.

"ఫీజు విషయం అలా ఉంచండి. అసలు విషయం చెప్పండి" అన్నాను.

"అమ్మా! మా భారతిని పోలీసులు పట్టుకున్నారు!" అంది కళ్ళ నీరు కుక్కుకుంటూ.

"ఎందుకు పట్టుకున్నారు?"

"రామనాథంగార్ని హత్య చేసిందట!"

"రామనాథం ఎవరు?"

"మీనాక్షి కాటన్‌మిల్స్ యజమాని! గొప్ప ధన వంతులు."

"అసలు ఏం జరిగిందో విపులంగా చెప్పండి."

"రామనాథంగారికి అరవై ఏళ్ళు. ఐదేళ్ళపాటు నేను వాళ్ళింట్లో వంటమనిషిగా పనిజేశాను. రెండేళ్ళక్రితం రామ నాథంగారికి హృద్రోగం వచ్చింది.

ఆయనకు సదా ఉపచర్యలు చేయ్యడానికి నర్సు అవ సరమైతే, అప్పుడే ట్రేనింగ్ పూర్తైన మా భారతిని నర్సుగా పెట్టుకున్నారు. అప్పట్నించీ భారతి వాళ్ళదగ్గిరే ఉంటోంది. నేను వంటపని మానేశాను—అనారోగ్యం వల్ల!"

"రామనాథంగారు హత్య చెయ్యబడి ఎన్నాళ్ళైంది?"

"రెండు రోజులే! ఓ రాత్రి ఆయనకి గుండినెప్పి వచ్చిందిట. డాక్టరొచ్చి ఇంజక్షన్ ఇచ్చి వెళ్ళారట. ఆ తర్వాత గంటలోగా ఆయన ప్రాణం పోయిందిట. డాక్ట రిచ్చిన మందు ఎక్కువ మోతాదులో వుందని శవపరీక్షలో తేలిందిట. ఇంజక్షన్ సూదిలో మా భారతే మందుపోసింది. ఎక్కువ మందుపోసి, ఆయన్ని చంపేసిందని పోలీసులు పట్టుకున్నారు!"

"ఆయన్ని హత్య జెయ్యడానికి మీ అమ్మాయికేమైనా కారణం ఉందా?"

"లేదమ్మా—లేదు! కాని, పోలీసులకదంతా ఎందుకు? తన అనంతరం భారతికి పదివేల రూపాయలు చెందేలా రామనాథంగారు విల్లు రాశారట. ఆ డబ్బుకోసమే భారతి ఆయన్ని హత్య చేసిందని పోలీసుల అనుమానం! భారతికి

ఆయనంటే చాలా ప్రేమ. నే నెంతో ఆయనా అంతే!"

"ఇంకేమైనా వివరాలు తెలుసా మీకు?"

"తెలీదు తల్లీ! నాకేం తెలుస్తుంది? చదువుకున్నవారు మీకు తెలియాలి."

"రామనాథంగారింట్లో ఎంతమంది ఉన్నారు?"

"ఆయన కొడుకు విశ్వనాథ్, మేనకోడలు రాధ, నౌఖర్లూ, అంతే. మీరెలాగైనా నా బిడ్డని రక్షించాలి. లేకుంటే పోలీసులు దాన్ని ఉరితీస్తారు!" జానకమ్మ ఏడ్వడం ప్రారంభించింది.

"అలా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే ప్రయోజనంలేదు. మీ అమ్మాయి నిర్దోషయితే తప్పకుండా విడుదలౌతుంది. రామనాథంగారి ఇంటి అడ్రస్ ఇవ్వు. నేను వెళ్ళి కనుక్కుంటాను" అన్నాను డైరీ తీస్తూ.

2

"కూర్చోండి. మీ పేరు పత్రికల్లో చూస్తుంటాను. కలుసుకునే అవకాశం కలగలేదు. పనిమీద వచ్చారా?" అడిగాడు రామనాథంగారి కొడుకు విశ్వనాథం.

అతనికి పాతికేళ్ళుంటాయి. ఆజానుబాహుడు. అందగాడు.

"మీ నాన్నగారు హత్యజెయ్యబడ్డారట. భారతి అనే నర్సుని అరెస్టు చేశారట. ఆమె తరపున దర్యాప్తు చెయ్యడానికి వచ్చాను."

అతని మొహంలో ఒక రకం తృప్తీ, సంతోషమూ గోచరించాయి.

"మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలి!"

"అడగండి. నాకు తెలిసినంతవరకూ చెబుతాను."

"భారతి గురించి మీ స్వంత అభిప్రాయం యేమిటి?...."

మొహం చిట్లించాడు విశ్వనాథ్. ఏదో బాధ, అనుమానం, అయిష్టత అతని మొహంలో కనిపించాయి.

"భారతి మంచిదే! రెండేళ్ళనించీ ఇక్కడే ఉంటోంది. అంతకు పూర్వం తన తల్లిని చూట్టానికి తరుచూ ఇక్కడికి వచ్చేది. అప్పట్నించీ నాకు తెలుసు.

మా నాన్నగారంటే భారతికి ఇష్టం అనుకున్నాను. రాత్రనకా, పగలకా ఆయనకి ఉపచర్యలు చేసేది. ఆయన్ని విడిచి ఒక్క క్షణమైనా ఉండేది కాదు. అదే నాకూ అర్థం కావడంలేదు. భారతి ఇటువంటి పనిజేస్తుందని కలలో కూడా అనుకోలేదు నేను.

ఇప్పటికీ నమ్మలేకుండా ఉన్నాను. బహుశా, పొరబాటున ఆస్టిసిలిన్ ఎక్కువ మోతాదులో కలిపి ఉంటుందని నా అభిప్రాయం! తెలిసి—ఆయన్ని చంపాలనే ఉద్దేశంతో చేసి ఉండదు."

"మీ నాన్నగారి మరణానికి కారణం ఆస్టిసిలిన్ అన్నమాట! వివరాలు చెప్పగలరా?" అడిగాను.

"మొన్నరాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో, నాన్నగారికి గుండెనెప్పి ఎక్కువైందనీ, డాక్టర్‌కు ఫోన్‌జేశాననీ వచ్చి చెప్పింది. అప్పుడు నేనూ, రాధా—అంటే నా మేనత్తకూతురు భోజనం చేస్తున్నాం. ఇద్దరం లేచి గబగబ నాన్న గదిలోకెళ్ళాం!

ఆయన చాలా బాధపడుతున్నారు. అంతలో బైట డాక్టర్ వచ్చినట్లు తెలిసింది. నేను కిందికెళ్ళి, ఆయన్ని వెంటబెట్టుకొచ్చాను. ప్రమాదమేమీ లేదని చెప్పి, నిద్ర కోసం ఇంజక్షనిస్తానన్నారు డాక్టర్.



ఆ గదిలోనే బీరువాలో ఆస్టిసిలిన్ మాత్రల ట్యూబూ, డిస్టిల్ వాటర్ సీసా ఉన్నాయి. సిరెంజిలో ఒకే మాత్ర వేసి, డిస్టిల్‌వాటర్ ఎక్కించి తీసుకురమ్మని భారతికి చెప్పారు డాక్టర్.

రెండు నిమిషాల్లో సిరంజితో వచ్చింది భారతి. డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చారు. పది నిమిషాల తరవాత నాన్నగారు నిద్రపోయారు. మళ్ళీ పొద్దున్నే వస్తానని చెప్పి, డాక్టర్ వెళ్ళిపోయారు.

అర్ధరాత్రి రెండు గంటలకి నాన్న గదిలోంచి భారతి కెవ్వున కేకేసింది. నేను పరిగెత్తుకెళ్ళాను. నాన్నగారు పోయి అప్పటికే చాలాసేపయింది. డాక్టరు వచ్చారు. పరీక్ష చేసి, ప్రాణం పోవడానికి కారణం కనిపించడం లేదనీ, శవ పరీక్ష జేస్తాననీ చెప్పారు.

ఆయనే పోలీసులకి రిపోర్టు చేశారు. శవ పరీక్షానంతరం నాన్న శరీరంలో ఆరు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ ఉందని తేలింది. మరో ఇంజక్షన్ ఇచ్చినట్టు ఒంటిమీద గుర్తులేదు. ఒక్కచే

ఇంజక్షను—అదీ డాక్టరిచ్చారు. ఆయన వుండగానే నాన్న నిద్రపోయారు గనక, మరే విధంగానూ ఆప్టిసిలిన్ తీసుకోడానికి వీల్లేదు.

ఆ మత్తుకి, అంటే డాక్టరిచ్చిన ఇంజక్షన్ ఫలితంగా, తెల్లారేవరకూ లేవరట. కనక, డాక్టరిచ్చిన ఇంజక్షన్లో ఆరు గ్రెయిన్ల ఆప్టిసిలిన్ ఎక్కించింది భారతే గనక, ఆమె మీద అనుమానం కలిగింది।'' అన్నాడు విశ్వనాథ్.

"తన అనంతరం భారతికి పదివేలు వచ్చేట్టు మీ నాన్నగారు విల్లు రాశారా?'' అడిగాను.

"అదొక విచిత్రం! నాన్నరాసిన విల్లులో ఆ ప్రస్తావనే లేదు!! ఆయన ఆస్తంతా నాకే వస్తుంది. తనకి పదివేలు వస్తాయని భారతి ఎందుకనుకుందో నా కర్థంకాలేదు।" అన్నాడు విశ్వనాథ్.

"మీ నాన్నగారి అనంతరం పదివేలు వస్తాయని భారతి ఎవరితోనన్నా చెప్పిందా?''

"పక్కింటావిడతో అన్నదిట. ఆవిడ చెప్పింది.''

"మీ నాన్నగారికి అరవై ఏళ్ళు. పైగా హృద్రోగం! ఆయన అట్టే కలం బ్రతకరని తెలిసీ భారతి ఇంత అఘాయిత్యం ఎందుకు చేసిందో ఎవ్వరైనా ఆలోచించారా?''

"ఆయన మరణించేవరకూ భారతి తన దగ్గర వుంటేనే పదివేలు బహుమానంగా ఇవ్వవలసిందని ఆయన విల్లులో రాసినట్టు భారతే చెప్పిందిట.''

"ఆలోగా తనని ఉద్యోగంలోంచి తీసేస్తారన్న అనుమానం దేనికి కలిగింది భారతికి?''

"నాన్నగారు పోయేముందు రెండురోజుల క్రితం— మరో నర్సుని చూస్తున్నామనీ, వేరే ఉద్యోగం చూసుకోనీ, మొదటి తేదీనించి ఇక రానవసరం లేదనీ రాధ, భారతికి

చెప్పిందిట. ఆ విషయం నన్నడిగింది భారతి. నేను రాధ నడిగాను. నాన్నగారే అలా చెప్పమన్నారంది! నాన్న నడిగాను. అవునన్నారు!''

"తనని ఉద్యోగంలోంచి తీసెయ్యమన్నారనీ, అప్పుడా పదివేలూ తనకి దక్కవనీ, ఉద్యోగంలోంచి తియ్యక ముందే మీ నాన్నగారు మరణిస్తే పదివేలూ తనకి వస్తాయనీ భారతి ఈ హత్య జేసిందనా మీ అభిప్రాయం?''

"అది నా అభిప్రాయం కాదు. పోలీసుల అభిప్రాయం!"

"మరి మీ అభిప్రాయం?"

"భారతి హంతకురాలు కాదని నా మనసు చెబుతోంది. సాక్ష్యాలని బట్టి హంతకురాలేమోనని వివేకం చెబుతోంది!''

"సాక్ష్యాలన్నారు. ఏమిటవి?''

"భారతి పెట్టెలో ఓ పుస్తకం దొరికింది. దాని పేరు 'హృద్రోగం—జాగ్రత్తలు'. గుండె జబ్బుకు ఆస్టిసిలిన్ ఇవ్వాల్సివస్తే ఎంత ఇవ్వాలీ, ఎంత ఇస్తే ప్రాణాపాయకరమైనదీ రాసుందిట. ఆ పుట బాగా మాసి, నలిగి ఉందిట. భారతి ఆ పేజీని పదేపదే చదివుండాలని పోలీసుల అభిప్రాయం!''

"ఇంకా?''

"ఆస్టిసిలిన్ మాత్రల ట్యూబ్ మీదా, డిస్టిల్ వాటర్ సీసా మీదా భారతి వేలి ముద్రలే వున్నాయి. ఆ ట్యూబ్ లో మొత్తం పదహారు మాత్రలుంటాయి.

కొత్త ట్యూబ్ లోంచి ఒకే ఒక్క మాత్ర అంతకు పూర్వం మా నాన్నకే ఇవ్వబడింది గనక, హత్య జరిగిన రాత్రి ఆ ట్యూబులో .పదిహేను మాత్రలుండాలి. ఆ రాత్రి ఒక్క మాత్రే భారతి తీసుంటే, ఇంకా పధ్నాల్గు మాత్రలు ట్యూభులో వుండాలికదా?

కాని ట్యూబ్‌లో తొమ్మిది మాత్రలే ఉన్నాయి. అవి ఎలా పోయాయో, ఎప్పుడు పోయాయో తనకి తెలీదంటుంది భారతి. హత్య జరిగిన రాత్రి అందులో పదిహేను మాత్ర లున్నాయనీ, ఒక్క మాత్ర మాత్రమే తను తీశాననీ చెప్పింది!"

"థాంక్సు! మరొక్క ప్రశ్న. మీరు రాధని వివాహం చేసుకోబోతున్నారా?"

విశ్వనాధ్ క్షణం తటపటాయించి, "లేదు!" అన్నాడు.

"ఆమెని వివాహం చేసుకోమని మిమ్మల్ని మీ నాన్న గారు కోరారా?"

"ఔను!"

"మీరు భారతిని పెళ్ళి చేసుకుంటా నన్నారా?"

విశ్వనాధ్ ఆశ్చర్యంగా చూశాడు నావైపు.

"చెప్పండి! భారతికి సహాయం చెయ్యాలంటే మీరు నిజం చెప్పాలి!" అన్నాను నొక్కి పలుకుతూ.

"ఔను! భారతిని వివాహం చేసుకుందా మనుకున్నాను."

"ఈ విషయం పోలీసులకి చెప్పారా?"

"లేదు!"

"ఏం?"

"ఆమెమీద కేసు మరింత పటిష్టమౌతుందని. నేనామెని పెళ్ళి చేసుకోడం నాన్నగారి కిష్టంలేదు. ఆ విషయం నాతో స్పష్టంగా చెప్పారు. అందుకే భారతిని మాన్పించాలను కున్నారు!"

"థాంక్సు! వస్తాను!" అన్నాను లేస్తూ.

3

అక్కణ్నించి తిన్నగా వాళ్ళ ఫామిలీ డాక్టరింటి కెళ్ళాను. అదృష్టవశాత్తూ ఆయన ఇంట్లోనే ఉన్నారు.

నన్ను చూడగానే సాదరంగా ఆహ్వానించారు.

"హృద్రోగం ఉన్నవారికి సామాన్యంగా ఆస్టిసిలిన్ ఇవ్వరంటారు. నిజమేనా డాక్టర్?" అడిగాను.

"అటువంటి నియమమేదీలేదు. కొందరిస్తారు. కొంద రివ్వరు. డాక్టర్నిబట్టి ఉంటుంది. సామాన్యంగా హృద్రోగం ఉన్నవారికి చాలా తక్కువ ఆస్టిసిలిన్ ఇస్తారు. అదీ రోగి యమబాధ పడుతున్నప్పుడూ, నిద్రపోయేందుకూ తప్ప!"

"ఎన్ని గ్రెయిన్లు ఇస్తారు?"

"రెండు గ్రెయిన్లకన్నా ఎక్కువ ఏ సందర్భంలోనూ ఇవ్వరు."

"మొన్న రామనాధంగారికి ఎన్ని గ్రెయిన్లు ఇచ్చారు మీరు?"

"రెండే!"

"ఆరోగ్యంగా ఉన్నవారికి, హృద్రోగం లేనివారికి ఎన్ని గ్రెయిన్ల వరకూ ఆస్టిసిలిన్ ఇవ్వచ్చాంటారు?"

"దాదాపు ఎనిమిది గ్రెయిన్ల వరకూ ఇవ్వచ్చు. ఒక్కోసారి పది గ్రెయిన్లిచ్చినా ప్రమాదం ఉండకపోవచ్చు."

"రామనాధంగారి శరీరంలో ఆరు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ మాత్రమే ఉందా?"

"ఔను!"

"కనక, ఆయన్ని హత్యజేసినవారికి, హృద్రోగులు కొద్ది గ్రెయిన్ల ఆస్టిసిలిన్‌కే మరణిస్తారని తెలిసుండాలి!"

"ఔను."

"భారతి గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"చాలా మంచిది. సమర్ధతా, నైపుణ్యమూ ఉన్న నర్సు!"

"ఆమె పొరపాట్న ఒక మాత్రకి బదులు ఆరు

మాత్రలు వేసి ఉండటానికి అవకాశం ఉందంటారా?"

"అటువంటి పొరపాటు చెయ్యడం అసంభవం! అందునా, ట్రేనింగైన నర్సు—అసలు చెయ్యదు!"

"మీ రిచ్చిన ఇంజక్షన్లోనే ఆరు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ ఉందని ఖచ్చితంగా చెప్పగలరా?"

"ఔను!"

"మీరు ఇంజక్షన్ ఇవ్వక పూర్వమే ఆస్టిసిలిన్ ఇచ్చి ఉండటానికి అవకాశంలేదా?"

డాక్టర్ నా వైపు చుర చుర చూసి, "నాకు కళ్ళున్నాయి. ముసలాణ్నయినా అంత మందమతిని కాలేదు. ఆస్టిసిలిన్ తీసుకున్న లక్షణాలు కనిపించినట్టయితే, మళ్ళీ ఆ ఇంజక్షనిచ్చే వాణ్నికాను!" అన్నాడు.

"థాంక్సు!" అంటూ లేచాను.

4

అక్కణ్నించి తిన్నగా ఇన్‌స్పెక్టర్ సంజయ్ ఆఫీసు కెళ్ళాను.

"హలో! రండి, ఏమిటి విశేషం?" అడిగాడు నన్ను చూడగానే.

"రామనాధంగారి హత్య సందర్భంలో భారతి అనే నర్సుని అరెస్ట్ జేశారటగా?" అడిగాను అతని కెదురుగా కూర్చుంటూ.

"ఔను. ఆమె హంతకి అని కావలసినంత ఋజువుంది!"

"ఏమిటా ఋజువు?"

"తుదివరకూ ఉద్యోగంలో ఉంటే, రామనాధంగారి మరణానంతరం పదివేల రూపాయలొస్తాయని భారతి అభిప్రాయపడింది. ఆయన భారతిని ఉద్యోగంలోంచి



తీసెయ్యాలని నిశ్చయించారు. తనకి పదివేలు రావని భయపడింది భారతి. అదే హత్యకి కారణం!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"కారణం చెప్పారు కాని, ఋజువు చెప్పలేదు. ఐనా, రామనాధంగారు అటువంటి విల్లేదీ రాయలేదుటగా? ఇక ఆ కారణాన్ని ఎలా ఆపాదిస్తారు?" అడిగాను.

"రామనాధంగారు అటువంటి విల్లు రాయని మాట నిజమే. కాని, అటువంటి విల్లేదో రాయబడిందని భారతి అపోహ పడ్డట్టు ఋజువుంది!"

"ఏమిటా ఋజువు?"

"ఆమె తన నోటంటే పక్కింటావిడతో చెప్పిందిట!"

"భారతి కెవరు చెప్పారు?"

"తెలీదు! ఇక ఋజువేమిటో వినండి. రామనాధంగారి శరీరంలో ఆరు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ ఉందని తేలింది. ఆ ఆస్టిసిలిన్ డాక్టరిచ్చిన ఇంజక్షన్ ద్వారానే ఆయన శరీరంలో కెళ్ళిందనీ, ఇతరత్రా వెళ్ళడానికి అవకాశం లేదనీ నిర్ధారణయింది.

పిరంజిలో ఆ మాత్రవేసి, డిస్టిల్ వాటర్ ఎక్కించింది

భారతే. సిరంజీని స్టెరిలైజ్ చేసింది కూడా ఆమే గనక, సిరంజిలో అంతకుపూర్వమే ఆస్టిసిలిన్ ఉండటానికి అవకాశం లేదు.

సిరంజి తన చేతినించి ఒక్క_క్షణం కూడా దూరం కాలేదని ఆమే ఒప్పుకుంది. ఆమె చేతినించి ఆ సిరంజి తిన్నగా డాక్టర్ చేతికెళ్ళింది గనక, ఆస్టిసిలిన్ మరెవ్వరూ ఇచ్చే అవకాశంలేదు.

ఇంతకన్నా పటిష్టమైన సాక్ష్యం ఎలా దొరుతుంది చెప్పండి?"

"ఇన్‌స్పెక్టర్! మీకో విషయం తెలుసా? రామనాధం గారి కొడుకు విశ్వనాధ్, భారతిని పెళ్ళి జేసుకోవాలను కున్నాడట!"

ఇన్‌స్పెక్టర్! నవ్వి—"ప్రమీలగారూ! ఇలాంటి విష యాలు, మీకెలా తెలుస్తాయో నా కర్థంకాదు. ఈ విషయం నాకు తెలీదు సుమండీ!"

"విశ్వనాధ్, రాధని పెళ్ళాడాలని రామనాధంగారి కోరి కట! అది తెలుసా?"

ఇన్‌స్పెక్టర్ తల విదిలించాడు.

"విశ్వనాధ్, భారతిని పెళ్ళిజేసుకోడం ఇష్టంలేకే రామనాధంగారు భారతిని పన్లోంచి తీసెయ్యడానికి తీర్మా నించారట. అదైనా తెలుసా?"

ఇన్‌స్పెక్టర్ మొహంలో కాంతి వచ్చింది. "థాంక్సు! మీరు చెప్పిన విషయాలవల్ల భారతిమీద కేసు మరింత బలపడుతుంది. మీకీ విషయాలు ఎవరు చెప్పారు?"

"విశ్వనాధ్!"

"గుడ్! అతన్నించి స్టేట్‌మెంట్ తీసుకోవాలి. పదివేల రూపాయలేగాక, జీవితానందమే రామనాధంగార్ని హత్య

జెయ్యడానికి భారతికి ప్రోద్బల మన్నమాట! థాంక్స్. మెనీ థాంక్స్!"

నాకు నవ్వాగలేదు. "తొందర పడకండి ఇన్‌స్పెక్టర్! ఒక్క భారతికేగాక, మరిద్దరిక్కూడా హత్య జెయ్యడానికి కారణం ఉంది!"

"ఎవరికి?"

"విశ్వనాథ్‌కూ, రాధకూ!"

ఇన్‌స్పెక్టర్ పలకలేదు.

"భారతిని పెళ్ళిచేసుకోడానికి తండ్రి తన అభ్యంతరం చెబుతున్నాడని విశ్వనాథే ఆయన్ని హత్యచేసుండొచ్చు.... హత్యానేరం భారతి మీదికి వస్తే, మేనబావ తనకి దక్కుతాడన్న ఆశతో రాధే రామనాథంగార్ని చంపుండొచ్చు!"

ఇన్‌స్పెక్టర్ పకపక నవ్వి—"బావుంది! తండ్రి తన పెళ్ళికి అభ్యంతరం చెబుతున్నాడని కొడుకు తండ్రిని చంపుతాడా? అందులోనూ అరవై ఏళ్ళ వృద్ధుడు. హృద్రోగంతో బాధపడుతూ, రేపో మాపో మరోలోకానికి పయనం కాబోతున్నవాడు....చాలా అసమంజసంగా వుంది.

అతను భారతిని పెళ్ళిచేసుకుంటే, తండ్రి ఏం చెయ్యగలడు? రాధమీద అనుమానం చాల తెలివిగా కల్పించారు గానీ, అటువంటివి పుస్తకాలలో తప్ప, నిజ జీవితంలో జరగవు.

అయినా ఆస్టిపిలిన్ని రాధ, రామనాథంగారికెలా ఇచ్చింది? పిరంజిలో ఆ మాత్రలు వేసే అవకాశం ఎవరికీ లేదు. భారతి చేతినించి పిరంజి ఒక్కక్షణం కూడా దూరం కాలేదు. కనుక మరెవ్వరో ఈ హత్య చెయ్యడం అసంభవం!" అన్నాడు.

"నేను భారతితో మాట్లాడవచ్చా?" అడిగాను లేస్తూ.

"తప్పకుండా! కానీ, ఈ కేసు తీసుకోకండి. మీకు అపజయం తప్పదు."

"మీ సలహాకు థాంక్సు!" అంటూ ముందుకు కదిలాను.

౯

నన్ను చూడగానే భారతి లేచి నిలబడింది. ఇరవై ఏళ్ళుంటాయి. సన్నగా,ఎర్రగావుంది. కళ్ళు ఉబ్బి వున్నాయి. పాలిపోయిన మొహం. ఐనా, ఆ మొహంలో అందం వుంది. ఒకరకం గాంభీర్యం కూడా గోచరిస్తోంది.

నన్ను పరిచయం చేసుకుని, "భారతీ! నువ్వు నిజంగా రామనాథంగార్ని హత్యచేశావా?" అడిగాను.

"లేదు!" భారతి కంఠంలో దైన్యంలేదు. నిజాయితీ వుంది.

"ఆయన మరణిస్తే నీకు పదివేలు వస్తాయని ఎవరు చెప్పారు?"

భారతి క్షణం సందేహించి, "మా అమ్మ!" అంది.

"మీ అమ్మకెవరు చెప్పారు?"

"అమ్మస్థానే కొత్తగా వాళ్ళింట్లోవున్న వంటమనిషి."

"ఆమెకెవరు చెప్పారు?"

"ఏమో!"

"ఆ విషయం నువ్వు పక్కింటావిడతో ఎందుకు చెప్పావు?"

"ఏదో మాటల సందర్భంలో రామనాథంగారి ఉదార బుద్ధిని కొనియాడుతూ చెప్పాను."

"విశ్వనాథ్ నిన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడా?"

"ఔను!"

"రామనాథంగారికి ఆ విషయం చెప్పారా?"

"ఆయనే చెప్పారు?"

"రామనాథం గారెప్పుడైనా ఆ విషయం నీతో ప్రస్తావించారా?"

"లేదు!"

"సరే, ఆ రోజు రాత్రి ఏం జరిగిందో వివరంగా చెప్పు!"

"రాత్రి తొమ్మిది గంటల ప్రాంతాల బాబుగారికి గుండె నెప్పి వచ్చింది. నేను వేంటనే డాక్టర్‌కి ఫోన్ జేశాను. కిందికెళ్ళి విశ్వనాథ్‌గారికి చెప్పాను. ఆయనా, రాధా ఇద్దరూ పైకి వచ్చారు.

పది పదిహేను నిమిషాల తరవాత కింద కారాగిన శబ్దమైంది. విశ్వనాథ్, డాక్టర్ని తీసుకురావడానికి కిందికెళ్ళారు. ఆయన ఇంజక్షనిస్తారని నాకు తెలుసు. అందుకే, సిరంజిని స్టెరిలైజ్ చేద్దామని పక్క గదిలో కెళ్ళాను.

ఐదు నిమిషాల తరవాత తిరిగివచ్చాను. ఆ లోగా డాక్టర్ పైకి వచ్చేశారు. నన్ను చూడగానే ఒక ఆస్టిపిలిన్ మాత్ర వేసి, సిరంజిలో డిస్టిల్ వాటర్ ఎక్కించమన్నారు. నేను బీరువాలోంచి ఆస్టిసిలిన్ మాత్రల ట్యూబ్ తీసి, ఓ మాత్ర సిరంజిలో పడేసి, సీసాలోని డిస్టిల్ వాటర్ సిరంజిలో పడేసి, సీసాలోని డిస్టిల్ వాటర్ సిరంజిలో ఎక్కించాను.

వెంటనే సిరంజి డాక్టర్ కిచ్చాను. ఆయన ఇంజక్షన్ చేశారు. పదినిమిషాల తరవాత రామనాథం గారు నిద్రపోయారు. డాక్టర్, విశ్వనాథ్, రాధా గదిలోంచి వెళ్ళిపోయారు. నేను రామనాథంగారి మంచం పక్కన, పడకుర్చీలో పడుకున్నాను.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు. అర్ధరాత్రి రెండు గంటలకి హఠాత్తుగా మెలకువ వచ్చింది. అలా నిద్రపోయి

సందకు తిట్టుకుంటూ, రామనాథంగార్ని చూశాను. ఉచ్ఛ్వాస నిశ్వాసలు లేవు. శరీరంలో చలనం లేదు. నాడి చూశాను. అంతే! కేకేశాను.''

''నువ్వు అస్టిసిలిన్ ట్యూబ్ తీసినప్పుడు అందులో ఎన్ని మాత్రలున్నాయి?''

''పదిహేనున్నాయి! ఒక్కటే తీశాను.''

''పదిహేనున్నాయని నీకెలా తెలుసు? లెక్కపెట్టావా?''

''లేదు. ఒకే ఒక మాత్ర తగ్గి ఉంది. దాన్నిబట్టి చెబుతున్నాను. ఆ ఒక్క మాత్ర నాలుగురోజుల క్రితం రామనాథంగారికి డాక్టరివ్వమంటే ఇచ్చాను.''

''నువ్వొక మాత్ర సిరంజిలో వేశావు. అంటే ట్యూబ్‌లో ఇంకా పధ్నాల్గు మాత్రలుండాలి. మరి తొమ్మిదే ఉన్నాయట. మిగతా ఐదూ ఏమయ్యాయి!''

''నాకు తెలీదు.''

''ఆ ఆస్టిలిన్ ట్యూబ్ ఎక్కడుండేది?''

''బీరువాలో!''

''దానికి తాళం వేసేదానివా?''

''లేదు!''

''ఆ పుస్తకం నీ దగ్గరి కెలా వచ్చింది?''

''అదే నా కర్థం కావడం లేదు!''

''నీ గదిలో కెవరైనా వచ్చి, ఆ పుస్తకం నీ పెట్టెలో పెట్టే అవకాశముందా?''

''ఉంది! నా గది తలుపు ఎప్పుడూ తెరిచే వుండేది. పెట్టెకి తాళం వేసే అలవాటులేదు. అందులో ఖరీదైన వస్తువులేవీ ఉండవు!''

భారతికి ధైర్యం చెప్పి బైలుదేరాను.



6

అక్కణ్ణించి మళ్ళీ ఇన్‌స్పెక్టర్ సంజయ్ ఆఫీసుకెళ్ళి- "ఒక్కసారి మీ టెలిఫోన్ వాడుకోవచ్చా?" అడిగాను.

"దానికేం?" అంటూ ఫోన్ నా ముందుకి తోశాడు.

రామనాథంగారి ఫామిలీ డాక్టర్‌కు రింగ్‌జేసి "హలో, డాక్టర్‌గారూ! నేను, ప్రమీలని! ఒక్క సందేహం. ఆస్టిపిలిన్ మాత్రలు బజార్లో ఎవరికిపడితే వాళ్ళకి దొరుకుతాయా?" అడిగాను.

డాక్టర్ చెప్పిన సమాధానం విని, "థాంక్స్!" అంటూ రిసీవర్ దించాను.

ఇన్‌స్పెక్టర్ నవ్వి—"ఆ ప్రశ్నలు నన్నడిగితే పోయేదిగా! డాక్టర్ సంతకంతో ప్రిస్క్రిప్షన్ లేనిదే ఆస్టిసిలిన్ మాత్ర లివ్వరు. అవి సామాన్యమైన తలనెప్పి మాత్రల మల్లే తెల్లగా, గుండ్రంగా ఉంటాయి" అన్నాడు.

అతని మాటలు పట్టించుకోకుండా, "భారతిమీద ఛార్జి షీటు ఫైలు చేశారా?" అడిగాను.

"ఇంకా లేదు. ప్రస్తుతానికి కస్టడీలో ఉంచాం! ఏం!"

"ఛార్జి షీటు ఫైలు చెయ్యకండి!"

"ఎందుకూ?"

"మీ కేసు గెలవదు గనక! సిరంజిలోకి ఆస్టిసిలిన్ మాత్ర వేసినదీ, డిస్టిల్ వాటర్ ఎక్కించినదీ, దాన్ని డాక్టర్ కిచ్చినదీ భారతే కాబట్టి, ఆ సిరంజి ద్వారానే రామనాధంగారి శరీరంలో ఆస్టిసిలిన్ ఎక్కింది కాబట్టీ భారతే హత్య జేసిందని మీరు అభిప్రాయపడ్డారు.

భారతి చేతిలో సిరంజి వుండగా, ఆ సిరంజిలోకి ఒక ఆస్టిపిలిన్ మాత్రకన్నా అంటే రెండు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ కన్నా ఎక్కువ వేరొకరు వెయ్యడానికి అవకాశంవుంది. అది మీరు గ్రహించలేదు!"

"ఏమిటా మార్గం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యంగా.

"చెబుతాను! ఇప్పుడా ఆస్టిసిలిన్ ట్యూబ్ మీ దగ్గిరుందా?"

"ఉంది!"

"ఇలా ఇవ్వండి!"

ఇన్‌స్పెక్టర్ బల్ల సొరుగులోంచి ట్యూబ్ తీసిచ్చాడు.

ఓ కాగితం అందుకుని, జాగ్రత్తగా ఆ ట్యూబ్‌లోని మాత్రల్ని కాగితంమీద వేశాను. నా కళ్ళు మెరిసాయి.

"చూడండి! వీటిలో పై నాలుగు మాత్రలు ఆస్టిసిలిన్ మాత్రలు. మిగిలిన ఐదు మాత్రలు-సామాన్యమైన తల నెప్పి మాత్రలు. గుర్తులున్నాయి చూడండి. ముట్టుకోకుండా చూడండి" అన్నాను.

ఇన్‌స్పెక్టర్ చూసి, ఆశ్చర్యంతో తలూపాడు.

"ఎవ్వరో ఈ ట్యూబ్‌లోని మాత్రలన్నిటినీ తీసేశారు. అడుగున ఐదు తలనెప్పి మాత్రలు వేశారు. తర్వాత పైన

పది ఆస్టిసిలిన్ మాత్రలు వేశారు. అంటే, ఆ మనిషి ఐదు ఆస్టిసిలిన్ మాత్రల్ని దొంగిలించినట్లు బోధపడు తోంది!"

ఇన్‌స్పెక్టర్ తలూపాడు.

"ప్రతి ఆస్టిసిలిన్ మాత్రలోనూ రెండు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ వుంది. రామనాథంగారి శరీరంలో ఆరు గ్రెయిన్లు అంటే మూడు మాత్రల ఆస్టిసిలిన్ వుంది. ఒకటి భారతి ఇచ్చానని ఒప్పుకుంది. గనక, రెండు మాత్రల ఆస్టిసిలిన్ ఎక్కువగా వుంది. కాని, ట్యూబ్‌లోంచి పోయినవి ఐదు! మిగతా మూడు మాత్రలు ఏమైనట్టు?"

ఇన్‌స్పెక్టర్ అయోమయంగా చూశాడు నన్ను.

"ఈ ట్యూబ్‌లోంచి ఐదు మాత్రలు తీసిన వారెవరో, ఆ ఐదు మాత్రలు డిస్టిల్ వాటర్ బుడ్డీలో వేశారు. అవి కరిగిపోయాయి. అంటే డిస్టిల్ వాటర్లో పది గ్రెయిన్లు ఆస్టిసిలిన్ కలిసింది.

ఇంజక్షన్ ఇవ్వడానికి అందులోంచి కొంత డిస్టిల్ వాటర్ తీసినపుడు, సిరంజిలోకి నాలుగు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ వచ్చి వుంటుంది. ఆ ఆస్టిసిలిన్ నీళ్ళలో కలిసి ఉంటంవల్ల భారతి గమనించలేదు.

ఒకవేళ నీటి రంగు కాస్త మారినా, రాత్రి గనక గమనించి ఉండదు. ఆ నాలుగు గ్రెయిన్లూ భారతి వేసిన ఒక మాత్రా-అంటే రెండు గ్రెయిన్లూ కలిసి మొత్తం ఆరు గ్రెయిన్ల ఆస్టిసిలిన్ ఉన్నట్టు తేలుతుంది!"

ఇన్‌స్పెక్టర్ వెంటనే సార్జెంట్‌ను పిల్చి, అతనికి డిస్టిల్ వాటర్ బుడ్డీ తీసియిచ్చి, లాటరేటరీకి పంపాడు.

"ఆ తలనొప్పి మాత్రలు ఆస్టిసిలిన్ ట్యూబ్‌లోకి ఎందు కొచ్చాయంటారు?"

"ఆ తలనొప్పి మాత్రలే, భారతి నిర్దోషి అని ఋజువు జేస్తున్నాయి. ట్యూబ్‌లోంచి ఐదు ఆస్టిసిలిన్ మాత్రలు మాయమైతే, భారతి గొడవచేస్తుంది. అసలు-పన్నాగమే పారదు!

అందుకే, ట్యూబ్‌లోంచి ఆస్టిసిలిన్ మాత్రలు దొంగిలించ బడ్డాయన్న అనుమానం భారతికి రాకుండా వుండడానికే అడుగున ఐదు తలనెప్పి మాత్రలు పడేసి, పది హేను మాత్రలూ వున్నట్టు చూపించడానికి ఆ మనిషి ప్రయత్నించినట్టు అర్థమౌతోంది.

హత్య జరిగిన తర్వాత ఆ మనిషి తిరిగి అందులోంచి ఐదు మాత్రలు తీసేయడం జరిగింది. అనుమానం భారతి మీదికి రావాలనే అలా చేశారు, కాని, హడావుడిలో పైనున్న ఆస్టిసిలిన్ మాత్రలు తీసుకుని, అడుగునున్న తలనెప్పి మాత్రలు ట్యూబ్‌లోనే వుంచేశారు.

మొత్తానికి ట్యూబ్‌లోంచి మాయమైనవి ఐదు ఆస్టిసిలిన్ మాత్రలు కావు. పది. హత్యకి ముందు తీసి, డిస్టిల్ వాటర్లో కలిపినవి ఐదు. హత్యానంతరం తీసి ఎక్కడో పారేసినవి ఐదు!"

"ఇంతకీ, ఈ పని ఎవరు చేశారంటారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"భారతి మీద హత్యానేరం మోపడమే ఈ హత్యకి కారణమని స్పష్టంగా తెలుస్తోంది. భారతిమీద ఎవరికి ద్వేషం? ఆమెకు పదివేలు వస్తాయని కొత్త వంట మనిషితో ఎవరు చెప్పారో కనుక్కుంటే దోషి ఎవరో తెలుస్తుంది. ప్రస్తుతానికి భారతి నిర్దోషి అని తేలింది కాబట్టి ఆవిడను వెంటనే విడుదల చేయండి" అన్నాను కుర్చీలోనుండి లేస్తూ.

***

తెగిన గాలిపటం

వసుంధర

తలుపు తట్టిన శబ్దంవిని వెళ్ళి తలుపుతీసి కనబడ్డ వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూశాను. అతనెవరో నాకు తెలియదు.

"మన్నించాలి. మీ ఇంట్లో ఎవరితోటీ నాకు పరిచయం లేదు. అయినా కాస్సేపు మీ యింట్లో ఉండడానికి వచ్చాను...." అంటూ అతను చటుక్కున లోపలకు వచ్చి గడియవేశాడు.

ఏం చెప్పాలో నాకు తెలియలేదు. అతనికి సుమారు ముప్ఫైఏళ్ళుండవచ్చు. మనిషి అందంగా వున్నాడు. చేతిలో చిన్న బ్రీఫ్‌కేసుంది.

"ఎవరు మీరు?" అన్నాను.

"ఇంట్లో ఇంకెవరైనా వున్నారా?" అడిగాడతను.

లేరని చెప్పడానికి భయంవేసింది. ఒంటరి ఆడదాన్ని. ప్రాయంలో వున్నదాన్ని. అయినా నా కతన్ని గురించి ఆ విషయమై భయంలేదు.

"లేరు...." అన్నాను సందేహిస్తూనే.

"గుడ్. నా పని సులువయింది...." అన్నాడతను అక్కడేవున్న కుర్చీలో కూర్చుంటూ. చేతిలోని బ్రీఫ్‌కేసును క్రిందపెట్టాడు.

"ఎవరు మీరు?" మళ్ళీ అడిగాను.

"చెబితే దడుసుకుంటారు. నేను మిమ్మల్నేమీ చెయ్యను. కానీ చాలా నీరసంగా వుంది నాకు. భోజనం దొరుకుతుందా మీ యింట్లో...." అన్నాడతను చనువుగా.

"దానికేముంది? వంట చేస్తాను. కానీ మీ పేరు...."

"నా పేరు వీరభద్రం—" అన్నాడతను.

ఆ తర్వాతేమడగాలో తెలియక వంటింటివైపు నడిచాను. అయిదు నిముషాల్లో కాఫీకలిపి తెచ్చి అతనికిచ్చాను.

అతను ఆత్రుతగా కాఫీత్రాగి "చాలా బాగుంది. కానీ మీకంటే కాదు" అన్నాడు.

"వంట్లో కాస్త సత్తువ చేకూరగానే మగాడికి ఒంటరి ఆడదానిలో అందం కనబడుతుంది...." అన్నాను.

"అలాంటప్పుడా ఆడదాని ముఖంలో భయం కనపడాలి. కానీ మీ ముఖంలో అటువంటిదేమీ కనబడ్డంలేదు" అన్నాడు వీరభద్రం.

"భయపడవలసిన కారణమేమీలేదు నాకు. పెళ్ళికాదేమో అనుకునేటందుకు నాకు పెళ్ళయి నాలుగేళ్ళయింది. భర్త వదిలేస్తాడేమో అనుకునేటందుకు ఆయనపోయి రెండేళ్ళయింది. తిండికి ఆధారముండదేమోనని భయపడనక్కర లేకుండా వుద్యోగముంది. ప్రవర్తన సరిగాలేదని ఉద్యోగం పోతుందన్న భయం మొదలే లేకుండా అడపాదడపానా అధికారిని సంతృప్తిపరుస్తూంటాను. పచ్చగా కనిపించే మోడువారిన జీవితం నాది. నేనొక తెగిన గాలిపటాన్ని. ఎవరికీ భయపడవలసిన అవసంలేదు నాకు...." అన్నాను.

"అయితే మంచిచోటకే వచ్చాను. ఈ రోజల్లా నాకు మంచి కాలక్షేపం" అన్నాడు వీరభద్రం.

నేను బాధగా నవ్వి "వంట మొదలుపెడతాను...." అన్నాను.

"నేనూ సాయం చేస్తాను. కానీ ముందుగా నాకో చిన్న సాయం చేయాలి...." అంటూ బ్రీఫ్‌కేస్ తెరిచాడతను. నేనులిక్కిపడ్డాను. ఆ బ్రీఫ్‌కేస్‌లో రక్తసిక్తమైన బట్టలూ, ఒక కత్తీవున్నాయి.

హఠాత్తుగా నాలో వణుకు ప్రారంభమయింది. అతను నా వంక చూడకుండానే "బట్టలూ, కత్తీ ఎక్కడైనా పాతిపెట్టాలి...." అన్నాడు. తర్వాత నా వంక చూసి— "అదేమిటి? అలా వణికిపోతున్నారు-భయమన్నది ఎరుగనన్నారు?" అన్నాడు.

"ఇంకే భయమూలేదు కానీ ప్రాణభయముంది నాకు" అన్నాను.

"అయితే నావల్ల మీకు ప్రాణభయం లేదని హామీయిస్తున్నాను" అన్నాడతను తాపీగా. మామూలు మనిషిని కావడానికి నాకు కొంతసేపు పట్టింది.

"మీరు హత్యచేశారా?" అన్నాను.

"అవును...."

"చాలా తాపీగా చెబుతున్నారు. భయంగాలేదూ?" అన్నాను.

"భయమెందుకు?" అన్నాడతను ఆశ్చర్యంగా.

"హంతకుణ్ణి సమాజం క్షమించదు. వెతికి వేటాడి మరీ వేధిస్తుంది" అన్నాను. హత్య చేయడంవల్ల నిష్కారణంగా ఓ మనిషి ప్రాణాలు తీయడం ఘోరమన్న విషయం మాత్రం నేను నొక్కించి చెప్పలేదు. ఎందుకంటే నాకూ ఒక వ్యక్తిమీద పగవుంది. ఆ వ్యక్తిని చంపడం నా జీవితాశయాల్లో ఒకటి. అయితే హంతకురాలిని కావడం నాకిష్టంలేదు.

వీరభద్రం నవ్వి "నీతిగా వుండని ఆడదాన్ని ఈ లోకం క్షమించదు. అందుకే ఒంటరి ఆడది మగాణ్ణి చూసి భయపడుతుంది. కానీ మీకా భయంలేదు. మీకులాగే నాకూ భయంలేదు. మీకు మగాడంటే భయంలేదు. నాకు హత్యలంటే భయంలేదు" అన్నాడు.

అతను చెప్పిన ప్రకారం నేనొక కత్తెర తెచ్చాను. అతను బ్రీఫ్ కేస్‌లోవున్న గుడ్డలను చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించాడు. ఆ ముక్కల్ని ఫ్లష్‌లో వేసి కొట్టేశాం. తర్వాత కత్తిని శుభ్రంగా కడిగివేశాం. కత్తిని వంటింట్లో అలమారాలో పెట్టాను.

"చాలా థాంక్స్!" అన్నాడతను.

"ఇంక వంట మొదలు పెడతాను...." అన్నాను.

"ఇప్పుడు వంటేం చేస్తారు? ఎవరైనా ఉంటే చూడండి. బయట్నించి క్యారియరు తెప్పించుకుని తిందాం" అన్నాడు వీరభద్రం.



“సాయం చేయాలని భయపడకండి. నేనే అంతా చేస్తాను. క్యారియర్ భోజనం సహించదు నాకు....” అన్నాను.

“అదేంకాదు. వంటపేరు చెప్పి సమయం వృధా చేయాలనిలేదు నాకు. మీతో సరదాగా గడపాలనివుంది” అన్నాడు వీరభద్రం.

“మన్నించండి. మీ ఉద్దేశ్యం నా కర్థమయింది. కానీ హంతకులతో సరదాగా గడపలేను నేను. నా వళ్ళంతా తేళ్ళూ, జెర్రెలూ పాకుతున్నట్లుంది మీ స్పర్శను తలుచుకుంటే....”

వీరభద్రం దెబ్బతిన్నట్లు నా వంక చూసి “లాభంలేదు. మీరలా అనకూడదు. ముందుగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఇప్పుడిలా అంటే నేను సహించలేను” అన్నాడు.

“మీరు హంతకుడని ముందుగా నాకు తెలియదు.”

“తెలిసిచేసినా తెలియకచేసినా ఇచ్చిన వాగ్దానం నిలబెట్టుకోవాలి. హంతకుడూ మనిషే అని గ్రహించాలి మీరు. నా స్నేహితు డొకడున్నాడు. అతని భార్య తప్పుచేసిందన్న అనుమానం కలిగిందతనికి. అప్పట్నించీ ఆమెను

తాకితే తేళ్ళు జెర్రెలూ పాకినట్లుందనేవాడు వాడు. శీలం పోగొట్టుకున్న ఆడది మాత్రం మనిషికాదా అంటూండే వాణ్ని నేను. ఒకవిధంగా ఆడవాళ్ళలో మీరూ, మగ వాళ్ళలో నేనూ ఒకలాంటి వాళ్ళమే. మీరు నన్ను దుర్మా ర్గుడిగా భావించడం అన్యాయం....'' అన్నాడు వీరభద్రం.

అతను నన్ను లోకువ కట్టేశాడు. మాటి మాటికీ తనతో పోల్చుకుంటున్నాడు. అతను చేసేతప్పు, నేను చేసేతప్పు ఒకలాంటి వెలాగౌతాయి? రెండూ సమాజంచే నిషిద్ధం కావించబడిన వైనంత మాత్రాన ఒకటెలా గౌతాయి? నేను చేసేది నేరం కావచ్చు కానీ అతను చేస్తున్నది ఘోరం!''

''ఇంతకీ మీ స్నేహితుడు తన భార్యనేం చేశాడు?''

''నాకో పదివేలిచ్చాడు. చంపేశాను....'' అన్నాను వీరభద్రం తాపీగా.

నా గుండె లదిరాయి. ఒక్క నిముషం నోట మాట రాలేదు....''ఇప్పుడు చేసిన హత్య అదేనా?'' అన్నాడు నెమ్మదిగా.

వీరభద్రం నవ్వాడు. నవ్వును అదుపు చేసుకోవడానికి అతనికి కాసేపు పట్టింది—''ఏనాటిమాట అది? ఎప్పుడో రెండేళ్ళక్రితం చేసిన హత్య అది....'' అన్నాడు.

నేను వెంటనే వీరభద్రానికి దణ్ణంపెట్టి—''ప్లీజ్! ఇక్కణ్నించి వెళ్ళిపో. నిన్ను చూస్తూంటే నాకు భయం వేస్తోంది....'' అన్నాను.

''వెళ్ళడానికి రాలేదు నేను. ఒకరోజు ఆశ్రయం కావాలి నాకు....''

''క్షణం కూడా నిన్ను చూడలేను. ప్లీజ్-వెళ్ళిపో!'' అన్నాను.

వీరభద్రం క్రూరంగా నా వంక చూశాడు—"నన్ను చూసి భయపడే ఆడదంటే చాలా ఇష్టం నాకు. నీకు హంతకుడన్నా హత్యలన్నా చాలా భయంలా వుంది. ఇంకా చాలా కథలు చెబుతాను. ఇక్కణ్ణించి కదలను. నిన్ను వదలను...."

"వంటచేసి వస్తాను...." అని అతని జవాబుకు ఎదురు చూడకుండా వంటింట్లోకి నడిచాను. వంటింట్లో సుమారు గంటసేపు గడిపాను నేను. ఆ గంటలోనూ అతను బాత్రూంలోకి వెళ్ళి స్నానంచేసి వచ్చాడు. వంటింట్లో మాత్రం అడుగుపెట్టలేదు.

భోజనం చేస్తూ అతను—"వంట చాలా బాగుంది. తోడు లేకుండా ఉన్నావు పోనీ నాతో వచ్చేయకూడదూ. పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను...." అన్నాడు.

"వంటకోసమా?" అన్నాను ఏమనాలో తెలియక.

"వంటకు ఇంత అందం జత పడడం ఎక్కడో కానీ జరుగదు...."

"నువ్వు పొగిడినా లాభంలేదు. నీ సమక్షం భరించ లేను...." అన్నాను.

"వెనకటికోసారి సత్యవతి కూడా ఇలాగే అంది...." అని నవ్వాడు వీరభద్రం.

"సత్యవతి ఎవరు?"

"ఎవరైతేయేంలే-పెళ్ళికాని కన్నెపిల్ల. దొరికింది-వదిలిపెట్టమని నన్ను వేడుకుంది. వదలలేదు నేను. ప్రతి ఘటించింది. నా బలం ముందు నెగ్గలేదు. ఓడిపోయింది. లొంగిపోయింది. తర్వాత ఏడ్చింది. ఎంతోసేపు ఏడ వాల్సిన అవసరం లేకపోయింది."

"ఎందువల్ల?"

"నేను చంపేశాను...." అని ఆగాడు వీరభద్రం.

నా ఊపిరి ఆగిపోనట్లనిపించింది—"ఇప్పుడున్నకత్తి సత్యవతిని హత్య చేసిందేనా?" అన్నాను.

"ఆ కత్తి దాని గుండెల్లోనే వదిలేశాను. అయినా ఈనాటి మాటకాదు అది!"

"ఎందుకు చంపేశావ్?" అన్నాను కోపంగా.

"తనంతట తనుగా నాకు లొంగని ఆడదాన్ని చంపేయడం నా హాబీ!"

"ఇదేం హాబీ...." అన్నాను భయంగా.

"నేనేం చేసేది? భగవంతుడు నన్నలా సృష్టించాడు. సత్యవతి నా హాబీవల్ల చచ్చిపోయిన రెండో అమ్మాయి. మూడో అమ్మాయివి నువ్వవుతావనుకుంటాను...." అన్నాడు తాపీగా వీరభద్రం.

"బెదిరిస్తున్నావా?" అన్నాను—"బెదిరింపులకు లొంగే ఘటం కాదిది—"

"నీగురించి నువ్వు చెప్పుకుంటున్నట్లే నాగురించి నేను చెప్పుకుంటున్నాను. దాన్ని బెదిరింపు అనాలనుకుంటే అది నీ యిష్టం. నాకు అభ్యంతరంలేదు...."

"నా శరీరంలో ప్రాణమున్నంతవరకూ నిన్ను ప్రతిఘటిస్తాను" అన్నాడు పట్టుదలగా.

వీరభద్రం లేచి నిలబడి "సరే, కాచుకో. ప్రతిఘటించి ఓడిపోయాక నీ శరీరంలో ప్రాణాలెలాగూ నేనుంచను" అంటూ మీదకు వచ్చాడు.

నేను పరుగెట్టాను. వీధిలోకి వెళ్ళి నలుగుర్నీ పిలవాలని నా కోరిక. అయితే వాడు ఒకేఒక అంగలో నన్నందుకుని తనవైపు లాక్కుని ఓచేత్తో బలంగా నోరు నొక్కాడు.

నేను పెనుగులాడుతున్నాను కానీ వాడిది పశుబలం.



ఆ బలాన్నధిగమించలేనని నాకు అర్థమైంది. అప్పుడే నా బుర్రలో మెరుపులా ఓ ఉపాయం మెరిసింది. వీణ్ణి ఎదిరిస్తే ఈ క్షణంలో తప్పించుకున్నా ఎప్పటికైనా ప్రమాదం తప్పదు. కానీ మంచి చేసుకుని నా జీవితాశయం నెరవేర్చుకుంటే?

నా చేతులతో ప్రేమగా వాడివీపు మీద నిమిరి నాలోని మార్పును సూచించాను.

"ప్రాణభయంతో ప్రతిఘటన ఆపేసేవా?" అన్నాడు వీరభద్రం విజయగర్వంతో "కానీ నా దృష్టిలో నువ్వు ప్రతిఘటించి ఓడిపోయినట్లే లెక్క!"

"అదేం కాదు. నీకు నేను మనస్ఫూర్తిగా లొంగిపో దల్చుకున్నాను. అయితే ఇప్పుడుకాదు. నాకోసం నువ్వో పని చేసిపెట్టాలి. ఆ పని చేసిపెడితే జీవితాంతం నీకు కృతజ్ఞురాలినై వుంటాను."

వీరభద్రం అనుమానంగా నావైపు చూపి "మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నావా?" అన్నాడు.

మోసమెందుకు చేస్తాను. నాలో ప్రతీకార జ్వాలలు చాలా కాలంగా రగులుతున్నాయి. అవి ఆరాలంటే ఈ వీరభద్రంలాంటివాడు కావాలి. వీరభద్రాన్ని ఆ దృష్ట్యా చూస్తే దేవుడిచ్చిన వరంలా భావించాలి.

నేను నా భర్త ఎంతో ఆనందంగా సంసారం చేసే వాళ్ళం. ఆయన ఎంతో మంచివారు. అందానికితగ్గ మంచి హృదయముందాయనకు. నా సర్వస్వమూ ఆయన కర్పించు కుని నిశ్చింతగా జీవితం వెళ్ళబుచ్చేదాన్ని. జీవితంలోకి చిందిన విషబిందువు పాండురంగారావు.

పాండురంగారావు ఆయన స్నేహితుడు. తరచుగా మా ఇంటికి వస్తూండేవాడు. అతనికి బాగా డబ్బుంది. డబ్బు ఎరచూపి ఆయన్ను బాగా వశపర్చుకున్నాడు. స్నేహితుడు తనకు చేసే సాయం వెనుక, తనపట్ల చూపే అభిమానం వెనుక వున్న వుద్దేశ్యం ఆయనకు తెలియలేదు.

ఒకరోజు పాండురంగారావు తన దురుద్దేశ్యాన్ని నా ముందు బయటపెట్టాడు. నేను చెడామడా తిట్టాను. క్షమించమని వెళ్ళిపోయాడు. ఆయనకీ విషయం చెప్ప లేదు నేను.

మళ్ళీ మరోసారి పాండురంగారావు నా ముందు తన కాంక్ష బయటపెట్టాడు. నగలు, డబ్బు ఆశ చూపించాడు. ఆ ఆశలకు లొంగే ఆడవాళ్ళు వేరే వుంటారని చెప్పి తిట్టి పంపించేశాను.

ఈ విషయ మాయనకు ఎలా చెప్పాలో తెలియడంలేదు నాకు. మొట్టమొదటిసారే చెప్పేసివుంటే ఏ గొడవా వుండేది కాదు. వ్యవహారం ముదురుతుందని నేను అనుకో లేదు. నేను ఆయనకు చెప్పకపోవడాన్ని పాండురంగారావు అలుసుగా తీసుకుంటాడని కూడా నేను అనుకోలేదు.

చాలా ప్రయత్నాలు చేసి విసిగిపోయి పాండురంగారావు నాకు ఆఖరి హెచ్చరిక చేశాడు—నేను కనుక తనకు లొంగని పక్షంలో అతను నా భర్తను చంపేస్తాడుట. ఒకే ఒక్కరోజు గడువుందని చెప్పాడు. ఆ పరిస్థితిలో ఏం చేయాలో తెలియక ఓ పదిరోజులపాటు నా దూరపు బంధువుల ఇంటికివెళ్ళి వుండాలని నిశ్చయించుకున్నాను. అక్కడవున్న అయిదోరోజున టెలిగ్రాం వచ్చింది.

అంతా అయిపోయింది. పాండురంగారావు అన్నంత పనీ చేశాడు. నా భర్త హత్యచేయబడ్డాడు. పోలీసులు ఏమీ చెప్పలేక, చెయ్యలేక అసమర్థులై ఊరుకున్నారు. ఆ హత్య వెనుకవున్న కారణాన్ని నేను పోలీసులకు చెబితే పాండురంగారావు పట్టుబడి వుండేవాడు.

కానీ ఇదు పురుషుల ప్రపంచం. నేను చెప్పే నిజం నిందగా నా పీకకు చుట్టుకోవచ్చు. పాండురంగారావు తనకూ, నాకూ సంబంధముందని అబద్ధం చెప్పవచ్చు. ఆ కారణంగా భర్తకు నిజం తెలిసి పోయిందన్న బెంగతో నేనే అతన్ని చంపించాననవచ్చు. పోలీసులెవరి మాటలు నమ్ముతారో నాకు తెలియదు. కానీ ఎవరికీ తెలియని ఈ సాక్ష్యాన్ని బయటపెట్టి పోలీసుల గుప్పెట్లో ఇరుక్కోవడం నాకే మాత్రమూ ఇష్టంలేదు. ఈ హత్యకూ నాకూ ఏదో రకంగా సంబంధమున్నట్లు బయటి ప్రపంచానికి తెలియడం నా కిష్టంలేదు.

ఓ పర్యాయం పాండురంగారావుని కలుసుకున్నాను. మొసలి కన్నీళ్లు కార్చాడు. తిట్టాను. చుట్టూ చూశాడు. ఎవరూ లేరని గమనించి "నా మాట వినక నీ భర్తను పోగొట్టుకున్నావు.... ఇప్పటికైనా మించింది లేదు. నువ్వు ఊఁ అంటే నిన్నుంచుకుంటాను. ఏలోటూ రాకుండా

చూసుకుంటాను" అన్నాడు. నాకు వళ్ళు మండిపోయింది.

"నా ఉసురు ఊరికేపోదు. ఇంత కింతా అనుభవిస్తావ్!"

"ఇలాంటి శాపాలు ఫలించే మాటైతే ఎప్పుడో చచ్చి వుండేవాణ్ని. అనుకున్నది సాధించడం నా ప్రత్యేకత. బాగా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు...."

"నా భర్తను చంపిన వాడి స్పర్శ నాకు అసహ్యం. ఊహలో కూడా అది భరించలేను" అని అక్కణ్నించి వచ్చేశాను. తర్వాత ఆ ఊరువదిలి ఇక్కడకు చేరాను. ఏదో రోజులు గడిచిపోతున్నాయి. కానీ నా పగ మాత్రం చల్లారడంలేదు.

"నువ్వో మనిషిని చంపాలి...." అన్నాను వీర భద్రంతో.

వీరభద్రం ఆశ్చర్యంగా నావంక చూసి-"హంతకుల్ని అసహ్యించుకునే నువ్వు నానుంచి హత్యను కోరు తున్నావా?" అన్నాడు.

"నిన్నేం కోరినా ఇవ్వలేవుగదా—హత్య అయితే తప్పక చేయగలవు...."

"ఎవరినో చెప్పు...." అన్నాడు వీరభద్రం.

"వాడి పేరు పాండురంగారావు...." అన్నాను.

వీరభద్రం ఉలిక్కిపడ్డట్లు కనబడ్డాడు—"పాండురంగా రావు" అంటూ!....అనుమానంగా నావంక చూశాడు.

ఊరు వగైరా వివరాలు చెప్పాను.

"ఎందుకతన్ని చంపడం?" అన్నాడు వీరభద్రం.

"కారణాలడగవద్దు. వాడిని చంపగలిగితే జీవితాంతం నీకు ఋణపడి వుంటాను...." అన్నాను.

"అయితే నువ్వు నాకు ఋణపడి వున్నట్లే లెక్క!" అన్నాడు వీరభద్రం.

"ఎందుకని?"

"నేను పాండురంగారావుని చంపేశాను...."

ఉలిక్కిపడి—"నేను నమ్మను...." అన్నాను.

"నిజంగా చంపేశాను...." అన్నాడు వీరభద్రం.

"నన్ను మోసం చేయవద్దు. నీకు నామీద మోజుగా వుంది. అందుగురించి ఇప్పుడే ఈ క్షణంలో నన్ను లొంగ దీసుకోవడంకోసం ఈ అబద్ధం చెబుతున్నావ్"-అన్నాను.

"నిన్నెలా నమ్మించాలో నాకు తెలియదు...." అంటూ వీరభద్రం పాండురంగారావు ఇంటినీ, ఆ పరిసరాలనూ, అతని ఆకారాన్నీ, లక్షణాలనూ వర్ణించి—"మోసం చేయడం నాకు అలవాటులేదు. ఆ ఆరోపణను కూడా నేను సహించను. నేను చంపిన వ్యక్తినే నువ్వు చంపించాలనుకోవడం కాకతాళీయమనుకుంటాను. ఈ రోజు నువ్వు కడిగిన కత్తిమీద వున్న రక్తం పాండురంగారావుదే...." అన్నాడు.

నాలో నమ్మకంతోపాటు వుత్సాహం కూడా పెరిగింది.

చటుక్కున వీరభద్రం దగ్గరగా జరిగి అతన్ని ముద్దు పెట్టుకున్నాను—"యూ ఆర్ రియల్లీ లవ్‌లీ-నా జీవితాశయం నెరవేర్చావ్-ఇంక నేనేమైనా ఫరవాలేదు. నువ్విప్పుడు నా కళ్ళకు హంతకుడిలా కనబడ్డంలేదు. దేవుడు పంపిన సహృదయుడివిలా కనబడుతున్నావు..."అన్నాను.

"నా అదృష్టం. ఇంతటి అందాన్నీరోజు అంతం చేయాల్సొస్తుందని భయపడ్డాను. ఈ అందం జీవితాంతం నాకు ఋణం తీరుస్తూ వుంటానంటే అంతకంటే కోరుకోవలసిన దేముంది?" అన్నాడు వీరభద్రం పరవశంలో.

"నా ఆనందం మాటల్లో చెప్పుకోలేను. ఏ దుర్మార్గుడిని చంపాలని నేననుకున్నానో ఆ దుర్మార్గుణ్ని చంపిన మనిషిని ఆనందపరిచే అవకాశం రావడం నా అదృష్టం."

ఈ మాటలు నేను మనస్ఫూర్తిగా అన్నాను. ఇప్పుడు వీరభద్రం స్పర్శ నాకు అసహ్యకరంగా అనిపించడంలేదు. నన్ను నేనే అతనికి అర్పించుకున్నాను. ఆ రోజుల్లా కబుర్లు లేకుండా ఇద్దరమూ ఎంతో ఆనందంగా గడిపాము.

"నీ ఉత్సాహం నన్ను వెర్రెత్తిస్తోంది. ఇలాంటి ఉత్సాహం నీలో ఉరకలు వేయడంకోసం రోజుకో హత్య చేయడానికైనా నేను సిద్ధమే!" అన్నాడు వీరభద్రం.

అతను చాలా ఉత్సాహంగా తన ప్రతాపానికి సంబంధించిన కథలు చెబుతున్నాడు.

"నువ్వు చాలా మంచివాడివిలాగున్నావ్—అసలు హత్యలు చేయడమెందుకు మొదలుపెట్టావ్?" అన్నాను.

"చాలా మామూలు కథ నాది. కొంతవరకు చదువుకున్నాను. నావాళ్ళన్నవారెవ్వరూ లేక చదువు కొనసాగించలేక కష్టపడి పనిచేయాలనుకున్నాను. ఓ పెద్దాయన యింట్లో

తోటమాలిగా చేరాను. వాళ్ళింట్లో ఏదో దొంగతనం జరిగితే ఆ నేరం నా మీదకు వచ్చింది. వెనకా ముందూ ఆలోచించకుండా చావగొట్టేశాడాయన. తర్వాత నిజం బయటపడింది. పోయిందనుకున్న డబ్బు నాయన బ్యాంకులో జమకట్టి మర్చిపోయాడట. ఆ రోజు నాకు విపరీతమైన ఆవేశం వచ్చేసింది.

ఓ సారి ఆయన్ను చంపడానికి ప్రయత్నం చేశాను. ఆ సమయంలో ఆయన పక్కనవున్న ఓ పెద్దమనిషి ఆయన్ను రక్షించి నన్ను చేరదీశాడు. నన్ను కిరాయి హంతకుడిగా మార్చింది ఆయనే! ఒకటి రెండు హత్యలకు తడబడ్డాను కానీ ఇప్పుడు నాకు హత్య చేసినా ఏమీ అని పించదు...'' అన్నాడు వీరభద్రం.

హఠాత్తుగా నాకో అనుమానం వచ్చింది ''నినో్న ప్రశ్న అడగనా?'' అన్నాను.

''నిద్రవస్తోంది. రేపు చెబుతాన్లే....'' అన్నాడు వీర భద్రం. అతని కళ్ళు మూతలు పడుతున్నాయి. మాట ముద్దగా మారింది.

''అలాకాదు. ఇప్పుడే చెప్పాలి. పాండురంగారావును చంపమని నిన్ను పురమాయించిందెవరు?'' అన్నాను.

''ఎవరూ పురమాయించలేదు. నాకు నేనే కలగజేసుకుని వాణ్ణి చంపేశాను'' అన్నాడు వీరభద్రం మత్తుగా.

ఆ జవాబు నాకు తృప్తిగాలేదు. వీరభద్రం అబద్ధమాడు తున్నాడేమోనని నాకు అనుమానం కలిగి పెరగసాగింది. ''అలాకాదు కారణం చెప్పాలి?'' అన్నాను.

''వాడు పచ్చిమోసగాడు. నాకో పదివేలు బాకీ వున్నాడు. ఈవేళ, రేపు అని తిప్పుతున్నాడు. రెండేళ్ళ

ఎదురు చూసి ఆఖరికి నిన్న చంపేశాను....” అన్నాడు వీరభద్రం ఆవులిస్తూ.

“డబ్బెందుకు బాకీ వున్నాడు నీకు?”

“వాడికో, హత్య చేసిపెట్టాను. ఎవడో గవర్నమెంటు ఉద్యోగి. ముందు పాతికవేలడిగాను. తర్వాత వాణ్ని చంపడం కష్టంకాదని తెలిసి పదివేలకు ఒప్పుకున్నాను. అప్పట్నించీ యిప్పటివరకూ డబ్బు ఇవ్వలేదు....”

“పాండురంగారావు కూడా హత్యలు చేసిపెట్టి వాడి పాపాల్లో భాగం పంచుకున్నావా నువ్వు?ఎవరేమిటి నీ చేతుల్లో చచ్చిన ఆ దురదృష్టవంతుడు?”

“శోభనాచలం....” అని పక్కకు ఒరిగిపోయాడు వీరభద్రం.

అంతే! నాకు నోటమాట రాలేదు. శోభనాచలం నా భర్త!

నా భర్తను చంపాలనుకున్న పాండురంగారావు, వీరభద్రం కారణంగానే ఆ పని చేయగలిగాడు. వీరభద్రం విషయం తెలియని నేను పాండురంగారావును చంపాలనుకున్నాను. నా భర్తను హత్యచేసినందుకు ప్రతిఫలం లభించలేదన్న కారణంగా పాండురంగారావును వీరభద్రం చంపేస్తే అందుకతన్ని మెచ్చుకుని నా సర్వస్వమూ అర్పించుకున్నానతనికి. ఎంత పిచ్చిదాన్ని నేను!

నా భర్తను చంపిన హంతకుడికి ఆనందంగా నా శరీరం అర్పించుకున్నాను.

అయినా నా తెలివితక్కువతనం కాకపోతే హంతకుడికి మనసెక్కడిది? వీళ్ళూ వాళ్ళూ అనేమిటి—డబ్బిస్తే ఎవర్నైనా చంపేసే కిరాయి హంతకుడు వీరభద్రాన్ని తాత్కాలి

కంగా నేను మనిషిలా భావించాను.

నేను వీరభద్రాన్ని పరిశీలించి చూశాను. ఒళ్ళు తెలియని నిద్రపట్టేసింది అతనికి.

అక్కణ్ణించి నెమ్మదిగా వంటింట్లోకి వెళ్ళి అతని కత్తి తీసుకువచ్చాను.

ఇంతకంటే మంచి అవకాశం రాదు. ఈ కిరాయి హంతకుడి పీడ ప్రపంచానికిక వుండరాదు.

నా చేయి పైకిలేచింది.

మనోహరమైన ప్రకృతిలో భగవంతుడు విషసర్పాలనూ సృష్టించాడు. వాటినాడించగల పాములవాళ్ళనూ సృష్టించాడు. కంటబడ్డ విషసర్పాన్ని చంపకుండా వదలడు మనిషి.

ఇప్పుడు నేనేం చేయాలి?

హత్యచేస్తే ఆ నేరాన్ని దాచగలగాలి. దాచి బ్రతకాలి. దాచలేకపోతే నా బ్రతుకు నవ్వులపాలవుతుంది.

ఇప్పుడు నాకు రెండేరెండు మార్గాలున్నాయి.

ఒకటి వీరభద్రాన్ని చంపి నన్ను నేను చంపుకోవడం! ఆ విధంగా నాకు మనశ్శాంతి లభిస్తుంది.

రెండు-వీరభద్రాన్ని చంపి శవాన్ని దాచడంగానీ పోలీసుల దగ్గరకు వెళ్ళి ఆత్మరక్షణకోసం, చంపాక కానీ చెప్పాలి. ఈ కథనాన్ని పోలీసులు నమ్మలేరు. ఎందుకంటే వీరభద్రం పేరు వాళ్ళ రికార్డులో ఉండేవుంటుంది.

నా చేతిలో కత్తి అలానేవుంది. నిర్ణయం చేసుకోడానికి ఎంతసేపు పడుతుందో అసలు నేనేం చేస్తానో నాకు తెలియదు. ***

మల్లేశ్వరరావు వేట

పాఠకుల పరిశోధన పోటీ-77

(బహుమతి రు. 50/-లు నగదు)

అర్ధరాత్రి!

చిక్కని చీకటి—

ప్రకృతి ప్రశాంతంగా నిద్రపోతోంది-కీచురాళ్ళు అలా

పిస్తున్న నేపథ్య సంగీతం, కప్పల బెకబెకలూ తప్ప!

హెడ్‌లైట్స్ వెలుగులో రయ్‌మని అడివిలో దూసుకు పోతోంది జీప్.

జీప్‌లో ఇద్దరు యువకులున్నారు.

వారిలో ఒక వ్యక్తిపేరు అన్వర్ హుస్సేన్. అతను హుస్సేన్‌గానే ఆందరికీ తెలుసు.

రెండవ వ్యక్తి మధు. డ్రైవింగ్ సీట్లో వున్నాడతను. వేటంటే మహా మక్కువ. అందుకే ఆ యిద్దరికీ జత కలిసింది.

జీప్ చిన్న చిన్న కుదుపులతో అడివిలోనికి చొచ్చుకు పోతోంది.

హుస్సేన్ బీర్‌బాటిల్ ఓపెన్‌చేసి, గడగడ తాగేసేడు. జేబులోనుంచి సిగరెట్ తీసి వెలిగించుకుని, గుండెలనిండా పొగపీల్చి వదిలేడు. అతనిలో నూతనోత్సాహం బయల్దేరింది.

"మధూ! మనం బయల్దేరి రెండుగంటలైనా ఒక్క జంతువూ మన కంటబడలేదు" అన్నాడు హుస్సేన్.

మధుకి జంతువులకోసం వెదుకుతూ పోవడం యిష్టం. హుస్సేన్‌కి మాటువేసి జంతువులను పట్టడం యిష్టం.

"ఇంకా మనం ముందుకు పోవడం ప్రమాదం. ఇక్కడే ఎక్కడో మాటువేసి వుంటే మనకొక జంతువైనా దొరుకుతుంది" అన్నాడు హుస్సేన్ తిరిగి.

"ఆల్‌రైట్! కాసేపు ఇక్కడే వుందాం. లైట్లన్నీ ఆఫ్ చేసేద్దాం. ఒక పావుగంట చూసి జంతువులేవీ రాక పోతే, మనం మరి కాస్త ముందుకిపోయి, ఏ చెట్టు మీదనో ఈ రాత్రి కాలక్షేపం చేయాలి" అన్నాడు మధు.

మధు సిగరెట్ వెలిగించుకున్నాడు.

జీప్ హెడ్‌లైట్లు ఆఫ్ చేసేడు.

జీప్‌కి ముందువేపు టాప్ దగ్గర ఫ్లడ్‌లైట్ బిగించబడి వుంది. మధు చేతిలోను, హాన్సేన్ చేతిలోను పొడుగాటి తుపాకులు రెండు వున్నాయి.

అయిదు నిమిషాలు గడిచేయి.

పొదల్లో ఏదో అలికిడి అయింది.

కళ్ళు చిట్లించి చూసేడు హాన్సేన్.

అదిరిపడ్డాడు. అతని చేతులు తుపాకీ ట్రిగ్గర్ చుట్టూ బిగుసుకుపోయేయి. అతని మొహం గంభీరంగా మారిపోయింది.

"మధూ! క్విక్....ఫ్లడ్‌లైట్స్ ఆన్‌చెయ్....హారియప్!" అని అరిచేడు.

చటుక్కున స్విచ్ ఆన్ చేసేడు మధు.

అదే సమయంలో ఒక పులి పొదల్లోనుంచి బయటికి వచ్చింది.

ఫ్లడ్‌లైట్ వెలుగటం పొదలోనుంచి పులి బయటికి రావడం ఒకేసారి జరిగింది.

పులిమీద వెలుగుపడినట్లు ఎడ్జస్ట్ చేసేడు మధు. పులి కళ్ళల్లోకి వెలుగు కిరణాలు పడడంతో అడుగుపడడంలేదు.

హాన్సేన్ తుపాకీ తీసుకుని, మెల్లగా నేలమీద అడుగు మోపేడు.

గురి చూసి కాల్చేడు రెండుసార్లు!

ఢాం! ఢాం!!

రెండుసార్లు తుపాకి గర్జించింది. అడివి అంతా మారు మ్రోగింది.

పులి బంతిలా ఎగిరిపడింది. గిలగిల తన్నుకుంటూ రెండు నిమిషాల తర్వాత ప్రాణాలు విడిచింది.

మరో అయిదు నిమిషాలు ఆగి, అది నిజంగా చచ్చిం దని నిర్ధారణ చేసుకున్న తర్వాత, గర్వంగా నవ్వుకుని, పులి దగ్గరకు వెళ్ళేడు హుస్సేన్.

మధు, హుస్సేన్ కలిసి పులిని యీడ్చుకువచ్చి, కష్టం మీద జీప్‌లోనికి ఎక్కించగలిగేరు.

* * *

అడివిలో—హుస్సేన్ చూపించినచోట ఆగింది పోలీస్ జీప్.

జీప్‌లోనుంచి నల్గురు పోలీసులు, ఇన్‌స్పెక్టర్ నారాయణ రావ్, హుస్సేన్ దిగేరు.

హుస్సేన్ మొహంలో విచారం గూడు కట్టుకునుంది. జుట్టు రేగివుంది. రాత్రంతా నిద్రలేనట్టుగా కళ్లు ఎర్రబారి చింతనిప్పుల్లా మండుతున్నాయి.

డెడ్‌బాడీ ఎక్కడన్నా దొరకుతుందేమో వెదకమన్నాడు యిన్‌స్పెక్టర్, పోలీసులను.

నల్గురు పోలీసులూ చుట్టు ప్రక్కలంతా గాలించడం మొదలు పెట్టేరు.

జంగిల్ బూట్లు, చిరిగి పీలికలైపోయిన బట్టలు, పొడు గాటి తుపాకి-తీసుకువచ్చి యిన్‌స్పెక్టర్ ముందుంచేరు పోలీసులు.

ఇన్‌స్పెక్టర్ నారాయణరావ్ వాటిని పరిశీలించేడు. జీప్ దగ్గిర నిల్చున్నాడు.

"మిస్టర్ హుస్సేన్! ఏం జరిగిందో మరోసారి వివ రంగా చెప్పండి" అన్నాడు.

హుస్సేన్ గొంతు సవరించుకుని చెప్పడం మొదలు పెట్టేడు.

"మధూ, నేనూ వారానికోసారైనా వేటకు వెళుతుంటాం.

జంతువులకోసం వెదుకుతూ జీప్‌లో వెళ్ళడం సరదా మధుకి. అర్ధరాత్రయినా అతనికి భయంలేదు.

నిన్నటిరోజున మధు నన్ను కలుసుకుని వేటకు వెళ్దాం పదమన్నాడు. నేను సరేనన్నాను. అతను డ్రైవ్ చేస్తున్నాడు. జీప్ అడివిలో అడుగుపెట్టింది. రాత్రి పన్నెండు గంటలవరకూ ఏ జంతువు కంటబడలేదు.

చివరకు లైట్స్ ఆఫ్‌చేసి, చీకట్లో కూర్చున్నాక ఒక పెద్దపులి పొదల్లో నుండి బయటికి వచ్చింది. వెంటనే ఫ్లడ్‌లైట్ వెలిగించి, ఆ ఫోకస్ దానిమీద పడినట్లు ఎడ్జస్టు చేసి, గురిచూసి కాల్చేను. ఎగిరిపడింది. దాన్ని జీప్‌లో వేసుకుని తిరుగుప్రయాణం పట్టాం.

ఈ సారి మధు నన్ను డ్రైవ్ చేయమన్నాడు. తను తుపాకి తీసుకుని పొజిషన్‌లో కూర్చున్నాడు.

పెద్దపులిని చంపినందుకు మా యిద్దరికీ ఎంతో ఆనందంగా వుంది.

కొద్ది దూరం రాగానే, హఠాత్తుగా మా ముందు ప్రత్యక్షమైంది మరోపులి!

"మధూ! టేక్ ఏక్షన్!" చిన్నగా అరిచేను. అది గాండ్రించి మీదకు దూకడానికి ప్రయత్నించేస్తోంది. ఫ్లడ్ లైట్ వెలిగించాను. ఆ వెలుగులో దాని ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది.

అది తుపాకులకు జడిసే రకంగా లేదు. క్రోధంగా, క్రూరంగా చూస్తూ మా మీదకు దూకే ప్రయత్నంలోనే కదుపుతుంది.

మధు మెల్లిగా జీప్‌లోనుంచి నేలమీదకు అడుగు పెట్టేడు. దాన్ని చూస్తుంటే మధు చేతులు సన్నగా వణకసాగేయి. నేనుకూడా తుపాకి తీసుకుని పొజిషన్‌లో వుంచేను.

"ఢాం!" అని తుపాకి పేలింది.

నిజానికి అంత షార్ట్ రేంజ్‌లో తుపాకి గుండు తగిలి నందుకు పులి కనీసం నాలుగైదు అడుగులు ఎత్తు ఎగిరి పడాలి. కాని అది చెక్కు చెదరలేదు.

బులెట్ మిస్సయిందన్న మాట!

ఆ తర్వాత ఊహించని పరిణామమే జరిగింది!!

బులెట్ మిస్సవడంతోనే అకస్మాత్‌గా ఎగిరి, సరిగ్గా మధు మీదకు దూకింది పులి. మధు చేతిలోని తుపాకి దూరంగా ఎగిరిపడింది.

నాకు కాళ్లూ, చేతులు ఆడలేదు. గురిచూసి కాల్చే అవకాశంలేదు. నేనే మాత్రం ఆలస్యంచేసినా నా ప్రాణాలు పోవడం కూడా ఖాయం.

వెంటనే జీప్ స్టార్ట్ చేసేను.

"రాత్రి జరిగింది ఇదే" అని ముగించేడు హుస్సేన్.

ఇన్‌స్పెక్టర్ నారాయణరావ్ అంతా విని తల పంకించేడు.

తుపాకిలో లోడ్ చేయబడిన గుళ్ళను చూసేడు. అందులోనుంచి ఒకే బులెట్ మాత్రమే ఉపయోగించ బడింది. అంటే హుస్సేన్ చెప్పింది నిజమన్నమాట!

ఇంకేమైనా ఆధారాలు దొరుకుతాయేమోనని వెదికేడు. అతని ప్రయత్నం ఫలించలేదు.

"ఆల్‌రైట్! మీ స్టేట్‌మెంట్ కాగితంమీద రాసివ్వండి" అన్నాడు.

అలాగే నన్నాడు హుస్సేన్.

* * *

మధును ప్రమాదవశాత్తూ జరిగిన మరణంగా ధృవ పరుస్తూ, ఫైలుని క్రైంబ్రాంచికి అప్పగించేడు యిన్

స్పెక్టర్ నారాయణరావ్.

నాలుగురోజులు గడిచేక నారాయణరావ్‌కి క్రైంబ్రాంచి నుంచి పిలుపు వచ్చింది.

"మిస్టర్ నారాయణరావ్! నువ్వు యిన్‌స్పెక్టర్‌గా వుండేందుకు తగవు. కాకపోతే, హత్యను పట్టుకుని, ప్రమాదవశాత్తూ జరిగిన మరణం అంటావేమిటయ్యా?" అని అడిగేడు క్రైంబ్రాంచి ఏ.సి.పి.

"హత్యా?" ఆశ్చర్యపోయేడు నారాయణరావ్.

"అవును. హుస్సేన్ తన చేతికి మట్టి అంటకుండా చేసిన హత్య ఇది. ఆ విషయం ఈ స్టేట్‌మెంట్ చదివేక స్పష్టంగా తెలుస్తోంది."

"ఇది హత్య అని మీరెలా చెప్పగలుగుతున్నార్సార్?"

తనకు తెలియని ఆధారం క్రైంబ్రాంచివాళ్ళకి ఏం దొరికిందో తెలియడం లేదు నారాయణరావ్‌కి.

* * *

[ఇదీ కథ. దీనిలో అన్వర్ హుస్సేన్‌ను హంతకుడిగా నిరూపించే ఆధారాలు ఏమైనా కనిపిస్తాయేమో పరిశోధించండి. మీ పరిశోధనా వివరాలను ఒక పోస్టుకార్డు సైజు తెల్లకాగితంపై వ్రాసి, యీనెల 10 వ తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమంగా పరిశోధించిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి పాతిక రూపాయలు బహుమతి పంపగలము.

హోం. డె. సభ్యులు కాని వారు తమ జవాబుతో 0-50. పై.లు స్టాంపులు జతపరచాలి. సభ్యులు అయితే తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఫలితాలు డిసెంబరు' 78 నెల సంచికలో ప్రకటిస్తాము. తుది నిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

దుర్యోధనుడి ఆత్మహత్య?

(పోటీ నెం-75 ఫలితాలు)

దుర్యోధనరావు ఆత్మహత్య చేసుకొనేముందు చేతులకు 'గ్లవ్స్' వేసుకొని ఉన్నాడు. కాని చనిపోయేముందు గ్లవ్స్ తీయలేదు. అదే ముఖ్యమైన ఆధారం.

ఈ కేసును అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఇద్దరు పాఠకులకు చెరొక పాతిక రూపాయలు బహుమతి పంపబడుతుంది.

1. శ్రీమతి వి. హైమవతి, బి.ఎస్.సి., c/o డాక్టర్ వి. వి. రంగారెడ్డి, 9/243, టి. బి. రోడ్, గుంతకల్-2.

2. శ్రీ జె. ఎస్. ఆర్. కె. ప్రసాద్, ఎమ్. ఎస్. సి., ఆఫీసరు- ఆంధ్రాబ్యాంకు, తిలక్ స్ట్రీట్, కాకినాడ-1.

సరియైన సమాధానం వ్రాసిన ఇతర పాఠకులు:

1. ఐ. హేమప్రభ, బేగంపేట. 2. పి. నాగక్రిష్ణ,దుర్గ. 3. డి. కల్యాణిదేవి, శింగరాయకొండ.4. మురారి సుధాకర్ గుప్త, తిరుపతి. 5. పి. వి. ఆదిలక్ష్మి, మెదక్. 6. బాలేపల్లి ఎల్లారావు, అప్పర్ సీలేరు ప్రాజెక్టు. 7. పి. వెంకటరావు, తిరుపతి. 8. ఎల్. రామగోపాల్, వెంకటగిరి. 9. ఎమ్. వి. ఎస్. జయలక్ష్మి, ఖైరతాబాద్. 10. .ఐ డి. గోపాలక్రిష్ణమూర్తి, నంద్యాల. 10. డి. శ్యామలాదేవి, నారాయణగూడ.

11. పసునూరి గంగాధర్, మేడిపల్లి. 12. జి. సూర్యకాంతం, సునాబేడా. 13. ముత్యాల పద్మావతి, మండపేట. 14. ఎన్. వాసుదేవాచార్, బెంగుళూరు. 15. షేక్ ఇబ్రహీం, మహబూబ్‌నగర్. 16. ఎస్. సత్యలత,విజయ

నగరం. 17. పి. రాజేష్, దర్పల్లి. 18. రాంరాజు ప్రభా కరరావు, సూర్యారావుపేట 19. జి. పార్థసారధి, తెనాలి. 20. జి. నాగేశ్వరరావు, బైకుంఠపూర్.

21. డి. ఉమాదేవి, కొస్గి. 22. ఆర్. రమాదేవి, విశాఖపట్టణం. 23. కె. నాగభూషణ, దేవనహళ్ళి. 24. పి. వి. ఆర్. జి. శంకర్‌రావు, జమాల్ సిమెంట్ వర్క్స్. 25. టి. ధనలక్ష్మి, విజయనగర్ కాలనీ. 26. జె. కృష్ణారావు, గుంటూరు. 27. బి. సి. బి. వరదయ్య, ప్రొద్దుటూరు. 28. ఎమ్. రామక్రిష్ణ, పాలకొల్లు. 29. బి. మాలతి, నల్లగొండ. 30. పి. రమాభారతి, అశోక్‌నగర్.

31. పి. వెంకటేశ్వర్లు, గిద్దలూరు. 32. పి. చందర్ రావు, సికింద్రాబాద్. 33. బి. లక్ష్మీజయప్రద, ముట్లూరు. 34. ముద్దా రమేష్, చాగల్లు. 35. ఎమ్. డి. వరప్రసాద్, ఇబ్రహింపట్నం. 36. ఏ. వి. సుబ్బలక్ష్మి, నల్లకుంట. 37. కె. సోమశేఖర్, బంగారుపేట. 38. ఆర్. క్రిష్ణ, హన్మకొండ. 39. టి. వి. శ్రీనివాసరావు, బరంపురం. 40. ఎన్. బాలరాజు, గుంటూరు.

41. వి. శ్రీలత, ఖర్గపూరు. 42. లక్కింశెట్టి రాఘవేంద్ర రావు, మచిలీపట్టణం. 43. ఆర్. రామకుమార్, అనంత పూరు. 44. కె. జయసేనరెడ్డి, నెల్లూరు. 45. పి. దేవి, హైద్రాబాదు 46. పి. ప్రభాకరరావు, రామాజిపల్లి. 47. కె. ఎస్. ఎస్. శర్మ, జమాల్ సిమెంట్ వర్క్స్. 48. పంపన శ్రీనివాసరావు, శ్రీశైలం ప్రాజెక్ట్. 49. పి. హెచ్. సాయిబాబు, కాకినాడ. 50. 'కణ్వశ్రీ' అనకాపల్లి.

51. ఎల్. సత్యం, కొత్తూరు. 52. పి. పుణ్యవతి, శ్రీహరికోట. 53. పి. జి. లీలారాజ్, మద్రాసు. 54. కె. జె. ఎన్. జి. సీతారామయ్య, పోలవరం. 55. అందవిల్ల

కొండలరావు, పార్వతీపురం, 56. పి. రోహిణి, అమలాపురం. 57. ఎస్. ఉపేంద్రనాథ్, మెదక్. 58. రాణి చంద్ర, వినుగొండ. 59. కె. విమలమ్మ, ఓర్వకల్లు. 60. జి. బాలనర్సింహారావు, నోముల.

61. మల్లి రాధిక, చిక్కడపల్లి. 62. ముద్దా సురేష్, కాకినాడ. 63. కె. షణ్ముగం, నగరి. 64. సుబ్బారెడ్డి, కొత్తకోలు, వుయ్యూరు. 65. మహ్మద్ అబ్దుల్ లతీఫ్, కరీంనగర్. 66. యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి. 67. ఆర్. వి. ప్రభాకరరావు, నోముల. 68. డి. అనూరాధ, నెల్లూరు. 69. పి. వి. శేషసాయి, సీతారామపురం. 70. యం. ఏ. సలీమ ఖ్తర్, మంచిర్యాల. 71. పి. శ్రీదేవి, సీతారాంబాగ్. 72. సత్యశేఖరం, తాడేపల్లిగూడెం.

***

రోజుకొక కారు!

ప్రియురాలు:-డార్లింగ్! మీరు రోజుకొక కారు వాడుతున్నారు. మీకు ఎన్ని కార్లు ఉన్నాయేమిటి?

ప్రియుడు :-లెక్కపెట్టడానికి టైమ్ చాలదు. అయినా ఇంటినిండా దొడ్డినిండా కార్లే. అదిసరే గానీ, నువ్వు గంటకో చీర కడుతున్నావు. మీ నాన్నగారు లక్షాధికారా?

ప్రియురాలు:-కాదు. మాకు 'డ్రైక్లీన్' షాపు ఉంది. నేను ఏ చీర కట్టినా మా నాన్న ఏమీ అనడు.

ప్రియుడు :-ఖర్మ! నీవేదో గొప్పింటిదానవనుకొని మోసపోయాను. సరే, ఇక నేను 'షెడ్'కి వెళ్ళాలి. ఆలస్యమైతే మా మెకానిక్ కేకలేస్తాడు...!!!

—యన్. బాలరాజు, గుంటూరు.

పాకుడురాళ్ళు

యస్. కృష్ణవేణి



"సార్! రైల్వేస్టేషన్ వద్ద ఓ పెద్ద ఎన్.వి. హోటలు వెలిసింది." సార్జంట్ తంగవేలు, ఇనస్పెక్టర్ పళని వేలుతో అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ పళనివేలు ఏదో ఫైలు తిరగవేస్తూ సార్జంట్ తంగవేలు మాటకి తల పంకించాడు.

"మద్రాసు నగరంలో ఆ హోటలు వెలసిన తరువాత బుహారీకి, దాష్ప్రకాష్‌కి, కోరమండల్‌కి, ఇంపీరియల్‌కి డిమాండ్ పడిపోయింది సార్!"

"ఏం? ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఆ హోటల్‌లో 'డ్రాకులడిష్' అని క్రొత్త డిష్ చాల రుచికరంగా వుందటసార్! దాని రుచి చెప్పనలవికాదట. పైగా ఆ వంటకం ఏ జంతువు మాంసంతో చేసిందో చెప్ప గల వారికి పదివేలు బహుమతికూడా ఆ హోటలు ప్రకటించి నది సార్! జనం విరగబడుతున్నారు. మేకమాంసం కాదని, ముళ్ళపంది కాదని, అడవి ఏనులు ఆఖరికి గాడిద కుక్కది కూడా కాదని అందరూ అనుకొంటున్నార్ సార్," తంగ వేలు వివరిస్తున్నాడు.

ఇనస్పెక్టర్ పళనివేలుకి తంగవేలు కుడిభుజం. అతను ఇటువంటి కబుర్లన్ని మోసుకొని వస్తాడు. ఇనస్పెక్టర్ పళనివేలు ఆసక్తిగా రంగప్రవేశం చేస్తే దాని వెనుక ఒక ఘోరకృత్యం బయటపడుతుంది.

మద్రాసు నగరంలోని గూండాలకి తార్పుడుగాళ్ళకి సంఘ విద్రోహకులకి ఇన్‌స్పెక్టర్ పళనివేలు పేరు సింహ స్వప్నం.

తంగవేలు చెప్తునే వున్నాడు. ఇనస్పెక్టర్ వింటూనే వున్నాడు. హఠాత్తుగా ఇన్‌స్పెక్టర్ చెవులు నిక్కబొడుచు కున్నాయి.

తంగవేలు క్షణం తన మాటలని ఆపాడు.

బయట గలభా జరుగుతోంది. కానిస్టేబుల్ ఎవరినో అడ్డుపెడుతున్నాడు.

"నేను బిచ్చగాడినే—బిచ్చగాడికి న్యాయం అవసరం లేదా? వాడు మనిషికాదా? ఈ పోలీసు స్టేషన్ డబ్బున్నవారి

కేనా?" ఎవరో అరుస్తున్నారు.

"తంగం వెళ్ళి చూడూ!" పళనివేలు అన్నాడు.

కొద్ది నిమిషాలలో తంగవేలు ఓ బిచ్చగాడిని వెంటబెట్టు కొని వచ్చాడు.

"నమస్కారం సార్!" బిచ్చగాడు వినయంగా నమస్కరించాడు.

పళనివేలు తల పంకించి ఏమిటి అన్నట్లు చూశాడు.

"సార్! నేను అడుక్కునేవాడిని. నాకో ఫ్రెండ్ వున్నాడు. వాడూ నాలానే అడుక్కుంటాడు. మొన్నటి నుండి వాడు కనపడటం లేదు" అతనన్నాడు.

అతని వేషం బిచ్చగాడిలానే వుంది. భాషమాత్రం చదువుకున్నవాడి భాషలా వుంది. వయస్సు పాతకపైన ముప్పైఐదు లోపు వున్నట్లు వుంది. వంటిమీద పీలికలు, అతని ఎముకలని దాచలేని జీర్ణావస్థలో వున్నాయి.

"నీ పేరు?"

"బిచ్చగాడు."

పళనివేలు చురుగ్గా అతనివేపు చూశాడు. అతను నదురు బెదురు లేకుండా నిలబడి వున్నాడు.

"అతని జేబులో వేలు వున్నాయా" తంగవేలు వ్యంగ్యంగా అడిగాడు. అతనికి చిరాగ్గా వున్నది. రాను రాను పోలీసు డిపార్టుమెంటు అంటే అందరికి చులకనై పోతోంది. వెధవ బిచ్చగాడుకూడా ఎంత ధైర్యంగా నిలబడి వున్నాడు.

"వేలు వుంటే అడుక్కునే అవసరం రాదనుకొంటా!" అతనన్నాడు.

"నుంగంబాకంలోనో - పాండీబజారులోనో - అన్నా నగరులోనో ఎక్కడో వుండి అడుక్కుంటూ వుండవచ్చు

కదా!" ఇనస్పెక్టర్ శాంతంగా అన్నాడు.

"ఎక్కడ అడుక్కున్నా సాయంకాలానికి ఇద్దరం ఒక చోటకి చేరుతాం సార్"

"బిచ్చగాళ్ళకి ఒకచోట నేమిటి? ఒక వూర నేమిటి?" ఫో.... ఫో...." అన్నట్లు తంగం అన్నాడు.

"నిజంసార్! బిచ్చగాళ్ళకి ఒక యిల్లు, ఒక యిల్లాలు ఒక వీధి, ఒక వూరు అని నియమం లేదుగానీ....మే మిద్దరం వుమ్మడిగా జీవిస్తున్నాం. ఒకరికి తెలియకుండా ఒకరం ఏ పనీ చేయం. వాడు రాలేదంటే నాకు అను మానంగా వుందిసార్," ఈసారి అతని గొంతులో దుఃఖం ధ్వనించింది.

"నీవు కూర్చో—" పళనివేలు అతనికి బెంచి చూపిం చాడు.

తంగవేలుకి బిచ్చగాడిమీద కోపంగా వున్నది.

"నీ తోటి బిచ్చగాడిని ఎత్తుకొని వెళ్ళి ఏం చేస్తా రంటావ్?" తంగవేలు వ్యంగ్యాన్ని దాచుకొంటూ అన్నాడు.

"ఈ ప్రపంచంలో పనికిరాని వస్తువు అంటూ లేదు కదండి. వాడు ఎవరికి కావలసి వచ్చాడో? వాడిని వాళ్ళు ఏంచేశారో? నా స్నేహితుడు కొంచెం అమాయకుడు సార్" దాదాపు ఏడుస్తూనే అన్నాడు.

"నీవు ముందు కూర్చో!" పళనివేలు అన్నాడు.

ఏమనుకున్నాడో ఏమో నేలమీద కూర్చున్నాడు. తన జోగిన ప్రక్కన బెట్టుకున్నాడు. పళనివేలు అతని ముఖాన్ని పరిశీలించాడు. అందులో సంస్కారం కాన వస్తోంది.

"చూడు....న్యాయం అన్నది అందరికోసం స్థాపించ డింది. ఇందులో పెద్దా చిన్నా అనే విచక్షణలేదు. నీవు

చూస్తే చదువుకున్నవాడిలా వున్నావు. నాకు వివరంగా చెప్తే నేను కేసుని తేలిగ్గా పరిశీలించగలను" అనునయంగా అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఈ మాటలకి అతను లొంగినట్లు వున్నాడు. కొన్ని క్షణాలు మౌనంగా వుండి—"నా పేరు బాబునాయుడు. మాది విజయవాడ. ఇప్పుడు మిస్ అయిన వాడి పేరు రాంబాబు. వాడిది విజయవాడే.

నేను యస్. యస్. యల్. సి ఫెయిల్ అయి నాగేశ్వ్రరావు అభిమాన సంఘానికి ప్రెసిడెంట్‌గా వుండేవాడిని. మాది బీదకుటుంబమే. నా అభిమాన సంఘ సభ్యులంతా ప్రోత్సాహం యివ్వడంతో మద్రాసు పారిపోయి వచ్చేశాను హీరో నవుదామని. కానీ కాలేకపోయాను. తిరిగి మా వూరు వెళ్ళడానికి ముఖం చెల్లలేదు.

అదృష్టం కోసం ఎదురు చూడవచ్చుగానీ కడుపు వూరుకోదుకదా! చివరకి యిద్దరమ్మాయిలని అక్కా చెల్లెళ్ళని చేసి, దానిలో ఒకదానికి డూప్లికేట్ మొగుడినయి, వాళ్ళిద్దరికి తార్పుడుగాడి నయ్యాను. ఆళ్ళిద్దరూ యిప్పుడు తారాపథంలో వున్నారు. నన్ను కుక్కను తరిమినట్లు తరిమారు.

పాకుడు రాళ్ళమీంచి జారి జారి చావలేక ఈ స్థితి కొచ్చేను. ఈ స్థితిలో ఈ వయస్సులో నావారంటూ తిరిగి వెళ్ళలేకపోయాను.

నాలానే పాకుడు రాళ్ళమీంచి దొర్లినవాడు రాంబాబు. నేను హీరో నవుదామనుకొంటే, వాడు పొట్ట చేతపట్టు కొని వచ్చాడు. ఇద్దరం ఒక గూటి వాళ్ళమే కాబట్టి ఈ ఐదారేళ్ళనుండి కలసి మెలసి వుంటున్నాం.

ఎక్కడెక్కడ తిరిగినా రాత్రి అయ్యేసరికి మేము



రైల్వేస్టేషన్‌వద్ద కలుసుకుంటాము. రెండు రోజులనుండి వీడు కనిపించడంలేదు. నేను వూరంతా తిరిగాను. వాడి జోలి యింకొకడివద్ద వున్నది. వాడిని తన్ని అడిగితే రైల్వేస్టేషన్‌వద్ద ఓ హోటలు వెనుక పడివుందని చెప్పాడు. మీకు రిపోర్టు యివ్వడానికి వచ్చాను" అని చెప్పాడు.

అతని కథ పళనివేలుని కదలించి వేసింది. సాగర గర్భంలో ఎన్నో వింతలు దాగివున్నట్లు, మద్రాసు నగరంలో ఎన్నో జీవితాలు బలి అయివున్నాయి. అది అతనికి తెలియనిదికాదు.

"బాబు! నీ ఫ్రెండు గూర్చి నేను ఎంక్వయిరీ చేస్తాను" అని మాట యిచ్చి పంపించి వేశాడు.

2

తంగవేలు భోజన ప్రియుడు. మద్రాసు నగరంలో ఏ ఏ హోటల్లో ఏ ఏ డిష్ బావుంటుందో తంగవేలు చెప్ప గలిగినట్లు వేరే ఎవరూ చెప్పలేరు. క్రొత్త హోటలు వెల సినదంటే దానిలోకి వెళ్ళి తిని రావలసినదే. ఈ క్రొత్తగా వెలిసిన హోటల్‌కే యింకా ముహూర్తం కుదరలేదు.

అయితే తంగవేలు ఇన్‌స్పెక్టర్ రాకుండా మాత్రం

ఏక్ష్ హోటలుకి వెళ్ళడు. ఈ ద్రాక్షలడిష్ తినాలని మహ వుబలాటంగా వున్నది. పనుల వొత్తిడివలన పళనివేలుకి పడి చావడంలేదు.

అందుకని తంగవేలు సమయం దొరికినప్పుడంతా ఆ హోటలు గూర్చి తను విన్నదంతా చెప్పి, చెప్పి వూదర గొడుతున్నాడు.

"సార్! మన శ్రీనాట్రశ్రీ కూడా పోయి తిన్నాడంట సార్! మహ టేస్టుగా వుందటసార్! స్వర్గానికి అరయించి తక్కువట సార్!" అని చెప్పసాగాడు.

"షటప్" ఇన్స్పెక్టర్ అరిచాడు.

తంగవేలు నోరు మూయడం, ఓ ఇరవై సంవత్సరాల యువతి లోనికి అడుగు పెట్టడం ఒకసారే జరిగింది.

ఆ యువతి కళ్ళల్లో బెదురు కొట్టవచ్చినట్లు కనబడు తోంది. పల్చటి పెదాలు సన్నగా వణుకుతున్నాయి. బహుశా అది గుండెల్లోని భయం కాబోలు.

"రామ్మా!" పళనివేలు సాదరంగా ఆహ్వానించాడు.

అ యువతి కుర్చీలో కూర్చుంటూ, కర్చీఫ్‌తో మొఖా నికి పట్టిన చమటని మెత్తగా అద్దుకొంది.

"సార్! నా పేరు లత. నేను ఉమెన్స్ కాలేజీలో బి.ఏ ఫైనలియర్ చదువుతున్నాను...." అని ఆగింది సంశయంగా.

ఇన్స్పెక్టర్ అది గ్రహించి—"చెప్పమ్మా భయ పడకు" అని అన్నాడు.

"సార్! నేను వచ్చింది నేను చెప్పింది రహస్యంగా వుంచి మీరీ కేసుని పరిష్కరించాలి. మీ పేరు నేను విని వున్నాను. ఇది పోలీసు కేసు క్రింద కాకుంటే...." అని కొన్ని క్షణాలు మౌనంగా వుండి, తంగవేలు వేపు సంశ

యంగా చూసింది.

"అతను నా సార్జంటు తంగవేలు....నీవు చెప్పాలను కున్నది నిర్భయంగా చెప్పవచ్చు" అని అన్నాడు.

"మా నాన్నగారు షణ్ముఖసుందర మొదలియార్" అన గానే తంగవేలు ఆశ్చర్యంతో—"మద్రాసు నగరంలో పేరుమోసిన వజ్రాల వర్తకుడు" అని అన్నాడు.

"అవును! కానీ నేను ప్రసాద్ అనే తెలుగు యువ కుడిని ప్రేమించాను. అతను తెలుగువాడే కాకుండా సామాన్య కుటుంబీకుడు. మా నాన్నగారు చస్తే ఈ పెండ్లికి వొప్పరు. ఎలా అన్నదే మా యిద్దరి సమస్య.

ఇంతలో రైల్వేస్టేషన్ వద్ద క్రొత్తగా వెలసిన హోటలు వారి 'డ్రాకులడిష్' గూర్చి ప్రకటన మీరు వినే వుంటారు. ఆ డిష్ మెటీరియల్ ఏదో నేను కనిపెడతాను. ఆ పది వేలుతో మనం ఏదైనా బిజినెస్ చేసుకొని బ్రతక వచ్చునని మొన్ననగా వెళ్ళాడు. ఇంతవరకూ తిరిగి రాలేదు.

నేను వాళ్ళ యింటికి కూడా వెళ్ళాను. వాళ్ళు కూడా అతను ఏమయ్యాడని కంగారు పడుతున్నారు. నా కెందుకో భయం, అనుమానం వేసి మీవద్ద కొచ్చాను" అని ఆమె ఏడవసాగింది.

ఇది రెండవ కేసు. ఇదేదో ఆలోచించవలసిన విష యమే అని అనుకొని, ఆమెకు ధైర్య వచనాలు చెప్పి పంపించి వేశాడు.

3

ఇన్స్పెక్టర్ పళనివేలు బుల్లెట్టుని క్రొత్త హోటలు వేపు దూకించాడు.

హోటలు సర్వర్సు వేషం చిత్రాతి చిత్రంగా వున్నది. హోటలు లోపల అంతా ఎర్రగా రక్తంలో ఈదుతున్నట్లు

వున్నది.

ఎన్నో శవాలని భయంకర స్థితిలో చూసిన ఇన్‌స్పెక్టర్ శరీరం కూడా ఆ రక్తవర్ణ అలలుని చూసి జలదరించింది. తంగవేలుకు ఆ 'డ్రాకులడిష్'ని ఆరగించబోతున్నందుకు చాలా ఉత్సాహంగా వుంది.

ఇద్దరూ ఓ ఖాళీ టేబుల్‌కోసం ఓ పావుగంట వెయిట్ చేయవలసి వచ్చింది. కూర్చున్న తరువాత బేరర్ వచ్చాడు.

"ఫ్రెయిడ్ రైస్, డ్రాకులడిష్ ఒకటి, చపాతి ఎగ్ ఆమ్లెటు ఒక ప్లేటు" అని ఆర్డరిచ్చాడు ఇన్‌స్పెక్టర్.

"తంగం! ఇక్కడ ప్యాకింగ్ సిస్టమ్ లేదటకదా! నీవు ఎలాగైనా డ్రాకులడిష్ లోని మటన్‌ని కొంత ప్యాక్ చెయ్యి. అయితే దానిని తింటున్నట్టు నటించు గానీ, ఎవరూ చూడకూడదు" అని సిగరెట్టు అంటించాడు ఇన్‌స్పెక్టర్ పళనివేలు.

ఇన్‌స్పెక్టర్ అన్నమాటకి నీరు కారిపోయాడు తంగ వేలు.

ఘుమఘుమ సువాసనలు వెదజల్లుతూ డ్రాకులడిష్ వచ్చింది. తంగవేలు నోరు వూరింది.

ఇన్‌స్పెక్టర్ చపాతినీ ఎగ్ ఆమ్లెటుని నెమ్మదిగా తిన సాగాడు. తంగవేలు మాత్రం ఫ్రెయిడ్‌రైస్‌ని నెమ్మదిగా తింటూ డ్రాకులడిష్‌ని దానిలో మిక్స్ చేస్తున్నట్లు నటిస్తూ అవకాశం కోసం ఎదురు చూడసాగాడు.

పళనివేలు సైగచేశాడు చుట్టూ గమనించి.

తంగవేలు చాకచక్యంగా ఓ పెద్ద మటన్ పీసు టేబుల్ క్రిందవేసి దానిమీద నెమ్మదిగా కర్చీఫ్‌ని జార్చాడు.

అంతే!....'ధన్....ధన్' మని కాల్పులు జరిగాయి.

పళనివేలు టేబుల్‌మీదున్న వస్తువులన్నీ చెల్లా చెదురు

అయ్యాయి. ప్లేటులు గాలిలో పల్టీలుకొట్టి ధణేల్ మనే శబ్దంతో క్రింద పడ్డాయి. ఫ్రెయిడ్ రైస్ పూలవర్షంలా అందరిమీద పడింది.

ఈ హఠాత్ సంఘటనకి క్షణం స్థంభించిపోయినా, మెరుపులా తన పిస్టల్ని అందుకొని గాలిలో పేల్చి జవాబు యిచ్చాడు పళనివేలు.

లోపల అంతా గందరగోళం అయింది.

ఓ ఆఫ్రికన్లా వున్న వ్యక్తి గన్తో అక్కడకి వచ్చాడు. అతడి తల చిన్న ముళ్ళపొదలా వున్నది. నల్లటి మోటు శరీరంలో ఎర్రటి కళ్లు క్రూరంగా చూస్తు న్నాయి.

"సార్! పదివేలు వూరికేరాదు. ఈ డిష్ బయటకి వెళ్ళడానికి వీలులేదు. ఇక్కడే టేస్టుచేసి చెప్పగలిగితేనే బహుమతి" అని మేనేజరు వినయంగా అన్నాడు.

ఇన్స్పెక్టర్ పళనివేలు తలపంకించి బిల్లు పేచేసి

బయట కొచ్చేశాడు.

"సార్!" ఎగిరి గంతేశాడు తంగవేలు.

"ఏం?" చిరాగ్గా పలికాడు.

"సార్! నా సాక్సులో మటన్‌పీస్" ఎత్తి చూపాడు.

పళనివేలు కళ్ళు సంతోషంతో మెరిశాయి.

"తంగం! దీనిని ఎగ్మూర్ లాబ్‌కి పంపించి, దగ్గరుండి రిజల్ట్సు తీసుకొనిరా!"

తంగవేలు వుషార్‌గా ఈలవేసుకొంటూ, బుల్లెట్ మీద దూసుకొని పోయాడు.

సాయంకాలానికి చెమటలు క్రక్కుకొంటూ తంగవేలు వచ్చాడు. అతనికి చాల పెద్ద షాక్ తగిలినట్లుగా వున్నది. అతనిని చూసి పళనివేలు చకితుడయ్యాడు.

"తంగం-వాట్ హేపండ్" ప్రేమగా చెయ్యి నిమురుతూ అన్నాడు.

"సా....ర్! చాల ఘోరం సార్! వాళ్ళు... వాళ్లు...." పళ్ళు పటపట లాడించాడు.

"తంగం అయితే ఆ మటన్...." పళనివేలు పూర్తి చేయలేదు.

తంగవేలు తలవూపి వూరుకొన్నాడు.

4

క్రొత్తగా వెలసిన హోటలు వెనుక ప్రాంతంలో ఒక బిచ్చగాడు తచ్చాడుతున్నాడు.

రాత్రి పదిగంటలు దాటింది.

హోటలు లోపలనుండి ఓ వ్యక్తి బయటకి వచ్చి బిచ్చగాడిని చూసి, రమ్మని సైగచేశాడు.

బిచ్చగాడు కుంటుకుంటూ ఆ వ్యక్తివద్దకెళ్ళాడు.

"అన్నం పెడతాను గ్లాసులు కడుగుతావా?"

"చిత్తం."

"లోపలికి రా," అతను వెనుదిరిగాడు. బిచ్చగాడు అతని వెంటనే నడిచాడు.

బిచ్చగాడి ముందు ఓ రాశి గ్లాసులు పోశారు. ఓపిగ్గా వాటిని కడుగుతూ కూర్చున్నాడు. అతనిని పిలిచిన వ్యక్తి అక్కడే ఓ తిన్నెమీద కూర్చొని పిచ్చాపాటి మాట్లాడు తున్నట్లు బిచ్చగాడి వివరాలన్నీ రాబట్టుకొంటున్నాడు.

"ఇంత వయస్సు వచ్చింది పెళ్ళాం లేకుండా ఎలా వుంటున్నావురా సన్నాసీ" అని తిట్టాడు ప్రేమగా.

బిచ్చగాడు తల గోక్కొని — "మీకు తెలియంది ఏముంది అయ్యగారు, రోడ్డుప్రక్కన ఆ టయానికి ఏది దొరికితే అదే ఆ కాసేపు పెళ్ళాం అవుతుంది," తేలిగ్గా అన్నాడు.

"మరి పిల్లలో—"

"తా దూర కంత లేదుగానీ మెడకో డోలు అని, మా కెందుకండి పెళ్ళాం పిల్లలు. అయినా బాబుగారు నేను ఏ వూరులోనూ వారంకంటే ఎక్కువ వుండనండి. ఈ వూరికి నేను ఈ వుదయానే వచ్చాను. మళ్ళీ వారానికి యింకో వూరు ఎల్లిపోతా" అన్నాడు వీపు గోక్కుంటూ.

వాడి వివరాలు విన్న వ్యక్తి తల పంకించి—"ఆ పని తరువాత చేద్దువుగానీలే ముందు లోనికి రా అన్నం కడుపు నిండా తిందువుగానీ" అని లోనికి పిలుచుకొని వెళ్ళాడు.

బిచ్చగాడి వేషంలో వున్న తంగవేలు తన గుడ్డ పీలికల్లో దాచుకున్న మైక్రోఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు ఇక్కడ జరిగే సంభాషణలని, దారులని, అక్కడి మనుష్యులని వారి

ప్రవర్తనలని పళనివేలుకి పంపిస్తూనే వున్నాడు.

సుమారు ఓ పది పదిహేనుమంది పోలీసు కానిస్టేబుల్సు సబ్ ఇన్‌స్పెక్టర్సు మఫ్టీ డ్రస్సులో హోటల్లో కూర్చొని తగు సమయంకోసం ఎదురుచూస్తున్నారు.

హోటలుకి కొద్ది దూరంలో జీపులో తంగం పిలుపుకోసం సిబ్బందితో సహా కాచుకొని వున్నాడు పళనివేలు. పరిస్థితి టెన్షన్‌లోకి వచ్చేసింది.

తంగాన్ని అండర్ గ్రౌండ్స్‌కి పిలుచుకొనిపోయారు. అక్కడి దృశ్యాన్ని చూసి "కెవ్వు" మన్నాడు తంగవేలు తనకి తెలియకుండానే.

క్రింద నరరూప రాక్షసులవంటి ఆఫ్రికన్సు యిద్దరు వున్నారు. ఓ పెద్ద కటింగ్ మిషన్ వుంది. గది నిండా ఎముకల ప్రోగులు మనిషి తలలు కాళ్ళుచేతులు వున్నాయి. ఆ గది అంతా చెడువాసన నరాలు పగిలిపోయేటట్లు వ్యాపించి వున్నది.

అప్పటికే ఓ మనిషిని చంపేసినట్లు వున్నారు. మనిషి మాంసం అని తెలియకుండా వుండడానికి ఏ పార్టు కాపార్టు విడదీస్తున్నారు.

ఆ రక్తం క్రింద అండర్‌గ్రౌండ్ డ్రయినేజ్‌లో కలసి పోవడానికి వీలుగా ఏర్పాట్లు వున్నాయి.

"తమ్ముడూ! ఇక్కడ్నుంచి నీవు వూరూరు తిరిగే అవసరంలేదు. నీ దేవుడిని ఆఖరిసారి తలచుకో! రేపు ప్రొద్దుట నీవు మద్రాసు నగరంలోని ప్రజల కడుపులలో దాక్కొని వుంటావ్?"

"అంటే...." అమాయకంగా అన్నాడు.

లోపలికి వచ్చే ముందే గోచిలోవున్న చిన్న టేపు

రికార్డర్‌ని ఆన్‌చేసేశాడు. అండర్‌గ్రౌండ్ వివరాలు కూడ అందించడం అయిపోయింది.

ఇప్పుడు వీళ్ళని మాటల్లో కొద్దిసేపు ఆపి వుంచడమే.

"అంటేనా? వాళ్ళిద్దరూ సాయిబు మేక తలని నరిగినట్లు నిన్ను నరికి మాంసాన్ని తయారుచేస్తారు. ఆ మాంసం పేరు 'డ్రాకుల డిష్' అని అంటారు. మనిషి మాంసంతో వండటంవలన అది మారుచిగా వుంటుందిలే. దానికోసం ఎర్రోళ్ళు అందరూ పరిగెట్టుకొని వస్తున్నారు. మా యజమానులు కోట్లకి పడగలెత్తుతారు"—అని అన్నాడు.

తంగవేలు భయపడినట్లు ఏడవసాగాడు.

"అయ్యా! నన్ను వొదిలేయండి. నన్ను చంపకండి. కావాలంటే నేను రోజుకి ఒక బిచ్చగాడిని పిల్చుకొని వచ్చి మీకు అప్పగిస్తాను," ప్రతిమాలుకోసాగాడు.

అతను వికటంగా నవ్వాడు. "తప్పించుకోవడానికి ఇదొక ఎత్తని మాకు తెలుసులే."

"లేదు....లేదు....నేను నిజంగానే తీసుకొస్తాను. ఈ విషయం నేనెవ్వరితోను...." అంతే!—ధన్....ధన్ మని తుపాకులు పేలిన శబ్దం, కుర్చీలు బల్లలతో యుద్ధం జరుగుతున్నట్లు శబ్దం వినవచ్చింది.

తంగం తన శరీరాన్ని రబ్బరులా సాగదీసి పైకి ఎగిరి తన ముందు వున్నవాడి గుండెలమీద తన్నేడు.

వూహించని సంఘటన కావడంవలన వాడు 'కెవ్వు'న అరచి విరచుకొని పడిపోయాడు.

తంగాన్ని చంపటానికి సిద్ధంగావున్న ఆఫ్రికన్నుకి తంగంవాళ్ళ సంభాషణ అర్థం కాకపోయినా, అతను ఎదురు తిరుగుతున్నాడని గ్రహించి, మెరుపులా తంగంమీద దాడి

చేసి, పెడరెక్కలు విరచి పట్టుకొని, మెడమీద జూడో పద్ధతిని ఓ దెబ్బ వేశారు. వెంటనే తంగానికి స్పృహ పోయింది.

బయట జరుగుతున్న ముట్టడి సంగతి వాళ్ళకి తెలియదు. ప్రతిరోజూ యిక్కడకి కొనిరాబడుతున్న బలి పశువు పరిస్థితి అర్థం చేసుకొని వాళ్ళు తిరగపడడానికి ప్రయత్నించడం, వీళ్ళిద్దరూ వాళ్ళని మెడమీద ఓ దెబ్బ వేసి స్పృహ తప్పించి మెషిన్‌లో పెట్టి ఖండాలు ఖండాలుగా నరకడం అన్నది మామూలుగా జరిగే పనే.

అలానే వాళ్ళు తంగాన్ని స్పృహ తప్పించి, ఎత్తి తలని మిషన్‌మీద పెట్టారు. మీట నొక్కడానికి రెడీగా వున్నారు.

ధన్....మని రివాల్వర్ పేలడం తూట రివ్వున వచ్చి స్విచ్ నొక్కడానికి రడీగా వున్నతని చేతిలో దూరడం, వాడు కీచుగా అరచి నేల కొరగడం ఒక్క క్షణంలో జరిగిపోయింది.

* * *

క్రొత్తగా వెలసిన ఆ హోటలుకి సీలు వేయబడింది. ఆ హోటలు ప్రొప్రయిటర్ నుండి సర్వర్‌వరకూ అందరూ అరెస్టు కాబడ్డారు. డ్రాకులడిష్ గూర్చి దినతంతి నుండి హిందూ పేపరువరకూ ప్రచురింపబడింది ఫోటోలతో సహా.

ఆ హోటలులో తిన్నవారంతా 'బాబోయ్ యాక్' అని అప్పుడు వాంతులు చేసుకోసాగారు.

చాలామంది జనం హిస్టీరియా పేషంట్స్‌లా మంచాన పడ్డారు.

***

మూడు సుద్దులు-
ముంతెడు నీళ్ళు!

'సికిందర్'



ఆ రోజు బ్రహ్మానందం ఆశ్చర్యాని కంతులేదు.

ఆరేళ్ళ అతని అనుభవంలో ఇలా ఎన్నడూ సంభవించ లేదు. కనీసం అతను వూహించలేదుకూడా.

లాడ్జింగ్ నడపడమంటే కత్తిమీద సాము లాటిది. చిన్నచిన్న టౌన్లలోనైతే ఫరవాలేదు. కాని ఇలాటి సిటీలో ఆ వ్యాపారమే ఒక తలనొప్పి వ్యవహారం. లాడ్జింగ్ అంటే ప్రజల మనసులో తట్టేది వ్యభిచార నిలయమని. ఎంత నీతిగా లాడ్జింగ్ నడపాలనుకున్నా తప్పుడు సమాచారం అందుకుని పోలీసులు రైడ్ చేయడంతో ప్రతిష్ట అంతా మట్టి కలిసిపోతుంది.

బ్రహ్మానందం వీటన్నిటిని తట్టుకుని నీతిగా, పరువుగా ఆరేళ్ళనుంచి లాడ్జింగ్ నడుపుతున్నాడు. జె. ఎన్. రోడ్‌లో కరాచీ బేకరీ యెదురుగా ఓ మేడమీద కొన్ని ఫ్లాట్స్ అద్దెకి తీసుకుని లాడ్జింగ్ తెరిచాడు.

ఆ చుట్టుపక్కల పరిసరాలన్నీ పెద్ద వ్యాపారకేంద్రాలు. బయటి వూళ్ళనుంచి వచ్చే వ్యాపారస్తులంతా అక్కడే యెక్కువభాగం తమ పనులు పూర్తి చేసుకుంటారు. విపరీతమైన రద్దీ, రోదా వుంటాయెప్పుడూ.

కాబట్టి బ్రహ్మానందం లాడ్జి ఏమాత్రం ఢోకా లేకుండా విపరీతమైన లాభాలు చేసుకుంటోంది. అతనిప్పుడు దర్జా జీవితం వెలగబెడుతున్నాడు—సంవత్సరం క్రితం పాతిక వేలు కట్నం ఇచ్చి కూతురు పెళ్ళి చేశాడు.

రోజూ ఉదయం 9-00 గం॥లకి లాడ్జికి వచ్చి ఓసారి పర్యవేక్షించి, బాగోగులు చూసుకుని ఇంటికెళ్ళిపోతాడు. ఆ తర్వాత సాయంత్రం 6-00 గం॥లకి వచ్చి కస్టమర్స్‌ని ఆహ్వానించి గదులు కేటాయించడం వగైరా చూసుకుని తిరిగి 9-00 గం॥లకి వెళ్ళిపోతాడు.

అతనలా నిర్ణీత సమయాలకి వచ్చి వెళుతున్నా, అక్కడి వ్యవహారాలన్నీ నిర్వహించేది బాబు అనే ఇరవై ఏళ్ళ కుర్రాడు. ఆ కుర్రాడిమీద బ్రహ్మానందానికెంతో నమ్మకం వుంది. కాబట్టి ఎల్లవేళలా లాడ్జింగ్‌ని కనిపెట్టుకునివుండే అవసరంలేదు.

అయితే ఈరోజు అతని ఆశ్చర్యానికి ఒక కారణముంది. వూహించని కారణం. ఎదురుచూడని పరిణామం.

తన కళ్ళని నమ్మలేకపోతున్నాడు, కళ్ళద్దాలనీ అంత కన్నా నమ్మలేకపోతున్నాడు.

లాడ్జింగ్ చేరుకుని మేడమెట్లు ఎక్కుతుండగా అప్ర

యత్నంగా తల ఎత్తి చూశాడు. లాడ్జింగ్‌మీద సైన్‌బోర్డు వుండవలసిన స్థానంలోనే వుంది.

కానీ దానిమీది అక్షరాలు మారి వున్నాయ్!

బోర్డుమీది అక్షరాలు ఎలా మారాయి! ఎప్పుడు మారాయి? ఎవరు చేశారీపని?

దానిమీద ఇలా వుంది:

'ఇచ్చట గుద్దులు, మంచినీళ్లు అందరికీ ఇవ్వ బడును!'

అసలు ఆ బోర్డుమీద వుండవలసింది 'ఇచ్చట గదులు, మడత మంచములు అద్దెకి ఇవ్వబడును' అని.

2

'ది కేస్ ఆఫ్ ది బ్యూటీఫుల్ బెగ్గర్'—పెర్రీమేసన్ నవల, చదవడం పూర్తిచేసి గట్టిగా నిట్టూర్చి, ఉత్తరాలు చదువుకుంటోన్న లాల్‌తో అన్నాడు జాన్.

"ఇంత విచిత్రమైన కథ నేను చదవలేదు లాల్! ఇది పెర్రీమేసన్ కేసుల్లోకెల్లా విశిష్టమైనది. నువ్వొక్కసారి తెరిచి చదువు, పూర్తిచేసేదాకా వూపిరి వదలకుండా చదివేస్తావు!"

"నన్ను ఉత్తరాలు చదువుకోనీ" లాల్ అన్నాడు తల ఎత్తకుండానే.

"ఆల్‌రైట్, నువ్వెప్పుడేనా చదవచ్చు—మన లైబ్రరీలో మేసన్ పుస్తకాలన్నీ అలంకరించేస్తాను. లాల్,మన వృత్తికి ఇవి చాలా ఉపయోగపడతాయి. అంతే కాదు, డిటెక్టివ్ రచయితలు కాగోరేవారు వీటిని తప్పక చదవాల్సిందే! కానీ కాపీ చేయడానిక్కాదు, అనుభవం సంపాదించడానికి—"

జాన్ మాటల్ని తుంచివేస్తూ బ్రహ్మానందం లోనికి ప్రవేశించాడు. అతని ముఖం, ఛాతీ, చేతులూ చెమటపట్టి వున్నాయి. కళ్ళలో కూడా నీళ్ళున్నాయికానీ అది చెమట కాదు, కన్నీళ్ళు.

డిటెక్టివ్ లిద్దరూ అతన్ని ఆహ్వానించి కూర్చో బెట్టారు.

బ్రహ్మానందం ఫాను గాలి సరిపోక పత్రికను విసురు కుంటూ తను చూసిందీ, జరిగిందీ పూసగుచ్చినట్టు చెప్పాడు.

డిటెక్టివ్‌లు అతను చెప్పేది శ్రద్ధగా వింటూ, మధ్య మధ్య అవసరమైన ప్రశ్నలువేస్తూ, కేసు స్వరూపం తెలుసు కున్నారు.

ఆ తర్వాత బ్రహ్మానందం లాల్చీ జేబులోంచి ఒక చీటీ తీసి డిటెక్టివ్‌లకి అందించాడు. మడత విప్పి అందులోని సారాంశం చదివారు డిటెక్టివ్‌లు.

ఒకే ఒక్క వాక్యం వుంది:

నువ్వు త్వరలో చస్తావు = **నువ్వొత్త బడుద్దాయివి!**

"ఎవరిచ్చారు మీకు?" లాల్ అడిగాడు, నవ్వుని బల వంతంగా అణుచుకుని.

"దారిలో టీ తాగేందుకు హోటల్ కెళ్ళాను. బిల్లు చెల్లించడానికి జేబులో చెయ్యిపెడితే ఈ కాయితం తగి లింది" అన్నాడు బ్రహ్మానందం.

"ఇలాటి చిలిపిపనులు ఎవరు చేస్తారు?"

"నాకిద్దరు శత్రువులున్నారు—కొడుకు, అల్లుడు."

"వాళ్ళిద్దరి గురించి చెప్పండి?"

బ్రహ్మానందం గొంతు సవరించుకున్నాడు,"సంవత్సరం క్రితం నా కూతురి పెళ్ళి చేశాను. అల్లుడు ఇక్కడొక

కాలేజీలో లెక్చరర్. పేరు మోహన్రావ్. పాతికవేలు కట్నం ఇచ్చాను. అయినా నా ప్రాణాలు తీస్తున్నాడు. ఈ మూడు నెలలనుంచి స్కూటర్ కావాలని గొడవపెడుతున్నాడు. నేను వీల్లేదని చెప్పాను. అయితే అమ్మాయిని వదిలేస్తానన్నాడు.

నా పరువేంగాను! స్కూట రివ్వడానికి ఒప్పుకున్నాను. కానీ చేతిలో డబ్బులేదు! మూడు నెల్లనుంచీ తీవ్రమయిన ప్రయత్నాలు చేస్తున్నాను. అల్లుడి తొందరకి గాభరా పడుతున్నాను.

ఈ మూడు నెలల్లో రెండుసార్లు వార్నింగ్ ఇచ్చాడు. స్కూటరివ్వకపోతే అమ్మాయిని వదిలేయడట. అలా చేస్తే ఆమెని శిక్షించి నట్టవుతుంది. కాబట్టి, స్కూటర్ ఇచ్చే బాధ్యత నాది కాబట్టి, నన్నే శిక్షిస్తానని గడువు పెట్టాడు.

ఆ గడువు నాలుగు రోజులక్రితం తీరిపోయింది. ఆ రోజే ఒక ఉత్తరం వచ్చింది. మాట నిలబెట్టుకోని పర్యవసాన మేమిటో వేచి చూడమని వ్రాశాడు. దాని పర్యవసానం ఈ రోజు లాడ్జింగ్ బోర్డుమీద చూశాను.

మరొక విషయంవుంది. ఇది మొన్న అమ్మాయి చెప్పింది: అల్లుడు ఈ మధ్య తుపాకీ కొన్నాడట. వారం రోజుల్లో స్కూటర్ తన గుమ్మం దగ్గర లేకపోతే నా ప్రాణాలు గాల్లో కలుస్తాయిట!"

రాత్రి లాడ్జింగ్‌లో జరిగిన సంఘటన ఇది:—

తొమ్మిది గంటలకి బ్రహ్మానందం ఇంటి కెళ్ళిపోయాక నలుగురు రౌడీలు లాడ్జింగ్‌లో ప్రవేశించారు-ఒక బోర్డుతో సహా. వాళ్ళని చూసి బాబు జడుసుకున్నాడు. రౌడీలు

అతన్ని రిక్షాలో వేసి ఇంటికి తీసుకెళ్ళి మత్తుమందిచ్చి పడుకోబెట్టారు.

ఆ తర్వాత లాడ్జింగ్ పైనవున్న బోర్డు తీసేసి, తాము తెచ్చిన బోర్డు బిగించారు. బిగించడం పూర్తయాక కౌంటర్ దగ్గర నిలబడి లాడ్జింగ్‌కి వచ్చే కస్టమర్స్‌ని తలా మూడేసి గుద్దులు గుద్ది మొంతెడు మంచినీళ్ళందించారు.

ఇదేమి అన్యాయమని అడిగితే బయట బోర్డు చూడలేదా అని దబాయించారు. గుద్దులు తిన్న కస్టమర్స్ వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చారు. కానీ పోలీసులు వచ్చేలోపున రౌడీలు కాలికి బుద్ధి చెప్పారు.

బ్రహ్మానందం ఇల్లెక్కడో ఎవరికీ తెలీదు. కాబట్టి రాత్రంతా పోలీసులు కాపలా కాశారు. ఉదయం బ్రహ్మానందం బయట బోర్డు చూసుకుని ఆశ్చర్యపడి, పైకి రాగానే పోలీసు లతన్ని పట్టుకున్నారు.

లాల్ ముందుకి వంగాడు, "మీ అల్లుడు విక్రమార్కుడిలా వున్నాడు. ఇక మీ కుమారుడి గురించి చెప్పండి?" అన్నాడు.

"వాడొక తిరుగుబోతు వెధవ!" బ్రహ్మానందం చెప్పాడు, "చదువు సంధ్యలు పక్కనబెట్టి పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు, రాస్కెల్! బి.కాం. పూర్తయితే బ్యాంకులో ఉద్యోగం ఇప్పిద్దామనుకున్నాను. వాడికి చదవాలనిలేదు, స్వయంగా సంపాదించాలనీ లేదు. నా కష్టార్జితాన్ని అనుభవించడానికి ఆలోచిస్తున్నాడు. చదువూ, సంపాదనా ఏమీలేకుండా పెళ్ళిచేసుకుంటాడట! అలా జరిగితే వాడికి నా ఇంట్లో స్థానం వుండదు. వాడికి వార్నింగ్ ఇచ్చాను. దానికి వాడేమన్నాడో తెలుసా?"

"ఏమన్నాడు?"



"కోర్టులో దావా వేసి నా ఆస్తిమీద హక్కు నిరూపించుకుంటాడుట!"

ఈ మాట లంటున్నప్పుడు బ్రహ్మానందం గుండెలు వేగంగా కొట్టుకుంటున్నట్టు జాన్ పసిగట్టాడు.

"మీరేమన్నారు!"

బ్రహ్మానందం ముఖం పాలిపోయి వుంది, "ఏమంటాను! నా స్థానంలో మీరువుంటే ఏంచేస్తారు? కోర్టులో దావా వేసి నాపరువు తీసేకన్నా ప్రాణాలు తీసేయమన్నాను?"

"అతనేమన్నాడు?"

"నేను వాడికి జన్మనిచ్చాను, పోషించాను, పెద్దవాడ్ని చేశాను. ఇప్పుడు నా బాగోగులూ, ఆస్తి వ్యవహారాలూ చూసే బాధ్యత తనమీద వుందన్నాడు. నేను విశ్రాంతి తీసుకోవాలిట. నేను సంపాదించిన ఆస్తిని పదేళ్ళలో పదింతలు చేయడమేగాక, ముగ్గురు మనవళ్ళని నా చేతిలో పెడతాడట! కాబట్టి ఆస్తి విషయంలో నిశ్చింతగా వుండి,

పుట్టబోయే మనుమళ్ళ గురించి కలలు కనమంటున్నాడు!"

"ఇంతకంటే మీకేం కావాలి?"

"నేను వాడి మాటలు నమ్మను! వాడు పదేళ్ళలో పది మంది మనవళ్ళని అందించగలడేమోగానీ, ఆస్తిని మాత్రం పరుల పాలు చేస్తాడు! ఆరేళ్ళ క్రితం నేనెంత దారిద్ర్యాన్ని అనుభవించానో వాడికి తెలీదు. వాడూ కష్టపడాలి. ఆస్తి సంపాదించాలి, తండ్రికి తగ్గ కొడుకనుపించుకోవాలి. అదీ నా ఆశయం. అర్థమైందా?"

డిటెక్టివ్ లిద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు.

"సరే, అతనిప్పుడు ఎక్కడ వుంటున్నాడు?" అడిగాడు లాల్.

"ఇంట్లోనే. కానీ ఈ రోజు నాగార్జునసాగర్ వెళ్ళాడు ఫ్రెండ్స్‌తో కలిసి. విహారయాత్రట—ఎక్స్‌కర్షన్!"

"ఆల్‌రైట్, ఇప్పుడు మమ్మల్ని ఏం చేయమంటారు?"

"అల్లుడుగార్ని బుజ్జగించమంటాను." బ్రహ్మానందం అన్నాడు. "లాడ్జింగ్ బోర్డు మార్చింది అతనేనని నా అనుమానం. పైగా నా జేబులో చీటీ పెట్టాడు. రాత్రి జరిగిన సంఘటనతో లాడ్జింగ్ ప్రతిష్ట దెబ్బతింది. పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు.

ఇదంతా చూస్తుంటే స్కూటరివ్వకపోతే నా అల్లుడు తుపాకీతో నన్ను చంపడం ఖాయమన్పిస్తోంది. నేను ఛస్తాను, ఫరవాలేదు. అతను జైలు కెళతాడు! ఇలా జరకుండా మీరు చూడాలి. ఇప్పుడే వెళ్ళి అల్లుడుగార్ని కల్సుకుని ఉద్రేకాన్ని చల్లార్చండి. మంచీ చెడ్డలు వివరించి చెప్పండి."

"ఇల్లెక్కడ?"

బ్రహ్మానందం అడ్రసు వ్రాసి ఇచ్చాడు. "ఈ రోజు

ఆదివారం. ఇంట్లోనే వుంటాడు."

"మీ కొడుకు పేరేమిటి?"

"సింహాచలం."

"అతను ప్రేమిస్తోన్న అమ్మాయి పేరు?"

"ఏదో ప్రభట."

"సింహాచలం రాత్రి ఎక్కడ వున్నాడు?"

"ఇంట్లోనే."

"సాగర్‌నుంచి ఎప్పుడు వస్తాడు?"

"తెలీదు."

డిటెక్టివ్ లిద్దరూ కాస్సేపేదో ఇంగ్లీషులో చర్చించుకున్నారు. ఆ తర్వాత లాల్ అన్నాడు: "మేమింతవరకు బుజ్జగించే కేసులు తీసుకోలేదు. మీరెంత ఫీజు చెల్లిస్తారు?"

"వంద రూపాయలు."

డిటెక్టివ్ లిద్దరూ ఒకర్నొకరు చూసుకుని అంగీకారంగా తలలూపారు.

"మంచిది, ఇక సెలవు." బ్రహ్మానందం లేచాడు.

అతను ఆఫీసునుంచి నిష్క్రమించాక జాన్ పగలబడి నవ్వాడు.

"ఏమిటి జాన్?"

"మూడు గుద్దులు - ముంతెడు మంచినీళ్ళు!" జాన్ ఇంకా నవ్వుతూ అన్నాడు. "భలే పథకం వేశాడు ఆ అల్లుడు!"

3

కాచీగూడలో మోహన్రావు ఇంటిముందు కారాపి దిగారు డిటెక్టివ్‌లు.

చిన్నసైజు డాబా ఇల్లు. ప్రశాంతంగా వుంది. ఆవరణ

ణలో రకరకాల పూలమొక్కలతో, ఆహ్లాదకరమైన వాతా వరణంలో, అందమైన తోట వుంది.

గేటు నెట్టి లోనికివెళ్లి, ఇరువేపులా పూలమొక్కలున్న బాటగుండా ఇంటివేపుకి నడిచారు. ఇంతలో ఓ వ్యక్తి వరండాలోని కొచ్చాడు. అతనే మోహన్రావని పోల్చు కున్నారు.

మోహన్రావు గబగబ ముందుకు వచ్చి. "గుడ్ మార్నింగ్, ఎవరు మీరు?" అన్నాడు.

"మీ మామగారి దూతలం" జాన్ చెప్పాడు.

మోహన్రావ్ కళ్ళు చిట్లించాడు. "నిజం?"

"నిరూపించాలా? అయితే ఈ చీటీ చూడండి" లాల్ జేబులోంచి బ్రహ్మానందం యిచ్చిన చీటీ అందించాడు.

అందులోని వాక్యం చదవగానే మోహన్రావ్ ఉగ్రు డయ్యాడు. విసురుగా చెయ్యెత్తి లాల్ ముఖంమీద చరి చాడు. "ఎవరు బడుద్ధాయి?"

లాల్ యెర్రబడ్డ చెంపని పట్టుకుని జాన్ని చూశాడు.

జాన్ కోపంగా చూసి, "మీరు మీ మామగార్ని బడు ద్ధాయి చేశారు, మేం మిమ్మల్ని చేశాం" అన్నాడు.

మోహన్రావ్ రెచ్చిపోయి, "ఎవరుమీరు!ఏమిటిదంతా!" అంటూ అర్చాడు.

లాల్ అతని ముఖాన్ని సూటిగా చూస్తూ, "మీరు ప్రమాదకరమైన ఆటలు ఆడుతున్నారు. ఇది చట్టం ఒప్పు కోదు. మేం చట్టాన్ని రక్షించడానికి వచ్చాం. లాల్ అండ్ జాన్ అంటే యీ సిటీలో తెలియనివారు లేరు...." అన్నాడు.

ఆవేశంతో రెచ్చిపోతూ అన్నాడు మోహన్రావ్. "నాకు తెలియని విషయాల గురించి నాతో మాట్లాడకండి! చెక్

అవుట్!"

"ఆల్‌రైట్, వందరూపాయలకోసం చెంపదెబ్బ తిని వూరికేపోను మిస్టర్. నన్నిలా అవమానించినందుకు తర్వాత చాలా చింతిస్తారు. ఏమిటి మీకు తెలియని విష యాలు?" లాల్ ముఖం కోపంతో ఎర్రబడుతోంది.

"రాత్రి మీ మామగారి లాడ్జిమీద బోర్డు మార్చి కస్ట మర్స్‌ని రౌడీలతో కొట్టించడం మీకు తెలియని విషయమా? ఆయన జేబులో ఈ చీటీ పెట్టడం మీకు తెలియని విష యమా? బుకాయించకండి మిస్టర్—!"

"మిస్టర్ అనడం నన్ను కించపరిచినట్టవుతుంది. మిస్టర్ రావ్ అని సంబోధించండి! బిహేవ్ మానర్స్!"

"షటప్!" కసిరాడు లాల్, "విషయం మార్చే ప్రయత్నం చేయకండి. నాకు మీగురించి అంతా తెలుసు! స్కూటర్ కోసం మామగార్ని బెదిరిస్తున్నారు. స్కూటర్ ఇవ్వకపోతే మీ భార్యని వదిలేస్తానని భయపెట్టారు—"

"వదిలేయడం కాదు! మర్యాదగా మాట్లాడండి, విడాకు లిస్తానన్నాను!"

"కీప్ క్వయిట్!" అన్నాడు లాల్, "ఆ తర్వాత నిర్ణయం మార్చుకుని మామగార్నొక్కర్నే శిక్షించ దలచారు. అందుకు గడువు పెట్టారు. గడువుతీరాక ఉత్తరం వ్రాశారు. ఆ ఉత్తరంలో వ్రాసినదాని ప్రకారం నిన్న లాడ్జింగ్‌లో కథ నడిపి పగ తీర్చుకున్నారు— పూర్తిగా కాదు, వారం రోజుల్లో స్కూటర్ మీ గుమ్మం ముందు లేకపోతే చంపేయడానికి తుపాకీ కొన్నారు. అప్పుడు మీ పగ చల్లారుతుంది. చెప్పండి, ఆ తుపాకీ ఎక్కడ కొన్నారు? ఎవరిచ్చారు? లైసెన్స్?"

ఈ మాటలన్నీ విన్నాక మోహన్రావ్ ముఖంలో

రంగులు మారాయి.

"ఇందులో ఏదో మిస్టేక్ వుంది!" అన్నాడు తాపీగా.

"ఏమిటది?" లాల్ అడిగాడు.

మోహన్రావ్ వెనిక్కి తిరిగి చప్పట్లు చరిచి, "చన్నూ" అని పిలిచాడు. అయిదు నిముషాల తర్వాత ఇంట్లోంచి ఓ స్త్రీ బయటికి వచ్చింది.

"ఆమె నా భార్య,సులోచన." మోహన్రావ్ అన్నాడు, "బ్రహ్మానందంగారి ముద్దుల కూతురు. నాకూ ముద్దుగానే వుంటుంది. కానీ, ఈ స్కూటర్ గొడవ వచ్చినప్పటి నుంచీ___"

మాటలాపేశాడతను. సులోచన అతని పక్కకి వచ్చి నిలబడింది. మామూలు లావు, మామూలు ఎత్తు, ఎర్రటి రంగు, నల్లటి పొడవాటి జడ___జాన్ ఆమెని తదేకంగా చూస్తున్నాడు.

"చూడు చన్నూ! మీ నాన్న మితిమీరి ప్రవర్తిస్తున్నాడు. ఈ దూతల్ని మీ నాన్న పంపించాట్ట" అని లాల్ ఆరోపించిన విషయాలన్నీ వివరించాడు.

"లాడ్జింగ్ సంఘటనతో నాకు సంబంధంలేదు. ఈ చీటీతో నాకు సంబంధంలేదు. నేను ఉత్తరం వ్రాసి హెచ్చరించిన విషయం నిజమే. కానీ వ్రాసిన ప్రకారం చేసే అవసరం నాకు లేదు.

మనుషుల సైకాలజీని నేనిట్టే పసిగడతాను. మీ నాన్న సైకాలజీ నాకు తెలును. ఉత్త పిరికిమనిషి! ఆ ఉత్తరమే మందులా పనిచేసి దారికి వస్తాడని అంచనా వేశానుగాని, వ్రాసింది చేయాలని ఆలోచించలేదు."

అని, ఆ తర్వాత లాల్ వేపు తిరిగాడు.

"విన్నారా? ఇక ఆ తుపాకీ గురించి చెప్తాను. నా

స్నేహితుడిదగ్గర అడిగి తీసుకున్నాను. లైసెన్స్ లేదు. పేల్చడం రాదు. వారం రోజుల్లో స్కూటర్ అందకపోతే ప్రాణాలుండవని చెప్పిన మాటకూడా నిజమే. కనీసం ఈ తుపాకీ చూసి అయినా భయపడి స్కూటర్ ఇస్తాడని ఆశిం చానుగానీ, ఇవ్వకపోతే చంపాలని నా ఉద్దేశ్యం కాదు. ఓ. కే, అయితే అతనిప్పుడు తుపాకీవల్లకూడా భయపడ్డం లేదన్నమాట! పైగా తప్పుడు ఆరోపణలుచేసి నా పరువుని —ఓహ్, చన్నూ, మీ నాన్నని నిజంగానే చంపక తప్పదు!"

"ఆ తర్వాత మిమ్మల్ని జెయిల్లోకి తీసుకెళ్ళడానికి నేను వస్తాను" లాల్ అన్నాడు. "మిస్టర్ రావ్, ఇంకా బుకా యించకండి! లాడ్జింగ్ సంఘటనతో మీకు సంబంధం వుంది. ఈ చీటీ మీరే వ్రాశారు!"

"ఏమిటి ఆధారం?"

"మీ దస్తూరీ."

"అవును, అది నా దస్తూరే. అయితే? అది ఫోర్జరీ కాదని గ్యారంటీ ఏమిటి?"

"లాల్ అన్నాడు, "ఆల్‌రైట్, నేను ఆధారాలు నిరూ పించి మిమ్మల్ని శిక్షించడానికి రాలేదు. హెచ్చరించడానికి వచ్చాను. బ్రహ్మానందంగారు పోలీసు కేసులో చిక్కు కున్నారు. ఇందుకు మీ బాధ్యత వుంది!"

మోహన్రావ్ కర్కశంగా చూశాడు. "చూడండి, నేను కెమిస్ట్రీ లెక్చరర్‌ని. లాబ్‌లోంచి సల్ఫ్యూరిక్ ఆసిడ్ తెచ్చి మీ ముఖంమీద జల్లేస్తాను మీరు వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళకపోతే. నౌ, గెట్ అవుట్!"

లాల్, జాన్‌లు వెనక్కి తిరిగి చక చక నడిచి కారెక్కారు.

4

మర్నాడు ఉదయం ఏజన్సీ ఆఫీసులో ఫోన్ మోగింది.

లాల్ రిసీవర్ ఎత్తి, "గుడ్‌మార్నింగ్, లాల్ హియర్" అన్నాడు.

అవతలినుంచి స్త్రీ కంఠం పలికింది. ఆ కంఠం గుర్తు పట్టాడు లాల్.

"త్వరగా రండి! ఇక్కడేదో జరిగింది!"

"ఏం జరిగింది?"

"అయ్యో! త్వరగా రండీ! భయంగా వుంది!"

"ఎందుకు సులోచనగారూ?" లాల్ ముఖం చిట్లించి అడిగాడు.

"ఓహ్, ఫోన్‌లో చెప్పలేను! వచ్చేయండి వెంటనే!" ఆమె అరుపుతోపాటే లైన్ కట్ అయింది.

"ఏమిటి, లాల్?"

"సమ్ ఎక్సైట్‌మెంట్. అక్కడేదో జరిగింది." లాల్ లేచాడు రిసీవర్ పెట్టేసి. "గెటప్, అండ్ లెటజ్ గో!"

"ఏం జరిగింది? సరంజామా తీసుకెళ్ళాలా? భూతద్దాలూ, మెజరింగ్ టేప్—"

"అవసరంలేదు! లేచి పద!" అర్చాడు లాల్.

ఆఫీసుకి తాళంవేసి కారులో బయలుదేరారు డిటెక్టివ్‌లిద్దరూ.

మోహన్రావ్ ఇంటి గేటు తలుపులు బార్లా తెరిచి వున్నాయి. పూలమొక్కల మధ్య వున్న బాటలో నిలబడి వున్నారు—మోహన్రావ్, సులోచన.

మోహన్రావ్ ముఖం గంభీరంగానూ, సులోచన ముఖం గాభరాగానూ వున్నాయి.

"ఆల్‌రైట్, మిస్టర్ మోహన్రావ్!" కారు దిగుతూ

అన్నాడు లాల్, "మీకు వార్నింగ్ ఇచ్చాను. అయినా ఇప్పుడేదో జరిగింది. మీరేం చేశారు?"

"షటప్! ఐవిల్ కిల్ యూ...."

"నెవర్ మైండ్, నెవర్ మైండ్" లాల్ నవ్వాడు. "మీకు కోపం యెక్కువలా వుంది. సరే, మీతో మాట్లాడను. సులోచనగారూ, నన్నెందుకు పిల్చారు?" లాల్ లోనికి నడిచాడు.

జాన్, లాల్ని చేరుకున్నాడు.

"ఇలా రండి!" సులోచన లాల్ చెయ్యి పట్టుకుని లాగింది. ఆరడుగులు వెనక్కి తీసుకెళ్ళి ఓ బంతిపువ్వు మొక్కదగ్గర ఆగింది. "అటు చూడండి!"

లాల్ పువ్వుల్ని చూశాడు, "చాలా బావున్నాయి."

"ఏమిటి బావున్నాయి?" గట్టిగా అర్చింది, "మళ్ళో చూడండి!"

లాల్ మడిలో చూశాడు. ఛటుక్కున వంగబోయాడు. ఆమె వెనక్కు లాగింది. "ముట్టుకోకండి!"

లాల్ నవ్వాడు, "అది పేలదు, తెలుసా?"

జాన్ గబగబ వచ్చి లాల్‌ని చేరుకుని, "ఏమిటి లాల్?" అన్నాడు అయోమయంగా.

"పేల్చబడ్డ బుల్లెట్. ఆ మడిలో వుంది" లాల్ చూపిస్తూ చెప్పాడు. జాన్ ముందుకి వంగి, "తుపాకీ తూటా!" అన్నాడు.

మోహన్రావ్ దూరంగా నిలబడి శ్రద్ధగా గమనిస్తు న్నాడు.

"ఈ తూటా మిస్టర్ రావ్ తుపాకీలోంచి వెలువడింది. ఏమంటారు రావుగారూ—సారీ—ఏమంటారు సులోచన గారూ?" లాల్ అడిగాడు.

"నాకేమీ తెలియదు!"

"మీకేమీ తెలియదూ? ఆల్‌రైట్, జాన్, పోలీసులకి ఫోన్ చేసి రమ్మను! వీళ్ళని ప్రశ్నించే అధికారం మనకు లేదు."

జాన్ వెంటనే వెళ్ళి ఫోన్ చేశాడు. పదినిముషాల్లో ఇన్‌స్పెక్టర్ నాథ్ వచ్చాడు అక్కడకు.

ఇన్‌స్పెక్టర్ అడిగిన ప్రశ్నలన్నిటికీ అభ్యంతరం చెప్ప కుండా సమాధానాలు చెప్పింది సులోచన.

"నిన్నరాత్రి భర్తతో కలిసి సెకండ్ షోకి వెళ్ళినట్టూ, తిరిగి వచ్చి నిద్రపోయినట్టూ, ఉదయం లేవాక స్నానం చేసి తన కిష్టమైన బంతిపూలు కోసుకునేందుకు తోటలోకి వచ్చినట్టూ చెప్పింది.

పూలు బాగా కాచిన మొక్కదగ్గర నిలబడి ఒక పువ్వు కోసినట్టూ, అది చేతిలోంచి జారి మడిలో పడినట్టూ, తను

వంగి అందుకోబోగా పువ్వుకింద ఆ తూటాను చూసినట్టూ, వెంటనే పువ్వు అందుకుని గాభరాగా ఇంట్లోకి వురికినట్టూ చెప్పింది.

ఇంట్లోకి వచ్చి భర్తకి చెప్పగా భర్త కంగారుపడి ఆ తూటా అక్కడ్నుంచి తీసి పారేయడానికి పరుగెత్తినట్టూ, తను అడ్డుపడి ఆ ప్రయత్నం మాన్పించినట్టూ, ఆ తర్వాత ఇంట్లోకి వచ్చి లాల్ ఆఫీసుకి ఫోన్ చేసినట్టూ చెప్పింది.

ఇన్‌స్పెక్టర్ మధ్యలో అడ్డుతగిలి, "రైఫిల్ ఎక్కడ వుంది?" అనడిగాడు ఛటుక్కున.

ఆమె గట్టిగా వూపిరి వదిలి, "తెలియదు!" అంది. "ఇల్లంతా వెతికాం. ఎక్కడా లేదు."

మోహన్‌రావ్ మౌనంగా వుండిపోయాడు.

"ఆల్‌రైట్,మీరు గాలించడం వేరు, మేము గాలించడం వేరు." అన్నాడు నాథ్. "సెర్చింగ్‌కి పోలీసులకో ప్రత్యేకమైన పద్ధతి వుంటుంది. కమాన్ లాల్, రైఫిల్ వెతుకుదాం!"

ఆ మరుక్షణం ఇల్లంతా రకరకాల చప్పుళ్ళతో యుద్ధభూమిలా తయారైంది.

అంగుళం వదలకుండా ఇల్లంతా గాలించివేశారు జాన్, లాల్, నాథ్‌లు. ఫలితం లేకపోయింది.

"నాథ్, మనం ఒక విషయం ఆలోచించాలి. అప్పుడు రైఫిల్ దొరుకుతుంది." లాల్ అన్నాడు. "రైఫిల్ ఎక్కడ నుంచి పేల్చబడిందని మీ అనుమానం?"

"బహుశా ఇంట్లోంచి కావచ్చు!" నాథ్ భుజాలెగరేశాడు ఏదో తట్టి. "ఇక్కడనుంచి ఆ పూలమొక్కల వరకు యాభై అడుగుల దూరంకూడా లేదు. రైఫిల్ ఇక్కడ

నుంచి ఫైర్ చేయబడితే అంత దగ్గరిలోనే తూటా పడు తుందా?"

లాల్ కళ్ళు మెరిశాయి. "అవును నాధ్, ఇదొక చిక్కు సమస్య! మరి ఎక్కడనుంచి పేల్చబడింది? ఎంతదూరం నుంచి పేల్చబడింది?"

ముగ్గురూ తీవ్రంగా ఆలోచిస్తూ కాలుకాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు గదిలో. ఎవరికీ సరయిన ఎక్స్‌ప్లనేషన్ తట్టడం లేదు.

జాన్ ఒక్కక్షణం కళ్ళు గట్టిగా మూసుకుని తెరిచి, కిటికీలోంచి బయటికి చూశాడు, ఆ తర్వాత గదిలోకి చూశాడు, చివరకు కిటికీదూకి బయటికెళ్ళి ఇంటికేసి తల ఎత్తి చూశాడు.

అతని చర్యలు చిత్రంగా తోస్తున్నాయి లాల్, నాధ్‌లకి.

జాన్ కిటికీదగ్గరికి వచ్చి, "సమాధానం దొరికింది." అన్నాడు.

"ఏమిటది?" బయటికే అడిగారీ ప్రశ్న.

"ఆ తూటా లక్ష్యాన్ని తాకకుండా మరి దేనికో తాకి ఆగిపోయింది." వివరించాడు జాన్, "లేకపోతే లక్ష్యాన్ని తాకేది, లేదా వీధిలోకి దూసుకెళ్ళి ఏ ఇంట్లోనో దూరేది. అంతేనా?"

ఉప్పొంగిన ఆనందంతో జాన్‌ని కిటికీలోంచి లాగి గదిలో పడేశారు లాల్, నాధ్‌లు.

"మార్వెలెస్! వండర్ఫుల్! ఫెంటాస్టిక్!"

"స్టాపిట్!" జాన్ లేచి నిలబడ్డాడు. "రైఫిల్ డాబా మీద వుంది."

అతని మాటలు విని వెయ్యి వోల్టేజిల షాక్ తిన్నట్టు అవాక్కయిపోయారు లాల్, నాధ్‌లు.

5

డాబామీద రైఫిల్, కింద తోటలో తూటా దొరికిన మొక్కకి సూటిగా, అంగుళం వ్యత్యాసంలేని దిశలో పెట్టబడి వుంది.

"జాన్, ఎలా వూహించావు? చెప్పు!" లాల్ అడిగాడు.

"చెప్పను, డాబామీంచి నన్ను తోసేస్తారు!"

"సారీ, ఆనందం పట్టలేక కిటికీలోంచి లాగేశాం. దెబ్బలు తగిలాయా?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"నెవర్‌మైండ్." సీరియస్‌గా అన్నాడు జాన్. "కింద నుంచి షూట్ చేస్తేనే మంచి ఫలితం వుంటుంది. కింద ఏ గదిలోంచో షూట్ చేయాలనుకుంటే టార్జెట్ తనకి సూటిగా, అనువైన దిశలో లేకపోతే కష్టం. అదే ఈ డాబా మీద ఎక్కితే ఫ్రీగా తిరుగుతూ టార్జెట్ ఏ దిశలోకి వెళ్ళినా ఎక్కుపెట్టవచ్చు. దట్సాల్."

నాథ్ షేకాండిచ్చాడు. లాల్ సిగరెట్ అందించాడు.

జాన్ ఆ రెంటినీ అందుకుని, "ఇలాటి సందేహాలు మళ్ళీ ఎప్పుడూ అడక్కండి! నా మెదడు అప్పుడప్పుడు చురుగ్గా పనిచేస్తుంది." అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ రైఫిల్ దగ్గరికెళ్ళి రుమాలు చుట్టి పట్టు పట్టుకున్నాడు.

"ఇంతకీ ఆ టార్జెట్ ఏమిటి?" అడిగాడతను.

"బ్రహ్మానందం దేహం" లాల్ అన్నాడు ముక్తసరిగా.

"వాట్! అతను హత్య చేయబడ్డాడా?"

"కావచ్చు. రెండు సంభవాలున్నాయి. ఈ తూటా గురి తప్పింది కాబట్టి అతను బ్రతికి వుండవచ్చు. లేదా రెండవ తూటా తగిలి మరణించవచ్చు."

"అతనిక్కడికెందు కొస్తాడు?"

"హంతకుడు పిలిచి వుండవచ్చు."

"హంతకుడెవరు?"

"నమ్మకంగా చెప్పలేను."

"అనుమానంమీదే చెప్పండి?"

"మోహన్రావ్."

నవ్వాడు నాథ్, "ఏమిటీ మీ ఆలోచనలు! హంతకుడు హతుడ్ని తన యింటికి రప్పించి హత్యచేస్తాడా! అదీ ఈ రైఫిల్‌తో? నాన్సెన్స్ లాల్, రైఫిల్ మోత చుట్టుప్రక్కల అందరూ వింటారు!"

"ఒళ్ళు మరిచిన ఆవేశంతో మోహన్రావ్ ఏదేనా చేస్తాడు. కానీ రైఫిల్ మోత అందరూ వింటారే? ఎవరూ విన్లేదా?" లాల్ అన్నాడు అయోమయంగా.

జాన్ కల్పించుకున్నాడు, "విన్లేదు. అందుకేదో కారణం వుంది. ఆ కారణం త్వరలో తెలుస్తుంది. పదండి కిందికి వెళదాం. ఇన్‌స్పెక్టర్, ఆ తూటా ఈ రైఫిల్‌నుంచి

వెలువడిందో లేదో పరీక్ష చేయించండి. లాల్, ముందు బ్రహ్మానందం ఎక్కడ వున్నాడో తెలుసుకోవాలి" అన్నాడు.

ముగ్గురూ క్రిందకు దిగసాగారు.

అంతలో హఠాత్తుగా ఫోను మోగింది....

సులోచన రిసీవర్ ఎత్తి చెవిదగ్గర పెట్టుకొని ఏదో వింది. ఆ తర్వాత, "అవును, నేనే" అంది. క్షణక్షణానికీ మారిపోతున్న ముఖ కవళికలతో అవతలినుంచి వచ్చే మాటల్ని వింది. ఆ తర్వాత రెండు క్షణాల్లో విపరీతంగా చెమటలు కక్కసాగింది. "వెంటనే రా!" అంది. చివరకు చేతిలో పాముని పట్టుకున్నట్టు షాక్ తిని రిసీవర్‌ని విసిరి కొట్టింది.

ఇదంతా అప్పుడే డాబా దిగి లోనికి రాబోతున్న డిటెక్టివ్‌లూ, ఇన్‌స్పెక్టరూ గుమ్మం దగ్గరే ఆగిపోయి గమనించారు—మధ్యమధ్యలో ముఖాలు చూసుకుంటూ.

"ఎవరది, సులోచనా?" లాల్ అడిగాడు.

సులోచన భోరుమని ఏడవడం ప్రారంభించింది, "అన్నయ్యా... నాన్న కన్పించడంలేదట! వెంటనే రమ్మన్నాను-నాన్న కేమయింది లాల్‌గారూ?"

డిటెక్టివ్‌లూ, ఇన్‌స్పెక్టరూ విస్తుపోయారు.

"మీ నాన్న కేమీ కాలేదు. అనవసరంగా గాభరా పడకండి!" లాల్ ఈ మాటలు అన్నాడేగానీ, అతనే గాభరా పడుతున్నాడు ఆమెకంటే ఎక్కువగా.

పది నిముషాల్లో సింహాచలం గేటుముందు ఆటో దిగి లోనికి పరిగెత్తి వస్తున్నాడు....

లాల్, జాన్, నాధ్ ఆతృతగా చూస్తున్నారతని వేపు. సింహాచలం హాల్లోకి వచ్చి నాధ్ కాకీ దుస్తులు చూసి

బెదిరిపోయాడు. సులోచన ఏడుపువినీ గాభరాపడ్డాడు.

"ఇక్కడేం జరిగింది?"

అతని అరుపుకి అందరూ ఉలిక్కిపడ్డారు. సన్నగా, పొడుగ్గా, ఇరవై రెండేళ్ళు వుండే సింహాచలం గొంతు నిజంగా సింహగర్జనలావుంది.

ఎవరూ మాటాడలేదు. సులోచన వెక్కి వెక్కి ఏడుస్తూ జరిగిందంతా చెప్పింది.

అంతా విని సింహాచలం నాథ్ వేపు తిరిగాడు. అతని ముఖం క్రోధంతో, చెమటతో అసహ్యంగా వుంది.

"ఏమిటి ఇన్‌స్పెక్టర్? నాన్న కేమయింది?"

నాథ్, లాల్‌ని చూశాడు.

లాల్, సింహాచలంతో అన్నాడు, "మీ నాన్న ఎప్పటి నుంచి కన్పించడంలేదు?"

"రాత్రినుంచీ!"

"నువ్వెప్పుడొచ్చావు?"

సింహాచలం కంగారు పడ్డాడు, "ఎక్కడినుంచి?"

"నిన్న ఎక్కడికి కెళ్ళావు?"

"సాగర్ కెళ్ళాను. రాత్రి ఎనిమిది గంటలకి వచ్చాను. నాన్న ఇంట్లోనే వున్నాడు. లాడ్జింగ్‌లో ఏదో గొడవ జరిగినట్టు చెప్పాడు. చాలా బాధ పడ్డాను!

పది గంటలకి బాబు వచ్చాడు. సులోచన దగ్గరినుంచి లాడ్జింగ్‌కి ఫోన్ వచ్చిందని చెప్పాడు. నాన్నని సులోచన వెంటనే రమ్మందని అన్నాడు. నాన్న హడావుడిగా బయలుదేరారు.

నాకేమీ అర్థంకాలేదు. ఈ మధ్య బావ స్కూటరు కోసం పోరు పెడుతున్నట్టు విన్నాను. ఆ విషయమై వెళ్ళాడేమో అనుకున్నాను. కానీ తెల్లారి పది గంటలైనా



నాన్న జాడలేదు. వెంటనే ఇక్కడికి ఫోన్ చేశాను. సులోచన ఏమీ చెప్పడంలేదు! ఏదో జరిగిందని హడావుడిగా వచ్చేశాను...."

లాల్, సులోచన వేపు తిరిగాడు, "రాత్రి నాన్నని రమ్మని ఫోన్ చేశారా?"

"లేదు!" అంది.

"అబద్ధం!" సింహాచలం గర్జించాడు.

"లుక్ బాయ్, నువ్వు సాగర్ వెళ్ళినట్టూ, నిన్న రాత్రంతా ఇంట్లోనే వున్నట్టూ మాకు ఎలిబీ కావాలి" లాల్ ప్రశ్న విని సింహాచలం ఉగ్రుడయ్యాడు.

"నాకు తెలుసు! ఏం జరిగిందో? కానీ నేనేమీ చేయలేదు! సాక్ష్యం చూపిస్తాను! చెప్పండి, నాన్న కేమయింది? ఆయన చనిపోయాడు కదూ? ఆయన్ని ఎవరు చంపారు? చెప్పండి! నాన్నని చంపిందె...."

సింహాచలం నోరు తెరిచి పెట్టేసి, అలాచే కళ్ళు తేలేశాడు. ప్రాణంలేని బొమ్మలా, విగ్రహంలా కూచుండిపోయాడు.

లాల్ తలతిప్పి చూశాడు.

గుమ్మంలో బ్రహ్మానందం నిలబడివున్నాడు.

6

ఒక్కొక్కరి నెత్తిమీద కనీసం పదేసి పిడుగులయినా పడివుండాలి, ఎవరిలోనూ చలనంలేదు.

రేగిపోయిన జుత్తు, మాసిపోయిన దుస్తులు, పాలిపోయిన ముఖం, ఎండిపోయిన పెదవులపైన జీవంలేని నవ్వు....బ్రహ్మానందం అవతారాన్ని తీక్షణంగా చూస్తూ, ఇది భ్రమకాదుసుమా, నిజమనే నిర్ణయానికి అతికష్టం మీద వచ్చారు ఆ ఆరుగురూ.

మోహన్రావ్ పెదవులపైన చిరునవ్వు నిలిచింది. బ్రహ్మానందాన్ని ఆప్యాయంగా కళ్ళతో ఆహ్వానించాడు.

సింహాచలం రెండు చేతులతో కళ్ళు గట్టిగా మూసుకుని, "న....న....న—నాన్నా!" అంటూ అర్చి, నేలమీద పడి మూర్ఛపోయాడు.

సులోచన పరుగున వెళ్ళి తండ్రి భుజంపైన వాలిపోయింది. ఆమె గుండెల కేదో గట్టిగా గుచ్చుకుంది.

లాల్, జాన్, నాథ్‌లు తేలిగ్గా వూపిరివదిలి, ఒకర్నొకరు చూసుకుని బలహీనంగా నవ్వుకున్నారు.

"వూరుకో సులోచనా! ఇప్పుడేమయిందనీ? అందరమూ క్షేమంగా వున్నాం...." బ్రహ్మానందం, కూతుర్ని సముదాయిస్తున్నాడు. సులోచన గట్టిగా ఏడ్చేస్తూ ప్రేమకొద్దీ తండ్రిని ముద్దాడింది.

భుజాలమీంచి ఆమెని మృదువుగా తప్పించి, లాల్ దగ్గరికి నడిచాడు బ్రహ్మానందం.

మరోసారి ముగ్గురి తలలమీద పిడుగులు కురిశాయి!

బ్రహ్మానందం ధరించిన లాల్చీ జేబుమీద, ఛాతీకి

ఎడమవేపు, నల్లటి రంధ్రం ఏర్పడివుంది. ఆ రంధ్రం లోంచి తెల్లగా మెరుస్తూ ఏదో కన్పిస్తోంది.

"ఓహ్, ఇన్‌స్పెక్టర్! బుల్లెట్‌కి అడ్డు తగిలింది అదే!" లాల్ అర్చాడు చెయ్యిపెట్టి చూపిస్తూ.

బ్రహ్మానందం నవ్వుతూ జేబులోంచి స్టెయిన్‌లెస్‌స్టీల్ సిగరెట్ కేస్ తీశాడు.

"షర్టు విప్పేయండి!" నాథ్ ఆదేశించాడు.

బ్రహ్మానందం సిగరెట్ కేసు లాల్‌కి అందించి, లాల్చీ విడిచాడు. సిగరెట్ కేస్ తూటా తాకిడివల్ల కొద్దిగా దెబ్బతింది.

"అంగుళం దూరంలో చావు తప్పించుకున్నాను" బ్రహ్మానందం చెప్పాడు బలహీనంగా నవ్వుతూ!

"ఏం జరిగిందో త్వరగా చెప్పండి!" లాల్ అసహనంగా అడిగాడు.

బ్రహ్మానందం గుండెల నిండా గాలిపీల్చి ప్రారంభించాడు:

"రాత్రి సులోచన దగ్గరినుంచి కబురు వచ్చిందని తెలిపి వెంటనే బయలుదేరి ఇక్కడికి వచ్చాను. ఇంట్లో లైట్లు వెలుగుతున్నాయి. హాలు తలుపు తెరిచివుంది. ఎందుకు పిల్చిందో అర్థంగాలేదు.

ఇంతలో బయట వీధిలో హఠాత్తుగా ఇంజన్ శబ్దం విన్పించింది. నేను కంగారుపడి గేటులోంచి వచ్చి కొంత దూరాన నిలబడ్డాను, పూలమొక్క నానుకుని.

అల్లుడి దగ్గర తుపాకీ వుందన్న విషయం గుర్తుకివచ్చి ముందుకు కదల్లేకపోయాను. నాకేదో ప్రమాదం సంభవిస్తుందని చాలా భయపడ్డాను. ఇంజన్ శబ్దం బయట ఇంకా ఎక్కువైంది. అది జీపనుకుంటాను. ఎంతకీ

కదలడంలేదు. ఇంతలో బ్యాక్ ఫైర్స్ చేయడం ప్రారంభించింది.

ఇంతలో నా ఎదురుగా ఏదో శబ్దం అయింది. జీపు శబ్దంలో ఏమీ విన్పించలేదు. ఆ శబ్దంతోబాటు నా ఛాతీని బలంగా ఏదో తాకింది. బెదిరిపోయి గుండెలు పట్టుకుని గేటుగుండా బయటికి వురికాను. అప్పటికి జీపు ఇంజన్ ఆఫ్ అయింది.

వెనక్కి తిరిగి చూడకుండా మెయిన్‌రోడ్ వరకు పరిగెత్తాను. అప్పుడు చూశాను ఛాతీవంక. జేబుకి నల్లటి రంధ్రం వుంది. సిగరెట్ కేస్ దెబ్బతింది. ఇంకా నయం! ఇది ఏ అల్యూమినియమో, వెండిదో అయితే నా ప్రాణాలుండేవి కావు!"

"ఆ తర్వాత ఏంచేశారు?"

"జరిగిందేమిటో గ్రహించాను. సులోచన రమ్మని ఫోన్ చేసింది భర్తచేత నన్ను చంపించడానికే అన్న అనుమానం బలపడింది. కానీ భర్త బలవంతంగా సులోచన చేత నన్ను రప్పించాడని ఆ తర్వాత అనుమానించాను.

తిరిగి ఇంటి కెళ్ళడానికి భయపడ్డాను. ఇంటి కెళితే నేను చావలేదని తెలుసుకుని మోహన్రావ్ వస్తాడు. అందుకే ఒక హోటల్లో రూం తీసుకుని రాత్రి గడిపాను.

ఉదయం మిమ్మల్ని కలుసుకుని జరిగింది చెప్పాలనుకున్నాను. కానీ మీ ఆఫీసు మూసివుంది. ఎక్కడికి కెళ్ళారో తెలియదు. ఈ సమయంలో అల్లుడు ఇంట్లో వుండడు కాబట్టి, ఇక్కడికి వచ్చి సులోచనని ఆశ్చర్యపరిచి, నన్ను చంపడానికి ప్రయత్నించినందుకు తగిన బుద్ధిచెప్పి—ఆ మోహన్రావ్‌ని పోలీసులకి అప్పజెప్పాలనుకున్నాను.

కానీ, ఇక్కడ మీరున్నారు! ఏం జరిగిందో అర్థం గావడంలేదు! సింహాచలానికేమయ్యింది?" అని ముగించాడు బ్రహ్మానందరావు.

లాల్ సూటిగా చూశాడు: "ఏమీ కాలేదు. మూర్ఛపోయాడు....మీరు చావలేదని తెలిసి...."

"అంటే?"

"మిమ్మల్ని చంపడానికి ప్రయత్నించింది మీ కుమారుడు."

"ఏమిటి మీరనేది?" బ్రహ్మానందం కొయ్యబారిపోయాడు.

లాల్, ఇన్‌స్పెక్టర్ వేపు తిరిగి, "మీరు సింహాచలం జేబులు సోదా చెయ్యండి" అన్నాడు.

నేలమీద తెలివితప్పి పడివున్న సింహాచలం జేబుల్లోంచి ఇన్‌స్పెక్టర్ ఒక ఇన్‌లాండ్ లెటర్, పెయింట్

టిన్నుల తాలూకు రశీదులూ, ఒక ఇగ్నిషన్ కీ, తీసి అందరికీ చూపించాడు.

"వెరీగుడ్" లాల్ అన్నాడు, "ఈ మూడు ఆధారాలతో అతనిపైన హత్యాభియోగం నిరూపిస్తాను. మోటివ్: తండ్రి ఆస్తిని చేజిక్కించుకోడం. ఈ ఉత్తరం హత్య చేసేందుకు ప్రేరేపించింది. ఈ రసీదుల తాలూకు పెయింట్ టిన్నులు కేసు తప్పుదోవ పట్టించడానికి ఉపయోగపడ్డాయి. ఈ ఇగ్నిషన్ కీ హత్యా సమయంలో తనని రక్షించడానికి తోడ్పడింది."

లాల్ ఇంకా అన్నాడు. "బ్రహ్మానందంగారికి అల్లుడి దగ్గరినుంచి వచ్చిన ఉత్తరం కొడుకు చేతిలో పడింది. ఆ ఉత్తరం చదివాక తండ్రిని చంపితే తేలిగ్గా బావమీదికి నేరం మోపవచ్చని భావించాడు.

ఆ ఉత్తరంలో మోహన్రావ్ పర్యవసానం కోసం ఎదురుచూడమని హెచ్చరించాడు కాబట్టి, సింహాచలం తెలివిగా ఆలోచించి ఓ పథకం తయారుచేశాడు. ఆ పథకం ప్రకారం లాడ్జింగ్పైన బోర్డుమార్చి కథ నడిపి అనుమానం మోహన్‌రావ్ మీదికి వెళ్ళేలా చేశాడు.

ఇక తండ్రిని చంపితే ఎవరికీ అనుమానం రాదు తన మీద. మోహన్రావ్ మామని చంపేందుకు తుపాకీ కొన్నాడని అందరికీ తెలుసు-కాబట్టి అతనిమీద కేసు బలంగా వుంటుంది. సింహాచలం సాగర్ వెళ్ళలేదు. ఇక్కడేవుండి పరిస్థితుల్ని గమనిస్తున్నాడు.

గతరాత్రి సులోచనా, మోహన్రావ్ సినిమా వెళుతున్నారని తెలుసుకుని, హత్యకి అదే సరయిన ముహూర్తమని నిర్ణయించాడు. తన లవర్ ప్రభ సహాయంతో విజయవంతంగా చేయవల్సింది చేశాడు.

రాత్రి పది గంటలకి ప్రభ లాడ్జింగ్‌కి ఫోన్‌చేసి సులోచన గొంతు అనుకరించింది. బ్రహ్మానందం ఇక్కడికి బయలుదేరి వచ్చారు. ఆయనకంటే ముందే ముందు ఏర్పాటు చేసుకున్న జీపులో ప్రభతో సింహాచలం ఇక్కడికి చేరుకున్నాడు.

జీపు వీధిలో పెట్టి ఏంచేయాలో ప్రభకి సూచించి, తను ఇంట్లోకివచ్చి లైట్లన్నీ వెల్గించి డాబా ఎక్కి రైఫిల్‌తో సిద్ధంగా కూర్చున్నాడు.

బ్రహ్మానందం వచ్చారు. రైఫిల్ గురిపెట్టాడు. బయట జీపు ఇంజన్ స్టార్టయింది. బ్రహ్మానందం పూలమొక్కల దగ్గర సందేహిస్తూ నిలబడ్డాడు. సింహాచలం కాచుకున్నాడు. జీపు బ్యాక్‌ఫైర్ అవడం మొదలెట్టింది. సింహాచలం ట్రిగర్ లాగాడు. బ్రహ్మానందం వెనక్కి తిరిగి పరిగెత్తారు-ఛాతీ పట్టుకుని.''

అందర్నీ ఓసారి చూసి మళ్ళీ అన్నాడు లాల్.

''తన గురిమీద సింహాచలానికి నమ్మకంవుంది. కాబట్టి మరో తూటా పేల్చలేదు. తండ్రిని 'వెంబడించలేదు. నిశ్చింతగా ఇంటికెళ్ళి నిద్రపోయాడు. కానీ జరిగిందేమిటో అతనికి తెలీదు!''

సింహాచలం చిన్నగా మూల్గాడు. సులోచన ముఖం మీద నీళ్ళు జల్లింది. అతను మళ్ళీ మూల్గి నెమ్మదిగా కళ్ళు తెరిచి ఏదో గొణిగాడు.

బ్రహ్మానందం అసహ్యంగా చూస్తున్నాడతన్ని.

''నాన్నా....ను....వ్వు చావలేదా? అయితే....అయితే....'' మళ్ళీ మూల్గి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు సింహాచలం.

బ్రహ్మానందం తన కొడుకుని చూపిస్తూ, "ఇన్స్పెక్టర్, వాడ్ని అరెస్టు చెయ్యండి" అని అర్చాడు.

మోహన్రావ్ లాల్ వేపు తిరిగి, "ఎక్స్క్యూజ్ మీ. మీపట్ల చాలా క్రూయల్గా ప్రవర్తించాను" అన్నాడు అతి కష్టంమీద.

"నెవర్మైండ్" అన్నాడు లాల్ నవ్వుతూ. ***

వయస్సెంత?

జనాభా లెక్కల వివరణలు సేకరిస్తున్నాడు లోకనాథం—

లోకనాథం ఓ లెక్కల మాష్టారింటికెళ్ళి వివరాలన్నీ అడిగి వ్రాసుకుంటున్నాడు.

"ఇప్పుడు మీ వయస్సెంత?" ప్రశ్నించాడు లెక్కల మాష్టారుని.

లెక్కల మాష్టారు ఒకసారి ముక్కు పొడుం పీల్చి—

"నా వయస్సాండీ...., మా రెండో అబ్బాయి పుట్టి పన్నెండు సంవత్సరాలు అవుతోంది. మా పెద్దాడు మా రెండోవాడికంటె ఏడేళ్ళు పెద్ద. నాకు మా నాన్న నా ఇరవై ఐదో ఏట పెళ్ళి చేశాడు. మా పెళ్ళి జరిగిన ఏడో ఏట మా పెద్దాడు పుట్టాడు....ఐతే, ఇప్పటి నా వయస్సెంతో నీవే లెక్కవేసుకో!"

లోకనాథం తెల్లమొహం వేశాడు అప్పటికే.

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

దంతవైద్యుడు

అజీజ్

"సాయంత్రం త్వరగా రండి!" అంది శ్రీమతి టై అందిస్తూ.

"ఏమిటి విశేషం?" అడిగేను కుతూహలంగా.

"లిబర్టీలో కొత్త పిక్చర్ వచ్చిందిట!"

అనుకున్న జవాబే. "ఏ పిక్చర్?"

"ది లాంగ్ డ్యూయల్! ఆంగ్లో—ఇండియన్ కథట. యుల్‌బెర్నర్ నటించేడు. చూసితీరాలి!"

"ఏదీ, ఆ బోడిగుండు నటుడా?"

"ఆc!"

"ఓ. కే! ప్రయత్నిస్తాను."

"ప్రయత్నించడంకాదు. వచ్చితీరాలి. రేపు కుదరదు. పక్కింటి లాయర్‌గారింట్లో బారసాల పేరంటం! పిక్చర్ మంచి ఎడ్వెంచర్స్‌తో నిండి ఉందిట.

టై కట్టుకోవడం పూర్తయింది. "సరేలేవోయ్! తయారుగా ఉండు" అంటూ కారు తాళంచెవులందుకుని బైటికి నడిచేను.

మా ఆవిడకి ఎడ్వెంచర్లంటే చచ్చే పిచ్చి. ఎడ్వెంచర్స్ లేని బ్రతుకు ఆమె దృష్టిలో ఉప్పులేని పప్పుతో సమానం! అడ్వెంచర్స్ సాహిత్యమన్నా, సినిమాలన్నా చెవి కోసు కుంటుంది.

బాల్యంలో తను వాళ్ల నాన్నని పోరి, సైకిల్ తొక్కడం ఎలా నేర్చుకుందీ, ఈతకొట్టడం ఎలా అభ్య సించిందీ, కాలేజీలో పోకిరీ కుర్రాళ్ల గూబలెలా వాయ గొట్టిందీ చెబుతూ తెగ మురిసిపోతుంది.

అంతటితో ఆగితే బావుండు. స్వతహాగా మెతకప్రాణి నైన నన్నూ, ఎడ్వెంచర్స్ అనే మాటకు తావులేని నా వృత్తినీ అప్పుడప్పుడూ సుతారంగా ఎత్తి చూపుతుంది.

నిజమే! ఒక దంతవైద్యుడి జీవితంలో ఎడ్వెంచర్స్ అంటూ ఏముంటాయి గనక?

బాల్యంనించీ చదువు తప్ప మరో ధ్యాస ఎరగను. మిగతా పిల్లల్ని చూసి, ఓరోజు సైకిల్ నేర్చుకుంటూ

మోకాళ్ళు పగలగొట్టుకొని మళ్ళీ దాని జోలికి పోలేదు. ఈత మాట దేవుడెరుగు, నీళ్ళని చూస్తే ఇప్పటికీ నా కాళ్ళూ చేతులూ ఒకటే గజగజ!

ఉదయం ఎనిమిది కల్లా డిస్పెన్సరీలో ఉండటం, వచ్చిన పేషెంట్లని పరీక్షించడం, చెడిపోయిన పళ్ళు పీకెయ్యడం, కట్టుడుపళ్ళు బిగించడం, ఫీజు రూపంలో జేబులు నింపుకుని సాయంత్రం ఆరింటికల్లా యిల్లు జేరడం, యిదీ నా దిన చర్య!

పాండీబజార్లో ఉంది నా డిస్పెన్సరీ. మద్రాసులో ప్రాక్టీసుజేస్తున్న ప్రఖ్యాత డెంటిస్టుల్లో నన్నూ ఒకడిగా చెప్పుకుంటారు.

డిస్పెన్సరీ కాంపౌండ్‌లో కారాపి దిగగానే, నా అసిస్టెంట్ గాంధి ముందుకు వచ్చి విష్‌జేశాడు. నేను డిస్పెన్సరీ చేరేలోగా అతను ఆఫీస్ తెరిచి, క్లీన్ చేయించి, నాకోసం ఎదురుచూస్తుంటాడు.

లోనికెళ్ళగానే అపాయింట్‌మెంట్ డైరీ తీసి, చెప్ప సాగేడు.

"పదకొండు గంటలకు శ్రీమతి వసుంధరాదేవి వస్తానన్నారు పరీక్ష జేయించుకోడానికి. ఈరోజు ఆవిడ ముందు పళ్ళ రేడియోగ్రాఫ్ తియ్యవలసి ఉంది.

ఆర్ట్సుకాలేజ్ ప్రొఫెసర్ ఫోన్‌చేసి చెప్పారు. పన్నెండు గంటలకి వచ్చి మిమ్మల్ని కలుసుకుంటారట. గత నాలుగు రోజుల్నించీ ఆయన పంటినెప్పితో తీవ్రంగా బాధపడుతున్నారట."

సాలోచనగా తలూపుతూ కుర్చీలో చతికిలబడ్డాను.

తొమ్మిది గంటలనించి ప్రారంభమైంది పేషెంట్ల ఆగమనం! కొందరి కిందిపళ్ళూ, కొందరి దవడనెప్పీ,

కొందరి గమ్‌బాయిల్, కొందరి పళ్ళు పీకడం, కొందరికి కట్టుడుపళ్ళు బిగించడం—

క్షణం తీరిక లేకుండా గడిచిపోతోంది కాలం! మొత్తానికి నా జీవితంకూడా హడావుడిలో తక్కువేం కాదనిపించింది. అందులో ఎడ్వెంచర్‌కు తావులేదన్నది వేరే విషయం!

ఒంటిగంట ప్రాంతంలో కాస్త తీరిక దొరికింది.

టై ముడి విప్పుకుంటూ కుర్చీలో చతికిలబడి, సిగిరెట్ అంటించాను.

అంతలో బల్లమీది ఫోన్ మోగింది.

రిసీవరందుకుని, "ఎస్, డాక్టర్ ప్రభాకర్ స్పీకింగ్!" అన్నాను.

"గుడాఫ్టర్‌నూన్ డాక్టర్! మిమ్మల్ని కలుసుకోవాలి. తీరిగ్గా ఉన్నారా?"

"ఎస్! ట్రీట్‌మెంట్‌కోసమా?"

"ఔను!"

"ఆల్‌రైట్! రండి. ఇంతకీ, మీ పేరు చెప్పలేదు."

"ముత్తురామన్!"

రిసీవర్ క్రెడిల్‌చేసి గట్టిగా దమ్ము లాగేను.

పదిహేను నిమిషాల తరవాత, నా అసిస్టెంట్ లోనికి వచ్చి—

"ఎవరో ముత్తురామనట! మిమ్మల్ని కలుసుకోడానికి వచ్చాడు" అన్నాడు.

తలూపేను, పంపమని.

అతను వెళ్ళిన రెండునిమిషాలకి, "మే ఐ కమిన్ సర్?" అన్న కంఠం వినిపించింది.

"ఎస్, ప్లీజ్?" అన్నాను సర్దుకుని.



స్ప్రింగ్‌డోర్స్ తోసుకుంటూ లోనికి వచ్చాడు ముత్తు రామన్.

ముప్పైఏళ్లుంటాయతనికి. పొడుగు, పొడుక్కి తగ్గ ఆరోగ్యం, బలమైన చేతులు, కళ్లల్లో విజ్ఞత!

"రండి, కూర్చోండి!" అన్నాను కుర్చీ చూపుతూ.

అతను చతికిలబడి, "థాంక్స్!" అన్నాడు మందహాసంతో.

ఆ లిప్తపాటు వ్యవధిలోనే, అలవాటుపడ్డ నా ఎక్స్‌రే కళ్ళు అతని పళ్ళను క్షుణ్ణంగా పరిశీలించేయి.

మనిషి శారీరకంగా ఆరోగ్యవంతుడే అయినా, పళ్ళ విషయంలో ఇన్నాళ్లూ అశ్రద్ధ జేశాడనిపించింది.

"చెప్పండి!" అడిగేను అసలు విషయానికి వస్తూ.

"మరేంలేదు డాక్టర్! ఈ దవడ అప్పుడప్పుడూ

సన్నగా సలుపుతూ వుంటుంది.” అన్నాడు వేలితో కుడి చెంప చూపుతూ.

సాలోచనగా తలూపుతూ లేచి, అతని నోరు తెరిపించి, పరీక్షించాను.

“పళ్ళ విషయంలో మీరంతగా శ్రద్ధ తీసుకుంటున్నట్టు లేదు. కుడి దవడ చివరిపన్ను పిప్పి పట్టేసింది. సరైన ట్రీట్‌మెంట్ జరక్కుంటే, దాని ప్రభావం మిగతా పళ్ళకి పాకుతుంది” అన్నాను.

“ఐతే, డ్రిల్లింగ్ చేస్తానంటారా?”

“తప్పదు! ఖంగారుపడకండి. డ్రిల్ జేసేటప్పుడు మీ కెలాటి నెప్పీ కలగదు.”

“మైగాడ్! డ్రిల్లింగ్ అనగానే నా పైప్రాణాలు పైనే ఎగిరిపోతాయి. దంతవైద్యులు పన్ను పీకడంగురించీ, డ్రిల్లింగ్ గురించీ చాలా విన్నాను. కార్టూన్లు చూశాను.

ఐనా, నే నిక్కడికి డెంటల్ ట్రీట్‌మెంట్‌కోసం రాలేదు డాక్టర్! ఓ ముఖ్యమైన పనిమీదవచ్చాను. ప్రైవేట్ విషయమంటే మీరు కలుసుకోనంటారేమోనని, ట్రీట్ మెంట్ సాకు చెప్పాను.”

నా కళ్ళు విప్పారేయి. “ప్రైవేట్ విషయమా?” అన్నాను ఆశ్చర్యంగా.

అతను తలూపి, “ఔను! నా స్నేహితు డొకడు ఈమధ్యే కొత్తగా డెంటల్ డిస్పెన్సరీ తెరిచాడు. ఈ వృత్తిలో అతను పూర్తిగా కొత్తవాడు గనక, అట్టే అను భవం లేదు.

మీ దగ్గరికి రోజూ రకరకాల రోగాలతో అనేకమంది పేషెంట్సు వస్తుంటారు. మీరు తప్పకుండా వాళ్ళ కేసులకు

సంబంధించిన రికార్డులు ఫైల్‌జేసి పెడతారనుకుం టాను ...” అంటూ చుట్టూ కలయజూసి,

“బహుశా, ఆ మూల ఉన్న బీరువాలోనే, ఆ ఫైళ్ళు వుండి వుంటాయి. నా స్నేహితుడికి ఆ ఫైళ్ళు చూసే అవ కాశ మిచ్చారంటే, వాటిద్వారా అనేక విషయాలు తెలుసు కుని, అనుభవం గడిస్తాడు. ఊరికే ఇవ్వకండి. రెండువేలు చెల్లిస్తాం! ఏమంటారు?”

ఊహించని ప్రస్తావనతో నా నోరు తెరుచుకుంది. “అవి నా పెర్సనల్ పేషెంట్ల రికార్డులు! రికార్డులెప్పుడూ అమ్మ బడవు!” అన్నాను నిర్మొహమాటంగా.

“నిజమే! ఒప్పుకుంటాను. కాని, ఇది నా ప్రాణమిత్రు డికి సంబంధించిన వ్యవహారం గనక, మిమ్మల్నింతగా ప్రాధేయపడుతున్నాను. కాదనకండి!” అంటూ జేబులోంచి పర్సు తీశాడతను.

“సారీ మిస్టర్ ముత్తురామన్! మీరు అనవసరంగా శ్రమపడుతున్నారు. నిజానికా ఫైళ్ళవల్ల అతనికొరిగే లాభం ఏమీ ఉండదు. ఎందుకంటే, వాటిలో నా పెర్సనల్ పేషెంట్ల దంతాల తాలూకు చార్టులూ, మ్యాపులూ తప్ప మరేం లేవు. అందులో మాజీ పేషెంట్ల ఫైళ్ళూ, ప్రస్తుత రోగుల రికార్డులూ వున్నాయి!”

“ ఫరవాలేదు! అవే ఇవ్వండి! మరో వెయ్యి! అంటే, మూడువేలు చెల్లిస్తాను.”

వినే ఘటంలా లేడు. “గాంధీ!” అరిచాను అసహ నంగా.

ముత్తురామన్ మొహంలో చిరునవ్వు మాయమైంది. “అతనికెందుకులెండి ఇబ్బంది! నేనే పోతాను. మాకిప్పుడే ఏం తొందరలేదు. ఈ రాత్రి నిదానంగా ఆలోచించే,

నిర్ణయం తీసుకోండి. నేను మళ్ళీ రేపు వస్తాను. ఆ పైళ్ళు సంపాదించి పెట్టకుంటే నా స్నేహితుడికి నామీద కోపం రావచ్చు!" అంటూ లేచాడు.

అంతలో గాంధి లోపలికి వచ్చి, "ఎస్, సర్!" అన్నాడు.

"మరేం లేదు మిస్టర్ గాంధీ! నేను వెళుతున్నాను. నా దంతాలు పరీక్షించినందుకు మెనీ థాంక్సు డాక్టర్! రేపు వచ్చి డ్రిల్లింగ్ జేయించుకుంటాను. ఆ నెప్పివల్ల మాంసం ముక్కలు నమలడమే కష్టమౌతోంది నాకు!" అంటూ బైటికి నడిచాడు ముత్తురామన్.

2

మర్నాడు ఉదయం పదకొండు గంటలకు టేబిల్‌మీది ఫోన్ మోగింది.

రిసీవరందుకోగానే ముత్తురామన్ కంఠం వినిపించింది.

"హల్లో డాక్టర్, గుడ్‌మార్నింగ్! ఆలోచించారా?"

"ఆలోచించే అవసరం లేదు! ఖచ్చితంగా చెప్పేశాను కదా, ఆ పైళ్ళు అమ్మబడవని?" అన్నాను మొహం చిట్లిస్తూ.

"పోనీ, నాలుగువేలు! ఇది చివరి ఆఫర్! ఇంతకిమించి ఇచ్చుకోలేను. సాయంత్రం ఐదున్నర ప్రాంతంలో వచ్చేస్తాను. రెడీగా వుండండి."

"మీ పన్ను డ్రిల్ జేయించుకోవాలనుంటే తప్ప, పైళ్ళ విషయంలో మాత్రం రావద్దు! వచ్చినా ప్రయోజనం వుండదు. ఇద్దరి సమయం వృధా అవడంతప్ప!"

"ఆల్‌రైట్! అలాగే డ్రిల్లింగ్‌కూడా జేయించుకుంటాను. ఈరోజు నెప్పికూడా మరీ ఏక్కువగా వుంది."



అంటూ రిసీవర్ పెట్టేశాడతను. పగలంతా ఆ ముత్తురామన్ గురించే ఆలోచిస్తూండిపోయాను. ఆలోచిస్తున్నకొద్దీ ఆ వ్యక్తి చాలా విచిత్రంగా కనిపిస్తున్నాడు నాకు.

సాయంత్రం సరిగ్గా ఐదున్నరకు రానే వచ్చాడు.

లోపలికి రాగానే, డెంటిస్ట్ ఛేర్‌లో జారగిలబడి, "ఆలోచించారా డాక్టర్!" అన్నాడు.

తలూపి, "ఔను! ముందు మీ పన్ను డ్రిల్ చెయ్యనివ్వండి. ఎక్కువసేపుంటే నెప్పి దుర్భరం కావచ్చు." అన్నాను డ్రిల్లింగ్ ఇన్‌స్ట్రుమెంట్ అందుకుంటూ.

"సరే, కానివ్వండి?" అన్నాడు కుర్చీ వెనక తల ఆనించి.

"అట్టే టైం పట్టదు. కొద్దిగా డ్రిల్ జేసి, తాత్కాలికంగా అందులో మందు కూరుతాను. రేపు మళ్ళీ అందులో డెంటల్ పేస్ట్ నింపవలసి వుంటుంది."

"ఆల్‌రైట్! అలాగే కానివ్వండి!"

ఇన్‌స్ట్రుమెంట్ అందుకుని నా పని ప్రారంభించేను.

పావుగంటలో పూర్తయింది పని.

"నెప్పి కలిగిందా?" అడిగేను బేసిన్‌లో చేతులు కడుక్కుంటూ.

"నో, నో! ఏమాత్రం కలగలేదు. ఎప్పుడు డ్రిల్ చేశారో, ఎప్పుడు మందు కూరారో బొత్తిగా తెలీలేదు సుమండీ! థాంక్స్" అంటూ జేబులోంచి పర్సు తీశాడు.

వంద రూపాయలు మొత్తం ముప్పై లెఖ్ఖపెట్టి, "ఇంద, మూడువేలు!" అన్నాడు వాటిని ముందుకు చాపుతూ.

"నా ఫీజు అంత కాదే!" అన్నాను నివ్వెరబోయి.

ముత్తురామన్ నవ్వి—"ఇది మీ ఫీజు కాదు! ఆ ఫైళ్ళ తాలూకు ఎమౌంట్!" అన్నాడు.

నా మొహం జేవురించింది. "ముందే స్పష్టం చేశాను. వాటి నమ్మనని! ఇక ఆ విషయంమీద మీతో వాదించ దలచుకోలేదు."

అతను చిన్నగా నవ్వుతూ, పర్సు జేబులో పెట్టుకుని లేచాడు. తిరిగి బైటికి వచ్చిన అతని చేతిలోని వస్తువు చూసి, నిర్ఘాంతబోయాను.

అది పిస్తోలు!

"చేతిలో బెత్తం లేకుంటే, పిల్లలకి పాఠాలు చెప్పడం కష్టమంటారు! మీరు బుద్ధిగా నా విన్నపం విని వుంటే, ఈ పరిస్థితి వచ్చేదికాదు. పైగా, మూడువేలు కూడా ముట్టేవి. నీలాటివాళ్ళని ఎలా లొంగదీసుకోవాలో నాకు తెలుసు. ఊఁ, మర్యాదగా బీరువా తెరిచి, ఫైళ్ళు తియ్!" అన్నాడు ముత్తురామన్ పిస్తోలు ఊపుతూ.

"మిస్టర్! ఏమిటిది? ఏమిటీ దౌర్జన్యం?"

"పదహారణాల దౌర్జన్యమే! కాలయాపన జెయ్యక! బీరువాలో వున్న ఏ టు జెడ్ వరకూ వుండే ఫైళ్ళన్నీ తీసి, టేబిల్ మీద పెట్టు!" అన్నాడతను కటువుగా.

జీవితంలో ఎన్నడూ ఎరగని సంఘటన! దడదడలాడే గుండెలతో బీరువావైపు నడిచేను. బీరువా తెరిచి, ఏ టు జెడ్ వరకూ వున్న ఫైళ్ళన్నీ తీసి బల్లమీద పెట్టేను.

అతను వెంటనే వాటిని రెండు చంకల్లో ఇరికించుకుని, "థాంక్సు డాక్టర్! నా మిత్రుడు వీటినిచూసి, ఎంతో సంతోషిస్తాడు. నా పంటినెప్పి పోగొట్టినందుకూ్కడా మెనీ థాంక్సు! ఈ రాత్రి భోజనంలో తప్పకుండా కోడిమాంసం నముల్తాను!" అంటూ గబగబ బైటికెళ్ళిపోయాడు.

క్షణం వృధాజెయ్యకుండా, టేబిల్మీది ఫోన్ దగ్గరికి లాక్కున్నాను. చకచక క్రైంబ్రాంచికి రింగ్‌చేసి రిసీవరందుకున్నాను.

"ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి స్పీకింగ్!" వినిపించింది అవతలి నించి.

"నేను మిస్టర్ రెడ్డీ! డెంటిస్ట్ ప్రభాకర్ని! కొద్ది నిమిషాల క్రితం ముత్తురామన్ అనే వ్యక్తి నన్ను పిస్తోలుతో బెదిరించి, నా పేషెంట్లకు సంబంధించిన ఫైళ్ళెత్తుకుపోయాడు. తక్షణం డిస్పెన్సరీకి రండి!" అన్నాను.

"వస్తున్నాను!" అవతల క్లిక్‌మంది.

పావుగంట లోపల హుటాహుటిన వచ్చాడు ఇన్‌స్పెక్టర్. మొదటినించీ జరిగిందంతా అతనికి వివరించి, "ముందు నా అనుమానాలు తీర్చండి ఇన్‌స్పెక్టర్! ఈ మధ్య మీకేదైనా గుర్తు తెలియని శవం దొరికిందా! అంటే, గుర్తుపట్టడానికి వీల్లేని స్థితిలోవున్న శవం?" అడిగాను కుతూహలంగా.

ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోయి, "ఎలా ఊహించారు? నిజమే. రెండు రోజులక్రితం పానగల్ పార్కులో పొదల మధ్య ఓ శవం దొరికింది. పెట్రోల్‌పోసి గుర్తు పట్టలేనంతగా కాల్చేశారు. ఇంతకీ, ఆ హత్యకూ, దీనికి ఏమిటి సంబంధం?" అడిగాడు.

నవ్వేను. "ఇంకా అర్థంకాలేదా ఇన్‌స్పెక్టర్? మనిషిని గుర్తించడానికి వేలిముద్ర లెంత ప్రాముఖ్యం వహిస్తాయో, నోట్లోని పలువరస కూడా అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యం వహిస్తుంది!

మనిషికీ, మనిషికీ మధ్య వేలిముద్రల్లో ఎంతో తారతమ్యం వుంటుంది. అలాగే ప్రతిమనిషి పళ్ళ నిర్మాణం లోనూ ఎంతో వ్యత్యాసం వుంటుంది!

ఆ మనిషిని హత్యజేసి, అతనెవ్వరో గుర్తుపట్టకుండా శరీరాన్ని కాల్చేశారు. అటువంటప్పుడు అతని డెంటల్ రికార్డ్ గనక పోలీసులకి దొరికితే, అతనెవ్వరో సులువుగా తెలుసుకోవచ్చు.

ప్రతి డెంటిస్టు దగ్గిరా అతని పేషెంట్ల డెంటల్ రికార్డ్ వుంటుంది. బహుశా, ఆ మరణించిన వ్యక్తి నా పేషెంట్లలో ఒకడై వుంటాడు. నా అనుమానం ప్రకారం ఆ ముత్తురామనే అతన్ని చంపి వుంటాడు.

అంతేకాదు, అది అతని అసలుపేరై వుండదు. పోలీసులకు హతుడెవ్వరో తెలిస్తే, తనమీద అనుమానం మళ్లుతుందన్న భయంతో శవాన్ని గుర్తుపట్టకుండా కాల్చేశాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చి వుంటుందతనికి. దంతాల ద్వారా హతుణ్ని గుర్తుపట్టవచ్చని! హతుడు నా దగ్గర డెంటల్ ట్రీట్‌మెంట్ చేయించుకున్నట్టు హంతకుడికి



తెలిసివుంటుంది. నా దగ్గర తప్పకుండా ఆ రికార్డు వుండి వుంటుందనీ, పోలీసులు రంగంలోకి దిగకముందే ఆ ఫైలు మాయం జెయ్యాలనీ పథకం వేశాడు.

ముందు నాకో కట్టుకథ చెప్పి, మర్యాదగా ఫైళ్ళు తీసికెళ్ళాలనుకున్నాడు. నేను ససేమిరా అనేసరికి, పిస్తోలుతో బెదిరించి పని ముగించుకున్నాడు...."

"ఇప్పుడెలా? ఫైళ్ళు చేజిక్కాక అతనీ చుట్టుపక్కలుంటాడా? ఈపాటికి ఎంతదూరం వెళ్ళాడో? ఏ వైపు వెళ్ళాడో? అతని వాలకాన్ని స్పష్టంగా వివరించగలరా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"తల వెంట్రుకలనించీ, దంతాలవరకూ వివరించగలను. అంతేకాదు. ఇప్పుడతను ఎక్కడ దొరుకుతాడో కూడా వివరించగలను!" అన్నాను నవ్వుతూ.

"ఎలా?" అన్నాడు ఇన్స్పెక్టర్ అప్రతిభుడై.

"మొదటినించీ నా కతనిమీద అనుమానంగానే వుంది-

ఏదైన అఘాయిత్యానికి పాల్పడతాడేమోనని! అందుకే, అతని పన్ను డ్రిల్ చేశాక, ఆ రంధ్రంలో తీవ్రమైనపోటు తెప్పించే మందు నింపాను. అరగంట తరవాత దాని ప్రభావం ప్రారంభమౌతుంది!

అంటే, ఈపాటికతని పన్ను భరించలేనంతగా సలపడం ప్రారంభించి వుంటుంది. ఏ బాధనైనా తట్టుకోవచ్చుగానీ, మనిషి పంటిబాధను తట్టుకోడం దుర్భరం!

విధిలేక అతను మరో దంతవైద్యుడి దగ్గరికెళ్ళి, బాధ నివారించమని ప్రాధేయపడతాడు. మీరు వెంటనే, నగరంలోని దంత వైద్యులందర్నీ హెచ్చరించి, ప్రతి డిస్పెన్సరీకీ మీ మనిషిని పంపండి! దట్సాల్!" అన్నాను నవ్వుతూ.

"యూ ఆర్ వండర్‌ఫుల్ డాక్టర్! మీ దూరదృష్టితో మా సమస్యను సులభతరం చేశారు. మెనీ మెనీ థాంక్స్!" అంటూ హడావుడిగా బైటికెళ్ళాడు ఇన్‌స్పెక్టర్.

త్వరగా ఇంటికి బైలుదేరాలి. నా వృత్తిలో ఎడ్వెంచర్స్ లేవని దెప్పిపొడిచే శ్రీమతికి ఈ సంఘటన చెప్పి అదరగొట్టాలి, అనుకుంటూ కారుతాళం చెవులందుకున్నాను.***

దెబ్బకు దెబ్బ!

ఒక మతిమరుపు మనిషి పేపరు చదువుతుండగా వాళ్ళ చిన్నపాప వచ్చి—

పాప:-నాన్నా, చూడు బుజ్జిగాడెలా కొడ్తున్నాడో?

తండ్రి:-ఆఁ మాత్రానికే నాకు చెప్పాలా..నువ్వూకొట్టు...

(కాస్సేపటికి పాప మళ్ళీ వచ్చింది)

పాప:-నాన్న, కుక్క కరిచింది....?

"అబ్బబ్బ!....నువ్వూ కఱవ్వే...." అంటూ మళ్ళీ పేపర్లో తలదూర్చాడు ఆ తండ్రి.

—నానిబాబు, విశాఖపట్టణం-4.

కదిలే బొమ్మలు

చాగాపురం నాగేశ్వరరావు



"ఐతే మీరీ రాత్రి మా 'మర్డరర్స్ డెన్'లో గడపడానికి నిశ్చయించుకున్నారన్నమాట?"

"ఔను. మార్నింగ్ ఎడిషన్‌లో మీ వాక్స్‌వర్క్ ప్రకటన చూశాను. ఒక్కరాత్రికి ఐదువందలు వచ్చేటపుడు ఎలా ఊరుకుంటాను?"

"ఇప్పటికి ఇద్దరు వచ్చారు. ఉంటామని అన్నారు. కానీ వివరాలు చెప్పడంతోటే మారు మాట్లాడకుండా డెన్‌ను చూడకుండానే వెళ్ళిపోయారు. మీరు విలేఖరులా?"

"కాదు. ఓ చిన్న రచయితను. ఈ రాత్రి మీ డెన్‌లో గడిపితే, ఏదైనా ప్లాటు లభిస్తుందేమోనన్న ఆశకూడా ఉంది."

"ఐతే, మేమిచ్చే ఐదువందలు కూడా కావాలా?"

"ఆహా—ఏ వేషం వేసినా డబ్బు కొరకే కదా?"

"సరే. మీకా డెన్‌ను చూపుతాను, రండి. చూసిం తర్వాత మీకిష్టమైతేనే గడపండి. మా కంపెనీకి మాట రాకూడదనే ఈ విధంగా ప్రకటించాము. దాంట్లో ఏ భూత ప్రేతాలు లేవని—కేవలం మైనపుబొమ్మలే ఉన్నాయని, మీరు ఋజువు చేయాలి. ఈ సహాయం చేయాలి—"

శర్మ వాక్స్‌వర్క్స్ మేనేజర్ ముందు నడవ సాగాడు.

అతడి వెంటనే నేను నడవసాగాను. షోరూం బందు చేశారు.

మేనేజర్ ఆ గదిని తెరిచి చూపించాడు.

గాంధీ, నెహ్రూ, బోస్, శాస్త్రి, ఇంకా పేరెన్నికగన్న రాజకీయ నేతల బొమ్మలు—చారిత్రక పురుషుల బొమ్మలు సజీవంగా నిలుచుని ఉన్నట్లున్నాయి.... ఝాన్సీ లక్ష్మీబాయి వంటి సాహస స్త్రీల బొమ్మలుకూడా ఉన్నాయి. అవి ఎంతో అందంగా ఉన్నాయి.

మరో గదిలో కొంతమంది వర్కర్స్ మైనపుబొమ్మలు చేస్తున్నారు. వాటిలో కొన్నిటిని అమ్ముతారు. షో రూంలో

పెట్టి ప్రేక్షకులకు డబ్బు తీసుకుని చూపుతారు. ఎంతో ఆదాయముంది వారికి.

దేశ విదేశస్థుల చరిత్ర ప్రసిద్ధిపొందిన వారి బొమ్మలే కాక త్యాగధనుల బొమ్మలు—పురాణ పురుషుల బొమ్మలు కూడా ఉన్నాయి.

అన్నిటిని మించి మరో ప్రత్యేకత ఉందా భవనంలో. హంతకుల, గజదొంగల, దోపిడీదార్ల బొమ్మల నన్నిటినీ ఓ డెన్‌లో ఉంచి చూపిస్తున్నారు. ఆ డెన్ పేరే-మర్డరర్స్ డెన్! మేనేజర్ ఆ డెన్ ముందు నిల్చున్నాడు. తలుపుపైన ఎఱ్ఱని అక్షరాలతో "మర్డరర్స్ డెన్" అని వ్రాయబడి ఉంది. ఆ గదిలోనే నేను ఈ రోజు రాత్రి గడపాలి! ఆ ప్రాణంలేని బొమ్మలు నన్నేం చేస్తాయి? నవ్వుకున్నాను.

మేనేజర్, చార్మినార్ గోల్డు సిగరెట్ నా కాఫర్ చేయబోయాడు. థాంక్స్ చెప్పి విజయ్ సిగరెట్ ముట్టించుకున్నాను

డెన్‌లోకి ప్రవేశించాం ఇద్దరము.

"మీ పేరు నాగేశ్వర్రావన్నారు కదూ?"

"ఔను."

"ఇక్కడి బొమ్మలతో పరిచయం చేస్తాను....మీరు ఈ రాత్రి ఇక్కడే గడుపుతారని వాచ్‌మన్‌తో చెబుతాను. మీకు భయంవేస్తే బయటకు వచ్చేసేయండి. లోపల తలుపులు వేసుకోకండి."

తల వూపాను. లోపల కొంచెం బెదురు ప్రారంభమైంది. డెన్ తలుపులు తెరిచినపుడు బుస్సున గాలి వచ్చింది. లోపలవున్న బొమ్మల వెంట్రుకలు గాలికి ఊగాయి....మనిషెత్తు బొమ్మలు క్రూరంగా—మీదికి

రాబోతున్నట్లు, హత్యలు చేస్తున్నట్లున్న బొమ్మలున్నాయి. వాటిని చూడగానే కొంచెం భయం వేస్తుంది!

మేనేజర్ వాచ్‌మెన్‌ని పిలిచి, ఆరాంఛేర్—ఫ్లాస్క్ నిండా కాఫీ, పత్రికమ్మన్నాడు.

వాచ్‌మెన్ వెళ్ళాం తర్వాత మేనేజర్ బొమ్మలముందుకు కదిలాడు.

"చూడండి నాగేశ్వర్రావుగారూ! మొన్న రాత్రివరకు ఇక్కడేం విశేషాలు లేకుండినాయి. కానీ నిన్న సాయంత్రం నుండి వింతలు జరుగసాగాయి. ఇక్కడి బొమ్మలు కదుల సాగాయి.

ఒక బొమ్మ ఓ ప్రేక్షకుడిని పట్టుకుని గుంజింది. రేజర్‌తో చంపబోయింది. దాంతో ఆ ప్రేక్షకుడు బెదిరి, గట్టిగా కేకలు వేసి పారిపోయాడు. మిగిలిన ప్రేక్షకులంతా భయపడి ఇండ్లకు పారిపోయారు.

ఈరోజు కావాలనే మేము ఈ డెన్‌ను మూసివేశాం. ఎందుకంటే ఎవరైనా పిరికిగుండె కలవాడు హార్ట్‌ఫెయిలై మరణిస్తే, మా కంపెనీకి చెడ్డపేరు రాదా? అందుకే ఒక్క రాత్రి ధైర్యంగా ఈ డెన్‌లో పడుకుని—ఏమీ లేదని నిరూపించిన వారికి ఐదువందలు ఇస్తామని ప్రకటన చేశాం, డైలీలో. మీరు వచ్చారు. సంతోషం.

మీకు బొమ్మలను పరిచయంచేస్తానని అన్నాను కదూ! చూడండి. ఈ బొమ్మ ఓ ప్రసిద్ధ సినిమా నటునిది. మరి ఈ మర్డరర్స్ డెన్‌లో ఎందుకుంచానని అంటారా? అతడు హంతకుడు. తన అన్నను చంపి-ఆత్మహత్య చేసుకున్నాడని ప్రచారం చేశాడు. కానీ నేరస్థుడు పట్టుబడక తప్పదు. పట్టుబడ్డాడు. శిక్ష అనుభవించాడు...." మేనేజర్ ఆగాడు.

అప్పుడే మెల్లగా 'హాఁ' అని ఆపులించిన శబ్దం వినిపించింది.

ఉలిక్కిపడ్డాను. ఇదేమిటి? ప్రాణంలేని బొమ్మలు ఆవులించడమేమిటి? అయితే మేనేజర్ కా విషయం చెప్పలేదు....

అతడు మరో బొమ్మను చూపిస్తూ, "ఇతడు ఓ విచిత్రమైన హంతకుడు. సినిమాలు చూసి అందులోని విలన్ హత్యలు ఎలా చేశాడో తానూ అలాగే చేశాడు. ఏ ఉద్దేశమూ లేకుండా—అరవై ఎనిమిదిమందిని చంపాడు. పట్టుబడ్డ తర్వాత అతణ్ణి ఉరి తీశారు...."

ఆ బొమ్మను చూశాను. మామూలు మనిషే. ఏమీ క్రూరత్వం లేదా బొమ్మలో. అదొక పిచ్చి....

"ఈమె ఎవరో తెలుసా?" ఒక ఆడమనిషిని చూపుతూ అడిగాడు మేనేజర్.

"జుమిలియా" అని అతడే అన్నాడు.

"ఎన్నో గ్రామాలను కొల్లగొట్టింది. అకారణంగా ఎంతోమందిని చంపింది. ఈమె పేరు వింటేనే చాలు ప్రజలు హడలిపోయేవారు...." అన్నాడు.

వారిని చూస్తూ నిల్చున్నాను. అలా అందరినీ పరిచయం చేస్తూ చివరకున్న ఓ బొమ్మను దూరంనుండే చూపిస్తూ, "ఇతడెవరో మీకు తెలుసనుకుంటాను?...." అని అడిగాడు.

"తెలియదు."

"మద్రాసులోని ఓ గొప్ప డాక్టర్. సర్జన్. ఎంతో మందికి ప్రాణదానం చేసిన ఈ మహానుభావుడు తన ఆనందానికై హంతకుడయ్యాడు."

"ఎందుకు? ఎలా ...?" అంటూ ఆ బొమ్మను చూశాను.

నన్నే చూస్తున్నట్టున్న ఆ కనులు కదిలినట్లుగా భ్రమించాను. టపటపమని రెప్పలు కొట్టుకున్నాయి. ఆ కన్నులు ఎర్రగా భయంకరంగా ఉన్నాయి. డెన్‌లోని డిమ్‌లైటు వెలుతురులో....ఆ కన్నుల్లోకి చూస్తున్నప్పుడు నాలోని శక్తిని గుంజుతున్నట్లుగా అయింది. ఓహ్! హిప్నటైజ్ చేసేలా వుంది ఆ మైనపు బొమ్మ! అనుకున్నాను.

"ఏమాలోచిస్తున్నారు? డాక్టరు ఎందుకు హంతకుడయ్యాడనా? చెబుతాను....పగలంతా ప్రజాసేవ చేసి, రాత్రి కాగానే హంతకుడిగా మారేవాడు. తన పేషెంట్లను కాక అనామకుల గొంతులను కత్తిరించేవాడు. శిరసును, మొండాన్ని వేరుచేసేవాడు. తల, మొండెము కొట్టుకుంటూ ఉంటే ఆనందాన్ని అనుభవించేవాడు. రక్తం చివ్వున చిమ్ముతూంటే ఆనందంతో కేకలు వేసేవాడట.

ఈ హత్యలు ఏ భూతమో, దయ్యమో చేస్తోందని ప్రజలు భయపడిపోయారు.

పోలీసు బలగమంతా—నడుముకట్టి చివరకు ఋజువులతో—ఈ డాక్టర్ని పట్టుకుంది. ఐనా డాక్టర్ హైకోర్టులో అప్పీలు చేసుకున్నాడు తాను నిరపరాధినని. కానీ హైకోర్టు అతణ్ణి విడిచిపెట్టలేదు. ఉరిశిక్ష విధించింది.''

చెప్పటం ఆపాడు మేనేజర్. ఓ సిగరెట్ ముట్టించాడు. నేనూ సిగరెట్ ముట్టించాను.

మేనేజర్ మళ్ళీ చెప్పసాగాడు. ''జైల్లో వేశారు అతడిని. కొన్ని రోజులకు ఉరితీస్తారనగా జైల్లోనే అతడు మరణించాడు. కానీ ఇప్పటికీ బ్రతికే ఉన్నాడని మద్రాసు ప్రజలు నమ్ముతున్నారు. డాక్టరు చనిపోయిన తర్వాత మళ్ళీ అతడు చేసిన విధంగానే మరికొన్ని హత్యలు జరిగాయ్.''

''చనిపోయేవాళ్ళు డాక్టర్ని ప్రతిఘటించేవాళ్ళు కారా?''

''డాక్టర్కు హిప్నాటిజం వచ్చట. అతడు ఎదుటిమనిషి కళ్ళల్లోకి చూస్తూ, ఏమంటే అది చేసేవాడట. ఊరికే నిల్చుని పోయేవాడట. అప్పుడు తనకు కావాల్సిన విధంగా ఎదుటవ్యక్తిని చంపేవాడు....''

అరే! అందుకే ఆ బొమ్మలో కూడా సమ్మోహనశక్తి ఉందా? ఏం? అనుకుని నవ్వుకున్నాను.

మేనేజర్ నాకు ధైర్యంచెప్పి వెళ్ళిపోయాడు.

వాచ్ మెన్ తెచ్చిన ఆరాంఛెయిర్‌లో కూర్చుని ఆలోచించసాగాను. కథ ఎలా మొదలుపెట్టను? అని....

వాచ్ మెన్ ఓరగా తలుపుమూసి వెళ్ళిపోయాడు....

కొద్దిసేపటికి ఎవరో దగ్గినట్లుగా వినిపించింది.

చటుక్కున వెనక్కు తిరిగి చూశాను.

గుండె ఆగినంత పనైంది!

డాక్టర్ బొమ్మ తల గోక్కోంటుంది....

ఏమిటీ మాయ? డాక్టర్ బ్రతికి వచ్చాడా? లేక భ్రమ పడుతున్నానా? అనుకుని శరీరాన్ని గిచ్చుకున్నాను. నొప్పి కలిగింది....కలకాదు. భ్రమ కాదు. నిజం!

అప్పుడే ఆ డాక్టరు బొమ్మ నా దగ్గరకు చిన్నగా నడిచి వచ్చింది.

"హలో! నాగేశ్వరరావుగారూ!" అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. హృదయం జల్లుమంది. వెంటనే ఓ మూడుసార్లు గాయత్రీ మంత్రాన్ని జపించాను. అతడి కళ్ళల్లోకి చూడలేదు. తలకిందకు దించుకున్నాను. చూసుంటే? నా మనసును కంట్రోల్ చేసుకున్నాను.

"మీరూ, మేనేజరూ మాట్లాడుకున్నది విన్నాను. అప్పుడే మీ పేరు తెలిసింది. ఈ రాత్రికి నాకు తోడుగా వుంటున్నందుకు థాంక్స్!" అన్నాడు డాక్టర్.

"నీవు చనిపోలేదా?"

"మర్యాదగా మాట్లాడండి."

"సారీ. మీరు బ్రతికే వున్నారా?"

"అసలు నేను చనిపోతేగదా? జైలు డాక్టర్ని, వార్డన్‌ను — నా సమ్మోహన శక్తితో వశపరుచుకుని, తప్పించుకున్నారు. వారిద్దరినీ చంపేశాను."

"నాకు తెలుసు. నన్ను సి.ఐ.డీలు తరుముతున్నారని. మద్రాసునుండి హైద్రాబాదుకు వచ్చాను నిన్న. నన్ను వెంటాడుతూ వచ్చిన సి.ఐ.డీని తప్పించుకోవడానికి మార్గం వెతుకుతూంటే, ఈ వాక్స్ వర్క్స్ బంగళా కనిపించింది. ప్రేక్షకులు లోపలి బొమ్మలను చూడ్డానికి వెళుతుంటే నేనూ ఓ ప్రేక్షకుడిలా లోనికి వెళ్ళాను. అన్నిటిని చూస్తూ, డెన్‌లోకి ప్రవేశించి నాలాటి బొమ్మను చూసి ఆశ్చర్య



పోయాను. తళుక్కున ఐడియా వచ్చింది.

నా బొమ్మను ఎవరూ చూడకుండా అదో అక్కడ దాచేశాను. దాని స్థానంలో నేను నిలుచున్నాను. ఊరికే కూర్చో బుద్ధికాక కొన్ని బొమ్మలను కదిలించాను. జరిపాను....అందుకే ప్రేక్షకులు, మేనేజర్ భయపడి పోయారు.

ఒక ప్రేక్షకుడిని నా ఫ్రెంచ్ రేజర్ బ్లేడ్‌తో తల కట్ చేయబోయాను. అతడు నా హిప్నటైజ్‌కు లొంగలేదో ఏమో, బెదిరి కేకలువేస్తూ పోయాడు. దాంతో మళ్ళీ నా యథాస్థానంలో నిల్చున్నాను. ఆ గల్లంతు జరిగిన తరవాత ఈ డెన్‌ను మూసివేశారు. ఇప్పటివరకు ఏమీ తినలేదు. కాస్త కాఫీ ఇవ్వు." అన్నాడు డాక్టర్.

కాఫీ ఇచ్చాను.

"ఇటు చూడు. నా కళ్ళల్లోకి చూడు" అన్నాడు డాక్టర్,

నేను నవ్వాను. నేనూ చదివాను హిప్నాటిజం బుక్స్. మార్కన్యాస్, ఏంటన్ మెస్మర్, బ్రెడ్, ఎలిస్టోన్, ఫాల్కనట్. బర్న్‌హోన్‌ల పుస్తకాలు చదివాను. నా మనసు శక్తి నాకు

తెలుసు....

మెల్లగా డాక్టర్ను చూశాను.

అతడు తన ఫ్రెంచ్ రేజర్ బ్లేడ్ను తీశాడు. "నీకు చావు తప్పదు. సిద్ధపడు. రా దగ్గరకు" అన్నాడు ఏక వచనంలో.

అతడు చాలా ఉద్రేకపడిపోతున్నాడు. ఉద్రేకం పనికి రాదు సమ్మోహనం చేసేవాళ్ళకు. కొంచెం శక్తి తగ్గుతుంది. ఎంత నిదానంగా వుంటే అంత మంచిది.

నేను అతడి దగ్గరకు వెళ్ళనందుకు అతడే నా దగ్గరకు రాసాగాడు....బ్లేడ్ పైకెత్తాడు.

అప్పుడే వాచ్మెన్ తలుపులు తెరుచుకుని లోనికి వచ్చాడు.

అతడి చేతిలోని రివాల్వర్ ప్రేలింది. సరిగ్గా అది డాక్టర్ చేతికి తగిలింది. బాధతో బ్లేడ్ను క్రిందకు జారవిడిచాడు.

"మేనేజర్ కూడా వచ్చాడు. అప్పుడే...."

"థాంక్యూ మిస్టర్ నాగేశ్వర్రావ్. నేను వాచ్మెన్ని కాను సి.ఐ.డిని. ఈ డాక్టర్ను వెంట తరుముతూ వచ్చాను.. మేనేజర్తో-డాక్టర్ మీ డెన్లో దాక్కున్నాడని చెప్పాను. ఇద్దరం కలిసి ప్లాన్ వేశాం.

డాక్టర్ పారిపోకుండా ఉండేందుకు డెన్ను రాత్రినుండి మూయించాను. అప్పుడే ఎందుకు బంధించరాదు? అని అనుకుంటారేమో. సాక్ష్యాలు బలంగా లేనందువల్ల బంధించ లేదు. ఇప్పుడు డాక్టరు మాట్లాడినదంతా రికార్డ్ చేశాను. మినీ కెమేరాతో ఫోటో తీశాను, మిమ్మల్ని చంపబోయే టప్పుడు" అన్నాడు సి.ఐ.డి ఇన్స్పెక్టర్.

ఆశ్చర్యంగా వారిని చూస్తుండిపోయాను. డాక్టర్ను బంధించి తీసుకుపోయాడు సి.ఐ.డి ఇన్స్పెక్టర్. ***

లంకెబిందెలు

చైతన్య



"బాబుగారూ! మీకోసం ఎవరో వచ్చారు!" చెప్పాడు నౌఖరు.

మేడమీద వరండాలో కూర్చొని పుస్తకం చదువుతున్న భుజంగరావు తలెత్తి "ఎవరు?" అడిగాడు.

"ఎవరో సాధువు. మిమ్మల్ని చూడాలంటున్నాడు!"

"సాధువులేడు, సిద్ధుడులేడు! వెళ్ళమని చెప్పు!" కసురుకొని మళ్ళీ పుస్తకం చదవడంలో మునిగిపోయాడు.

"రెండు నిముషాల తర్వాత అడుగుల చప్పుడు

విన్పించి తలెత్తి ఆశ్చర్యపోయాడు.

ఎదురుగా సాధువు నిలబడి వున్నాడు. కాషాయరంగు వస్త్రాలు, మొహాన్ని సగం కప్పిన తెల్లటి గడ్డం, ఒక చేతిలో కమండలం, ఇంకోచేతిలో పులితోలు, ఇంకా ఏవో వున్నాయి.

"ఎవర్నువు? ఎవరు రానిచ్చారు?" కోపంగా అరిచి "రంగయ్యా?" గర్జించాడు.

"అతన్నేమీ అనకండి. అతని తప్పేంలేదు. నేనే మీతో కొన్ని విషయాలు మాట్లాడాలని వచ్చాను. కొద్ది సేపు మీతో మాట్లాడాక, మీకు ఇష్టంలేకపోతే వెళ్ళి పోతాను!" చెప్పాడు సాధువు.

భుజంగరావు ముఖం చెట్లించాడు. "ఏమిటి నువ్వు మాట్లాడేది?" అడిగాడు విసుగ్గా.

చేతిలో వున్న పులితోలు నేలమీద పరిచి దానిమీద కూర్చున్నాడు సాధువు. భుజంగరావు వైపొకసారి చూచి చిన్నగా నవ్వి అన్నాడు.

"నా పేరు పుండరీకుడు. పాతికేళ్ళు హిమాలయాల్లో తపస్సుచేసి జ్ఞానసిద్ధి పొందాను. అంతేకాదు, దివ్య దృష్టితో భూత భవిష్యత్ వర్తమానకాలాలు గురించి చెప్ప గలను. జ్ఞానసిద్ధి పొందాక వివిధ క్షేత్రాల్లో పరమేశ్వరుని దర్శించుకుంటూ రామేశ్వరం బయలుదేరాను. ఈ పూట ఇక్కడకు వచ్చేసరికి చీకటి పడింది. ఈ రాత్రికి ఆశ్రయ మిస్తే, ఉదయాన్నే లేచి నాదారిన నేను వెళతాను."

భుజంగరావు హేళనగా నవ్వాడు. "మరి మీ శిష్య బృందం ఏది? చూడు సన్యాసీ! నీలాంటివాళ్ళు ఈ చుట్టు పక్కల చాలమంది వున్నారు. నీలాగే మహిమల పేరుతో అమాయకులను మోసగించి ధన మాన ప్రాణాలు వశపరచు



కుంటున్నారు. మీ బ్రతుకులు ఎవడికి తెలియవు? ఏవో కొద్దిగా గారడీ విద్యలు నేర్చుకున్నంత మాత్రాన దైవాంశ సంభూతులైపోతారా? చాల్చాల్లే! మర్యాదగా బయటకు వెళ్ళు. లేదా మెడపట్టి గెంటించవలసి వుంటుంది!" హెచ్చరించాడు.

పుండరీకుడు భయపడలేదు. పైగా చిన్నగా నవ్వాడు.

"అమాయకుడా! సత్యా సత్యలు తెలియక దూషిస్తున్నావ్! నా మహిమలు గ్రహిస్తే నువ్వే చింతిస్తావు!" శాంతంగా పలికాడు.

భుజంగరావు కోపంగా లేచి నిలబడ్డాడు. "లే! మర్యాదగా బైటకు నడువ్!" గర్జించాడు.

పుండరీకుడు ఒక్క క్షణం కళ్లు మూసుకొని, తెరిచి లేచి నిలబడ్డాడు. "నరహరీ! భరించలేని పాప భారాన్ని మోస్తూ ఎందుకింత అహంకారంగా ప్రవర్తిస్తావ్?" అన్నాడు నెమ్మదిగా.

అదిరిపడ్డాడు భుజంగరావు. మరుక్షణం చటుక్కున సాధువు నోరునొక్కి, చెయ్యి పట్టుకొని పక్క గదిలోకి లాక్కెళ్ళి తలుపులు బిగించాడు.

"ఇప్పుడు చెప్పు! ఎవర్నువ్? ఈ మారువేషం ఏమిటి? ఈ విషయాలన్నీ నీకెవరు చెప్పారు?" టేబిల్ సొరుగులో వున్న రివాల్వర్ అందుకొని సాధువుకు గురిపెట్టి గర్జించాడు.

పుండరీకుడి గుబురు మీసాలు కొద్దిగా కదిలాయి. చిన్నగా నవ్వి, "నా గురించి నీకింకా తెలిసిరాలేదు. నే నెవరినో ముందే చెప్పాను. నాది మారువేషమూ కాదు, నీ విషయాలు నా కెవ్వరూ చెప్పనూలేదు. నీగురించి దివ్యదృష్టితో అంతా గ్రహించాను. నీ మేడిపండు జీవితంలో ఎన్ని విషపురుగుల అనుభవాలు వున్నాయో నాకు అవగతమయింది.

కానీ నాకు నీ పాపాలతో పనిలేదు. నిన్ను చట్టానికి పట్టించవలసిన అవసరం కూడ నాకులేదు. నీ పాపాలకు శిక్ష దేవుడే విధిస్తాడు. కాకపోతే, నాగురించి నీకు తెలియ చెయ్యడానికే నీకు గతాన్ని గుర్తుచేసాను!" చెప్పాడు.

భుజంగరావుకు నమ్మకం కుదరలేదు. చటుక్కున పుండరీకుడి గడ్డం పట్టుకొని లాగాడు. గడ్డం ఊడిరాలేదు. పుండరీకుడిది మారువేషంకాదని తెలిసాక కొంత నమ్మకం కుదిరింది భుజంగరావుకు.

"నిజం చెప్పండి. నాగురించి మీకింకా ఏం తెలుసు?" అడిగాడు ఆత్రుతగా.

"నీగురించి నాకంతా తెలుసు. అన్నీ వివరంగా చెబుతాను. కాని నాకు ముందు ఆతిథ్యం, ఆశ్రయం కావాలి!" చెప్పాడు పుండరీకుడు.

"అలాగే! మీరిక్కడే, ఈ గదిలోనే వుండండి. మీకు కావలసిన ఏర్పాట్లన్నీ నేను చూస్తాను. అందరూ నిద్ర

పోయాక మాట్లాడుకుందాం!" అన్నాడు భుజంగరావు లేచి నిలబడుతూ.

2

రాత్రి పది గంటలు దాటింది.

పుండరీకుడికి అన్ని ఏర్పాట్లు తనే స్వయంగా చేసాడు భుజంగరావు. ఇంట్లో ఎవ్వర్నీ ఆ గది చుట్టుపక్కలకు వెళ్ళనివ్వలేదు.

ఇంట్లో అంతా పడుకున్నాక ఇద్దరూ సమావేశ మయ్యారు.

"నే నిప్పుడు చెప్పే విషయాలు నీకు కోపాన్ని ఆవేశాన్ని తెప్పించవచ్చు. ఆవేశం మనిషిని పశువుగా మారుస్తుంది. అందుకే నీ దగ్గర వున్న రివాల్వర్ లోపల పెట్టిరా" అన్నాడు పుండరీకుడు.

భుజంగరావు ఆశ్చర్యపోయాడు. ఒక్క క్షణం తటపటాయించి రివాల్వర్‌లో బుల్లెట్స్ క్రింద పడేసి, రివాల్వర్ దూరంగా విసిరాడు.

పుండరీకుడు మందహాసం చేశాడు.

పుండరీకుడు చెప్పబోయేదానికోసం ఆతృతగా ఎదురు చూడసాగాడు భుజంగరావు.

పుండరీకుడు ఒక్క క్షణం కళ్ళు మూసుకొని తెరిచి, "నీ అసలుపేరు నరహరి. నీకు ఇద్దరు భార్యలు. నీ మొదటి భార్య సుషమాదేవితో వివాహం జరిగాక, నీపేరు భుజంగ రావుగా మార్చుకున్నావ్.

"నీ మొదటి భార్య కలవారి బిడ్డ. లెక్కలేనంత ఆస్తితో నీ ఇంట అడుగుపెట్టింది. ఆమె ఆస్తి చేజిక్కించుకోవాలనే దురాశతో ఆమెను హత్య చేసావ్. లక్షల

ఆస్తికి అధిపతి వయ్యావు. ఆ తర్వాత విమలాదేవిని వివాహం చేసుకున్నావ్...."

చెప్పడం ఆపి భుజంగరావు మొహంలోకి చూచాడు. భుజంగరావు ఊపిరి బిగబట్టి వింటున్నాడు.

"నీకు ధనదాహం, కామదాహం ఎక్కువ. నీ యవ్వనంలో ఎంతోమంది కన్నెల జీవితాలు కాలరాచావు. చివరకు నీ ఇంట్లో నౌఖరుగా పనిచేసే నరసింహులు అనేవాడి భార్యను కూడా నీ కామదాహానికి బలితీసుకు చంపేశావ్."

పగలబడి నవ్వాడు భుజంగరావు. "బాగుంది. నీ కట్టు కథలు చాల ఆసక్తికరంగా వున్నాయి. ఎక్కడ నేర్చావివన్నీ!" వ్యంగంగా అడిగాడు.

"మూర్ఖుడా! బుకాయించకు! నేను చెప్పేది ప్రతి అక్షరం సత్యం. అది నీ మనసుకు తెలుసు. కాని నీ పాపం నీ మనసును నొక్కేస్తుంది. నువ్వు కాదన్నా, నీ మనసుకు తెల్సిన విషయాలు కొన్ని చెబుతాను విను....

ఈ ఇంట్లో పూజగది కానుకొని, ఒక గదివుంది. అది మీ అమ్మగారి గది. అందులో దంతపు చెక్కలతో చేసిన భోషాణం ఇంకా వుంది. కాని ప్రస్తుతం ఆ గదిలోకి ఎవ్వరూ వెళ్ళడంలేదు. అవునా?"

తల ఊపాడు భుజంగరావు.

"ఇంకో విషయం చెబుతాను. ఎందర్నో ఎన్నో రకాలుగా వేధించిన నువ్వు నీకన్న కొడుకు మూలంగానే కుమిలిపోతున్నావు. సర్వ దుర్గుణాలతో నీ బిడ్డే నీకు శత్రువుగా మిగిలాడు. కాని ఈ బిడ్డ అల్పాయుష్కుడు."

"స్వామీ!" ఆదుర్దాగా అడిగాడు భుజంగరావు.

పుండరీకుడు నవ్వి, "కంగారు పడకు. నీ వంశాన్ని ఉద్ధరించే కొడుకు ఇంకొకడు కల్గుతాడు నీకు!" అన్నాడు.

"ఈ వయస్సులోనా?" ఆశ్చర్యంగా అడిగాడు భుజంగ రావు.

పుండరీకుడు తల ఊపి "నీకే సందేహం వద్దు. త్వరలోనే నీకో కొడుకు జన్మిస్తాడు. అతడే నీ వంశాన్ని నిలబెట్టగల వంశోద్ధారకుడు. అయితే, నీకిక్కడ ఇంకో రహస్యం చెబుతాను. నీకు నీ అల్పాయుష్కుడి కొడుకు ద్వారా లంకె బిందెలు లభించే అవకాశం వుంది!" చెప్పాడు పుండరీకుడు.

"లంకె బిందెలా?" ఆశ్చర్యపోయాడు భుజంగరావు.

"అవును. ఈ ఇంట్లో ధనలక్ష్మి తాండవమాడుతుంది. ఆ గజ్జెలమోత నాకు విన్పిస్తూనే వుంది. అయితే అది దక్కించుకునే అదృష్టం నీమీద ఆధారపడి వుంది."

"ఏం చెయ్యాలో చెప్పండి. మీరేం చెయ్యమన్నా చేస్తాను. మీకెంత ధనం కావలసినా ఇస్తాను" ప్రాధేయ పడ్డాడు భుజంగరావు.

పుండరీకుడు నవ్వి, "నాకెందుకు ధనం. సర్వసంగ

పరిత్యాగిని. నీకు వచ్చే మార్గం చెబుతాను. అయితే అది చాల క్లిష్టతరమైనది. చెయ్యగలవా?" అడిగాడు.

"చెప్పండి. ఏం చెయ్యమన్నా చేస్తాను" దృఢంగా పలికాడు భుజంగరావు.

"నీ చేతులతో నీ కొడుకునే లక్ష్మీదేవికి బలి ఇవ్వాలి. అప్పుడే ఆ నిధి నీకు దక్కుతుంది."

అదిరిపడ్డాడు భుజంగరావు. "ఏమిటి మీరనేది?" కోపంగా అడిగాడు.

"నేను ముందే చెప్పాను. అది క్లిష్టమైనదని.... నీ కొడుకు రక్తంతోకాని దేవి శాంతించదు. ఆ నిధి నీకు దొరకదు. పూజ గదిలో దేవి పీఠం క్రిందనే వున్న ఆ నిధి నీకింకా స్వాధీనం కాకపోవడానికి కారణం అదే! బాగా ఆలోచించుకో!

మరో విషయం. బలి ఇవ్వకుండా నువ్వు ఎన్నిరోజుల తరబడి అక్కడ తవ్వినా ఆ నిధి నీకు కన్పించదు. అరిష్టం కలుగుతుంది. తెల్సిందా?" అన్నాడు గంభీరంగా.

భుజంగరావు మాట్లాడలేదు. మౌనంగా లేచి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రంతా ఆలోచించాడు భుజంగరావు.

"తెల్లవారితే పుండరీకుడు వెళ్ళిపోతాడు. ఆ తర్వాత లక్షల విలువచేసే నిధి నిష్ప్రయోజనమైపోతుంది. ఉన్న కొడుకు తనను ఉద్ధరించేదేమిటి? వాడివల్ల ప్రతిక్షణం మనఃక్లేశం తప్పితే మరేమి మిగిలింది? ఇలాంటివాడి కోసం ముందుతరం భవిష్యత్తును ఎందుకు చీకటి చెయ్యాలి?...."

తెల్లవారగానే వెళ్ళి తన నిర్ణయం పుండరీకుడికి చెప్పాడు భుజంగరావు.

"అదృష్టవంతుడివి! ఎల్లుండి మంచిరోజు. ఆరోజే బలి ఇవ్వాలి. నీకు నిధి అప్పుడే దక్కుతుంది. అయితే ఈ విషయం మరెవ్వరికీ, చివరకు, నీ భార్యకు కూడ తెలియకూడదు!" హెచ్చరించాడు పుండరీకుడు.

భుజంగరావు తల ఊపాడు. స్వామిజీని నాలుగు రోజులు తమ ఇంట్లోనే వుండి ఆతిథ్యం స్వీకరించమని వేడుకున్నాడు.

3

"డాడీ ఎవరితను?" భోజనాల సమయంలో సుధీర్ అడిగాడు భుజంగరావుని.

"ఈయన పుండరీక స్వాములవారని గొప్ప సిద్ధుడు. పాతికేళ్ళ తపస్సుతో జ్ఞానసిద్ధిపొంది తీర్థయాత్రలు చేస్తూ ఇక్కడకు వచ్చారు. మన అదృష్టంకొద్ది మన ఇంట్లో వున్న గుప్త నిధిని మనకు అందజేయడానికి సహాయం చేస్తామన్నారు" చెప్పాడు భుజంగరావు.

పకపక నవ్వాడు సుధీర్. "గుప్తనిధా? బాగుంది జోక్! ఎవరు చెప్పారు? ఈ బాబా చెప్పాడా? ఇలాంటి బాబాలు దేశంలో ఎంతమందిలేరు. అందరికి దివ్యదృష్టి వుండి గుప్త నిధులు కనుక్కుంటే, నిన్ను ప్రతిరోజు డబ్బుకు పీడించే అవసరం నాకెందుకుంటుంది! డామ్ హెల్! అంతా బూటకం!"

"లేదు బాబూ. నామాట విను. ఈ ఒక్కరోజు నాతోపాటు అర్థగంటసేపు పూజ చేసావంటే ఆ గుప్త నిధి మనకు అందుతుంది. అదంతా నీకే. ఆ తర్వాత నువ్వు నన్ను అడగనవసరంలేదు" బుజ్జగించబోయాడు భుజంగరావు.

"ఏమిటి డాడీ మీ చాదస్తం! గుప్త నిధి ఏమిటి మన ఇంట్లో వుండడ మేమిటి? మీకేమైనా మతిపోయిందా?" కసిరాడు కోపంగా!

"బాబూ! ఈ ఒక్కసారికి నామాట విను. ఆ తర్వాత నిన్నింకేమీ అడగను. అదృష్టం వుంటే నిధి దక్కుతుంది. లేకపోతే ఒక్క అర్ధగంటే కదా నీకు వేస్టు!" అనునయించాడు.

సుధీర్ ఒక్క నిముషం ఆలోచించి, "ఆల్ రైట్! అలాగే కానివ్వండి" అన్నాడు.

సుధీర్ భోజనంచేసి వెళ్ళాక పుండరీకుడు అన్నాడు.

"భుజంగరావ్ నేను చెప్పేది జాగ్రత్తగా విను! చీకటి పడగానే నేను పూజ గదిలోకి వెళ్ళి పూజచేసి, నిన్ను పిలుస్తాను. మీరిద్దరూ రండి! నువ్వు పూజచేస్తున్నట్లు నటించి, సరిగ్గా ఎనిమిది గంటలకు బలి ఇవ్వాలి. బలి సమయంలో అక్కడ ఎవరూ ఉండకూడదు. బలి ఇవ్వడం వేరెవ్వరు చూసినా గుప్త నిధి లభ్యంకాదు.

కాబట్టి, బలి ఇవ్వగానే, తిరిగి పూజ కార్యక్రమం పూర్తిచేసి, రాత్రికి రాత్రే ఆ నిధిని స్వాధీనం చేసుకోవాలి. తెల్సిందా? ఇందుకు భిన్నంగా జరిగిందా, ఆ తర్వాత నువ్వే చింతిస్తావు. ఆ తర్వాత ఆ నిధి నీకెప్పటికీ దొరకదు!" హెచ్చరించాడు.

భుజంగరావు తల ఊపాడు.

సాయంత్రం చీకటి పడగానే, పుండరీకుడు, గదిలోకి వెళ్ళి, పూజ ముగించుకు వచ్చాడు.

"జాగ్రత్త! సరిగ్గా ఎనిమిది గంటలకు నీపని పూర్తి కావాలి!" మరోసారి హెచ్చరించాడు పుండరీకుడు.

గదిలోకి వెళ్ళాక ఇద్దరూ దేవి విగ్రహం ముందు మోకాళ్ళమీద కూర్చొని కళ్ళు మూసుకున్నారు.

భుజంగరావు గుండె రాయి చేసుకున్నాడు. రాబోయే లంకె బిందెలు కళ్ళముందు కన్పిస్తున్నాయి. నెమ్మదిగా కళ్ళుతెరిచి పక్కనే వున్న కత్తి అందుకొని, కళ్ళు మూసుకొని కత్తి విసిరాడు.

భయంకరమైన కేకతోపాటు సుధీర్ తల క్రిందరాలింది.

ఒక్కక్షణం కొడుకు రక్తాన్ని చూడగానే భుజంగరావు గుండెలదిరిపోయాయి. చటుక్కున బయటకువచ్చి పుండరీకుడి గదిలోకి వెళ్ళాడు.

గదిలో మంచంమీద పుండరీకుడు నిశ్చలంగా పడుకొని వున్నాడు. భుజంగరావుకు అర్థం అయింది, పుండరీకుడు బ్రతికిలేడని.శవం ప్రక్కనేవున్న కాగితం అందుకున్నాడు.

"భుజంగరావ్....నాపేరు నరసింహులు!"అంతే వుంది అందులో.

కెవ్వున అరవబోయి, పోలీసుల అడుగుల చప్పుడు విని కుప్పలా కూలిపోయాడు భుజంగరావు. ***

'కొజ్జా' పాత్రలు

క్రొత్తగా సినిమా తీసే ఒక దర్శకుడితో నిర్మాత—

"ఈ మధ్య రిలీజైన చిత్రాల్లో 'కొజ్జా' వేషం వున్న చిత్రాలకు కలెక్షన్లు బాగుంటున్నాయి కనుక-మన చిత్రంలో కూడా ఒక కొజ్జా వేషం ప్రవేశపెడితే?"

"ఓ....దానిదేముంది! మన పిక్చర్లో హీరోయిన్ బదులు, కొజ్జానే ప్రవేశపెడదాం.... వెరైటీ కూడా ఉంటుంది!!" అన్నాడా న్యూ వేవ్ డైరెక్టరు.

నానిబాబు, విశాఖపట్టణం-4.

నాకు ఓటమి లేదు

యస్.యస్.శాస్త్రి

అతనికి నలభై అయిదు సంవత్సరాలుంటుంది వయసు.

కాని అంత వున్నట్లు కన్పించటంలేదు.

అతను ఎర్రగా దృఢంగా వున్నాడు. పల్చగా గీతల్లా వున్న పెదాలు, నిండు బుగ్గలు. దట్టమయిన కనుబొమల క్రింద చిన్న కళ్లు. ముందుకి కొద్దిగా బట్టతల వుండటం చేత నుదురు విశాలంగా కన్పిస్తోంది.

బయటికి మామూలుగా వున్నట్లు కన్పిస్తున్నా అతని మనసులో దుమారం చెలరేగుతోంది.

కారు స్పీడుగా వెళ్తోంది.

రంగు రంగుల బల్బులతో వెలిగిపోతున్న షాపులు, బిల్డింగులు వెనక్కి వెళ్ళిపోతున్నాయి.

అతని దృష్టి వేటిమీదా ఆనటంలేదు.

కళ్ళముందు మాధవి రూపమే పదే పదే మెదులుతోంది పక పక నవ్వుతూ!

అతను కసిగా పళ్ళు కొరికాడు. ఆవేశంతో దవడ ఎముక బిగుసుకొంది.

మాధవి! ది బ్లడీ బిచ్! ఎంత మోసం చేసింది తనని.

ఎంతగా ప్రేమించాడు తను మాధవిని!

అసలు, ఈ వయసులో తనలో అలాంటి భావాన్ని రేకెత్తించింది మాధవి.

తన ఆకర్షణ వలలో చిక్కుకునేట్టు చేసింది!

ఆమె తనని మనస్ఫూర్తిగా యిష్టపడ్తూందని నమ్మాడు. కాదు. అలా నమ్మించింది. కాని అదంతా నటన, మోసం.... వంచన!

మాధవితో తనకు మొదటిసారిగా ఓ పార్టీలో పరిచయ మైంది.

తన భార్యపోయి పదిహేనేళ్ళకుపైనే అయింది తరు వాత యిన్నేళ్ళకి ఎందుకో మాధవి అంటే యిష్టం అనిపిం చింది. ఈ వయసుకి యిలాటివేమిటని తను సరిపెట్టుకో లేక పోయాడు. మాధవిలోని ఏదో ఆకర్షణ తనను ఆకట్టు కొంది.

'మీరంటే నాకు యిష్టం!' అని తనతో మాధవి చెప్పిన నాడు తను ఆశ్చర్యపోయాడు. ఎంతో ఆనందించాడు.

మాధవి చిన్నదికాదు. పాతికేళ్ళకి పైనుంటుంది వయసు. అయినా ఆమె చిన్నపిల్లని, ఏమి తెలియదని మందలించాడు. కాని ఆమె చెప్పిందేమిటి? తనలో ఏదో

ఆకర్షణ వుందని, ప్రేమకి వయసుతో పనిలేదని పాఠాలు చెప్పింది.

అలా మొదలయింది తమ యిద్దరి మధ్యా సంబంధం. అయితే ఆ విషయం మరొకంటికి తెలియదు. అది తన కిష్టంలేదు. అయితే మాత్రం? ఆమెని తన భార్యకన్నా ఎక్కువగా ప్రేమించాడు, ఆదరించాడు.

ఆమె అందం, ఆప్యాయత తన జీవితంలో ఒక మధురానుభూతి అనుకున్నాడు.

ఆమె కోరిన ప్రతి కోరికా తీర్చాడు. ఈ ఆరునెలల్లో ఆమెకై ఎంత డబ్బు ఖర్చుపెట్టాడో కనీసం ఆలోచించనైనా లేదు.

కాని తను మూర్ఖుడు. మేడిపండుని చూసి మోసపోయేడు. ఆమె డబ్బు పిశాచి అని గ్రహించలేకపోయాడు. కాని....నిన్నటి సంఘటనతో ఆమె మోసం బైట పడింది.

నిన్నరాత్రి ఎప్పటిలా పదిన్నర గంటల ప్రాంతంలో మాధవి యింటినుండి బైట పడ్డాడు తను. కారులో చాలా దూరం వచ్చేసాక గుర్తొచ్చింది తన ఆప్టికల్ కేసు మాధవి యింట్లో వుండిపోయిందని.

కారు వెనక్కు తిప్పి మాధవి యింటి కెళ్ళాడు.

అప్పుడే ఎవరో వ్యక్తి ఆమె యింట్లోకి వెళుతున్నాడు.

మాధవి వంటరిది. మరి ఆ వ్యక్తి ఎవరు?

లోనికెళ్ళిన వ్యక్తి ఎంతకీ బయటికిరాలేదు. అప్పటికి పదకొండు గంటలయింది.

ఆమె యింటికి వెనుకనున్న, ఆమె బెడ్‌రూం కిటికీ వద్దకు వెళ్ళి చూసాడు.

ఆ వ్యక్తి తన జేబులోని బరువుగావున్న పర్సుతీసి,

ఎంతో కూడా చూడకుండా కొన్ని నోట్లు లాగి మాధవి కిస్తూ ...

అప్పుడు గ్రహించాడు ఆమె ఆంతర్యం. ఆమె భౌతికంగా అందమైనదే. కాని ఆమె మనసు కురూపి.

సంఘంలో తనలాటి వాళ్ళని తన ఆకర్షణతో వలపన్ని అందులో చిక్కుకునేట్టు చేసి-బేంకు నింపుకుంటోంది....

చటుక్కున కారాపాడు.

రాత్రి పదిన్నర గంటల సమయం. ఆ వీధి నిశ్శబ్దంగా వుంది.

కారు దిగి, రెండు చేతులు పాంటు జేబుల్లో వుంచు కుని, నడవసాగాడతను.

అతని హృదయం మండిపోతోంది.

"అబ్బా!" ఎవరో మూల్గారు.

అత నులిక్కిపడి చూసాడు.

ఎవరో ముష్టివాడు. రోడ్డుకు పక్కన ఓ గోనె పర్చుకు పడుకున్నాడు.

అతను రోడ్డువారగా నడుస్తుండటాన ఆ ముష్టివాడి చెయ్యి బూటుకాలితో మట్టేసాడు.

"టయిమెంతవుద్ది బాబయ్యా?" అన్నాడు ముష్టివాడు నీరసంగా మూల్గుతూ.

"పదిన్నర!" అతను చకచక నడిచేడు ముందుకి.

కొద్దిక్షణాల తరువాత ఓ యింటి ముందాగి, ఓసారి చుట్టూ కలయజూసి, తలుపు తట్టాడు.

"ఎవరూ?" క్షణం తరువాత విన్పించింది ఓ స్త్రీ గొంతు.

సమాధానంగా అతను మళ్ళీ తలుపు తట్టాడు.

తలుపు తెర్చుకుంది!

ఎదురుగా ఆమె!

అతన్ని చూసి నవ్వి, "మీరా? రండి" అంటూ అడ్డు తొలగింది. అతను ఆమెవేపు చూడకుండా లోనికెళ్ళి తనే తలుపులు వేసాడు.

ఆమె చెయ్యిపట్టుకుని నడిచాడు. బెడ్‌రూంలోకి వచ్చేక ఆమెని వదిలి ఆ గది తలుపులు కూడా వేసి గడియ పెట్టాడు.

ఆమె ఆశ్చర్యంగా చూస్తోంది.

"మాధవీ!" అన్నాడతను.

"ఏమిటి?"

"నువ్వు నన్ను మోసం చేసావ్."

"ఛ! అవేం మాటలు? నేనెప్పుడూ మీ....దా...."

ఆమె చెంప ఛెళ్ళుమంది.

అతని కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"నేనేం చేసాను?" చెంప తుడుచుకుంటూ అంది మాధవి.

"నువ్వా? నువ్వు విషప్పురుగువి. చెదపురుగువి. చెదలా నాకు పట్టావు. కాని అది నేను ముందు గ్రహించలేక పోయాను. అంతగా నమ్మించి వంచించావు నన్ను. ఇంచుమించు నా డబ్బంతా మింగి దగాచేసావు. నీలాంటి నీచురాలిని క్షమించను. నిన్ను బతకనివ్వను." అతను ఆమె మీదకు దూకబోయాడు.

"ఆగు!" ఆమె అరచింది.

అతను ఆగి చూసాడు రౌద్రంగా.

"నీలాంటి పిట్టల్ని ఎలా రెక్కలు విరగదీసి పంచాలో నాకు బాగా తెల్సు. చూస్తుండు...." మాధవి చకచక వెళ్ళి టేబిల్ సొరుగులోవున్న ఒక కార్డుసైజు ఫోటో

తెచ్చి అతని చేతిలో పెట్టింది.

దాన్ని చూస్తూనే అతను హతాశుడయాడు. ఆ ఫోటోలో తను, మాధవి—క్షణంలో తన పరువు, తను రోడ్డు పాలయే విధంగా వున్నారు.

"ఎవరిచేత తీయించావు?" అడిగాడతను.

"ఎవరిచేతా కాదు. ఆటోమాటిక్ కేమెరాతో."

"నువ్వు నిజంగా బతికుండకూడదు."

"షటప్! పిచ్చిగా వాగకు. ఆ ఫోటో ఒక్కటి చాలు-నీ పరువూ, చప్పుబండలు ఏట్లో కలవడానికి. నాకు తెల్సు మీలాంటి పెద్దలు భార్యని వీధిలో పెట్టయినా సరే పరువుని యింట్లో దాచుకుంటారని" అంది వెటకారంగా.

"బ్లాక్‌మెయిల్ చేస్తావా?" అతని పిడికెళ్ళు బిగుసుకుంటున్నాయి.

"బ్లాక్‌మెయిల్ చేస్తానో, హౌరామెయిల్ చేస్తానో నీ కనవసరం. ఇప్పటికి ఇంటికి వెళ్ళిపో! అన్నట్టు రేపు సాయంత్రానికి వో వెయ్యి కావాలి. తీసుకురా. ఇప్పటికే నా నిద్ర బోలెడంత పాడుచేసావ్. ఇకవెళ్ళు" అందామె విసుగ్గా.

అతని చూపు అక్కడే టీపాయ్‌మీదవున్న కత్తిపై పడింది.

చటుక్కున జేబులోని రుమాలు తీసి అటు దూకాడతను.

అతనేం చేస్తాడో ఆమె గ్రహించే లోపలే అతని చేతిలోని రుమాల్లోనున్న కత్తి ఆమె వెన్నులో దిగబడింది.

ఆమె బాధగా ముందుకు తిరగ్గానే, కత్తి గుండెల్లో దించాడతను.

మాధవి కుప్పలా కూలిపోయింది. రుమాలు అతని చేతిలో, కత్తి ఆమె గుండెల్లో దిగబడిపోయాయి.

అతను రుమాలువేపు చూసాడు. కొద్దిగా రక్తం అంటుకుని కన్పించింది. దాన్ని మడతపెట్టి జేబులో దాచాడు. తర్వాత కత్తివేపు చూసాడు.

ఆ కత్తిమీద తన వేలిముద్రలుండవు.

అతని చూపు కింద పడివున్న ఫోటోపై పడింది. దాన్నందుకుని జేబులోకి తోశాడు. అంతలో ఏదో గుర్తుకొచ్చి టేబిల్ సొరుగు, బీరువాలోను వెతికాడు.

బీరువాలో దొరికింది ఓ కవరు.

తెర్చి చూసాడు. నెగిటివ్, మరో ఫోటో కనిపించాయి. నిట్టూర్చి దాన్ని కూడా జేబులో దాచి వెనుతిరిగాడు.

2

ఆ మరునాడు వుదయం—

మాధవి యింటిముందు పోలీస్‌జీపు, ఆంబులెంస్ వచ్చి ఆగాయి.

ఇన్‌స్పెక్టర్ వినోద్ తన బలగంతో యింట్లోకి వెళ్ళాడు.

హత్య బెడ్‌రూంలో జరిగింది.

ఇన్‌స్పెక్టర్ తన రొటీన్ డ్యూటీ మొదలెట్టాడు.

హత్యని మొదట చూసింది పనిమనిషి. ఆమె ద్వారా విషయం తెల్సుకుని పక్కింటాయన యెవరో ఫోన్ చేసాడు.

ఇన్‌స్పెక్టర్‌కి వివరాలు చాలా తక్కువగా తెలిసాయి. హతురాలు అయిన మాధవి ఒంటరిది. దగ్గిర బంధువులెవరయినా వున్నారో లేదో తెలీదు.

అయితే ఒకటి రెండుసార్లు ఎవరోవ్యక్తి ఆమె ఇంటికి రావటం చూసామన్నారు.

తాము మొదటిసారి చూసిన వ్యక్తి, రెండవసారి చూసిన వ్యక్తి ఒకరేనని చెప్పలేమన్నారు. అంతేకాదు, ఆ వ్యక్తి రాత్రి పది దాటాక వచ్చాడట. అందువల్ల అతను యిపుడు ఎదురుగా వున్నా పోల్చలేమన్నారు.

కాని పోలీసులు యెక్కువ శ్రమపడకుండానే చాలా ఆధారాలు దొరికాయి.

బెడ్‌రూంలో మంచంపైన మడతలతో వున్న ఒక జేబురుమాలు దొరికింది.

దాని పై అంచున "రమేష్" అన్న పేరు రంగుల దారాలతో కుట్టబడి వున్నది. ఇంకా, టీపాయ్‌మీదున్న ఆష్ట్రేలో రెండు సిగరెట్‌పీకలు దొరికాయి.

అంతేకాదు! హతురాలి గుండెల్లో దిగబడివున్న కత్తిపై కొద్ది కొద్దిగా ఎవరివో వేలిముద్రలున్నాయి.

హత్య రాత్రి తొమ్మిదిన్నర పదిన్నరగంటల మధ్య జరిగుంటుందని సూచించాడు పోలీస్ డాక్టర్.

ఆ మధ్యకాలంలో ఒక యువకుడు హతురాలి యింటి నుండి బైటపడ్డం, కాకతాళీయంగా తన కంట పడిందని-తనంత తానుగా యిన్‌స్పెక్టర్‌వద్ద కొచ్చి సమాచారం అందించాడు ఒక యువకుడు.

"మీ పేరు?" ప్రశ్నించాడతన్ని ఇన్‌స్పెక్టర్.

"గోవిందరావు. మా యిల్లు ఈ వీధిపక్క వీధిలో వుంది. కాని ఈ యింటి యెదురుగా మా ఫ్రెండు సుబ్బారావు రూం వుంది. మా పరీక్షలు దగ్గరపడటంతో, మేమిద్దరం అతని రూంలో కంబైండ్ స్టడీస్ చేస్తున్నాం.

నేను రాత్రి పదిగంటల ప్రాంతంలో మా యింటినుండి బయలుదేరి యిక్కడికొస్తుంటాను. నిన్న ఎప్పటిలా పది గంటల ప్రాంతంలో యిక్కడికొచ్చాను. ఈ యింటికి అల్లంత దూరంలో వుండగా ఆ యువకుడు ఈ యింటి నుండి బయటకొచ్చి చకచక వెళ్ళిపోయాడు" చెప్పాడు గోవిందరావు.

"అతనెవరో మీకు తెలుసా?" ఆత్రుతగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"తెలుసు" మెల్లిగా అన్నాడు గోవిందరావు.

"ఎవరు?"

"లాయర్ విశ్వనాథ్‌గారి కొడుకు. రమేష్!"

"వాట్?" షాక్ తిన్నా డినస్పెక్టర్.

లాయర్ విశ్వనాథ్‌గార్ని తెలియనివాళ్ళు చాలా తక్కువ. ఆయనంటే యెంతో గౌరవం అందరికీ. ఆయన చాలా తెలివైనవాడని ప్రతీతి.

ఇన్‌స్పెక్టర్ తేరుకుని గోవిందరావుని తీక్షణంగా చూసాడు.

"మిస్టర్ గోవిందరావ్! ఇది హత్యకేసు. మీరు చెప్తున్నది సామాన్య విషయంకాదు. మీరు బలమైన సాక్ష్యం. మీరు చెప్పేది నూటికి నూరుపాళ్లు నిజమై వుండాలి. లేకపోతే అన్యాయంగా నిర్దోషి, దోషి అవుతాడు."

"ఇన్‌స్పెక్టర్! నేను ఎల్. ఎల్. బి. చదువుతున్నాను.

అందుకే యిక్కడ హత్య అయిందని తెలియగానే ఇక్కడికి వచ్చేను ఈ సమాచారం చెప్పాలని. నేను చెప్పిందాంట్లో ఏమాత్రం అబద్ధంలేదు. నేను తప్పకుండా కోర్టులో సాక్షిగా నిలబడతాను," అన్నాడు గోవిందరావు.

తర్వాత జరిపిన పరిశోధనలో తేలిన విషయాలుకూడా రమేష్‌పై కేసును బలపరిచాయి.

కత్తిపై కొద్దిగా చెరిగివున్న వేలిముద్రలు, రమేష్‌వే!

చాకలి గుర్తువలన దొరికిన జేబురుమాలుకూడా లాయర్ విశ్వనాథ్‌గారి కొడుకు రమేష్‌దేనని తేలింది!!

3

జడ్జిగారు వచ్చి న్యాయ సింహాసనం అధిష్టించారు.

కోర్టు హాలంతా నిశ్శబ్దం ఆవరించింది.

జనం కిక్కిరిసి వున్నారు.

నగరంలో ఎంతో పలుకుబడివున్న లాయర్ విశ్వనాథ్‌గారి కొడుకు రమేష్ యిపుడు ముద్దాయిగా డాక్‌లో నిలబడున్నాడు.

కోర్టు గుమాస్తా మాధవి హత్యకేసు, ముద్దాయిగా పరిగణింపబడుతున్న రమేష్‌పై విచారణ ప్రారంభమవుతుందని సూచించాడు.

ఆ కేసుకు సంబంధించిన డాక్యుమెంట్సు న్యాయమూర్తి ముందుంచబడ్డాయి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి నిలుచున్నాడు.

హత్యాభియోగాన్ని పూర్తిగా వివరించి, కోర్టువారి అనుమతితో తగిన సాక్ష్యాలతో రుజువుచేయబడుతుందన్నాడు.

కేసు ప్రారంభించటానికి అనుమతించాడు జడ్జి.

కేసు ప్రారంభమయింది.

పబ్లిక్ ప్రాసిక్యూటరు అతి తీవ్రంగా, అమోఘంగా వాదించాడు.

లాయర్ విశ్వనాధ్ కూడా తనకొడుకు తరఫున వాదించాడు. కాని ఆ వాదనకి బలంలేదు.

రమేష్ నిర్దోషి అని నిరూపించటానికి ఒక్క ఆధారమూ లేదు.

తనకి మాధవికి ఓ సినిమాహాల్లో అనుకోకుండా పరిచయం అయిందని, తర్వాత తమ పరిచయం వృద్ధిచెందిందని, ఆమెని తను ప్రేమించానని, పెళ్ళికూడా చేసుకోవాలనుకుంటున్నానని చెప్పుకున్నాడు రమేష్.

అతను చెప్పిన కథనం ప్రకారం మాధవి హత్యజరిగిన నాటిరాత్రి పదిగంటలపుడు మాధవి యింటికెళ్ళాడు. ఆమెతో పరిచయం అయిన నెల్లాళ్ళనుండి అతను ఆమె యింటికి వెళుతున్నాడు.

అతను వెళ్ళేటప్పటికి ఆమె మేలుకొనే వుంది. ఆమెతో మాట్లాడుతూ అతను సిగరెట్లు కాల్చాడు. రుమాలు తీసి ముఖం తుడుచుకుని దాన్ని మంచంమీదుంచాడు. టీపాయ్ మీద కత్తి వుంటే మాటలలో దాన్ని చేతిలోకి తీసుకుని తిరిగిపెట్టేసాడు.

యింటికి వెళ్ళిపోదామని బైటకి వస్తుండగా అప్పుడే

గోవిందరావుకి కన్పించాననని చెప్పాడు.

లాయర్ విశ్వనాథ్ ఈ కథనాన్నే బలపరిచి వాదించాడు. కాని అంతగా లాభం లేకపోయింది.

ప్రాసిక్యూటర్ తీవ్రంగా వాదించాడు.

మాధవికి చాలామందితో పరిచయం వుందని, ఆమె ఒకరిద్దరితో క్లబ్బుల్లో తిరిగేదని యిన్స్పెక్టరు పరిశోధనలో తేలిందని అన్నాడు.

రమేష్‌కి ఆ విషయం తెల్సింటుందని, కోపంతో ఆమె యింటికి వెళ్ళాడని, యిద్దరికి జరిగిన వాగ్యుద్ధంలో అతను అక్కడే వున్న కత్తితీసి పొడిచేడని, తర్వాత తేరుకుని కత్తిమీది వేలిముద్రలు గాభరాతో తుడిచేసేడని, అందుకే వేలిముద్రలు పూర్తిగా చెరగక అస్పష్టంగా వున్నాయని వాదించేడు.

అతను హత్యచేసి బైటపడుతుండగా గోవిందరావు చూసాడని అన్నాడు.

ఇలా వాదప్రతివాదనలతో విచారణ మరునాటికి వాయిదా పడింది.

ఆ మర్నాడు జరిగిన విచారణలో కూడా ప్రాసిక్యూషన్ వారిదే పైచేయి అయింది.

అందరూ లాయర్ విశ్వనాథ్‌ని చూసి జాలిపడ్డారు. ఇంతవరకు విజయమే రుచి చూసిన లాయర్ విశ్వనాథ్‌కి అపజయం తప్పదన్నారు.

లాయర్ విశ్వనాథ్ కూడా కృంగిపోయినట్టు కినపిస్తున్నాడు. కళ్ళలో ఏదో వెలితి నిండుకునివుంది.

మూడోరోజుతో విచారణ ముగిసింది.

కాని తీర్పు మరునాటికి వాయిదా పడింది.

లాయర్ విశ్వనాథ్ కొడుకువద్దకు నడిచాడు.

"నాన్నా!" దీనంగా అన్నాడు రమేష్.

లాయర్ విశ్వనాధ్ కళ్ళల్లోనీరు తిరిగింది.

"రమేష్ భయపడకు. తీర్పు నువ్వనుకునేట్లు వుండదు. నువ్వు బైటపడతావు. నీ జీవితం హాయిగా సాగుతుంది. కాని నాకో మాట యివ్వు?" అన్నాడు.

"ఏమిటి?" అన్నాడు రమేష్ ఆశ్చర్యంగా.

"నీ జీవితంలో తిరిగి మేడిపండును చూసి మోసపోనని మాట యివ్వు" అని వెంటనే వెళ్ళిపోయాడు లాయర్ విశ్వనాధ్!

* * *

"సార్! పిల్చాడు కానిస్టేబుల్.

"ఏమిటి?" ఇన్స్పెక్టర్ వినోద్ అన్నాడు.

"ఎవరో ముష్టివాడు మిమ్మల్ని కలుసుకోవాలంటున్నాడు. ఏదో చెప్పాలట మాధవిగారి హత్య విషయమై."

"పంపించు" అన్నా డినస్పెక్టరు అతని కాశ్చర్యంగా వుంది.

మాధవి హత్య విషయం ఏమిటి? ముష్టివాడెవడో ఏదో చెప్పాలని రావడమేమిటి?

ఆమె హత్యకేసు ఎప్పుడో కోర్టుకెళ్ళింది. కేసు ముగియవచ్చింది. తీర్పు మాత్రమే తరువాయి.

రమేష్ హంతకుడిగా నిరూపణయినట్టే. అంతటి లాయర్ విశ్వనాధ్‌కి ఓటమి తప్పదని అందరూ అంటు న్నారు.

ఇన్స్పెక్టర్ ఆలోచనలు పూర్తికాకముందే ముష్టివాడు లోనికొచ్చాడు.

"ఏమిటి?" గంభీరంగా అన్నాడు ఇన్స్పెక్టర్.

ఆ బిచ్చగాడు చటుక్కున తన జోలెనుంచి ఓ తెలుపు

రంగు కవరుతీసి ఇన్‌స్పెక్టర్ కందిస్తూ, "ఆయనిమ్మన్నా రండి మీకు" అన్నాడు.

"ఏయన?"

"పేరు చెప్పలేదండి" అన్నాడు బుర్ర గోక్కుంటూ.

కొంచెం పెద్దసైజు కవరది. తెరిచి చూసాడు ఇన్‌స్పెక్టర్.

ఓ రుమాలు, రెండు ఫోటోలు, ఓ నెగిటివ్, మడిచిన తెల్లకాగితం వున్నాయి.

ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోతూ ఆ కాగితాన్ని తీసాడు.

అది వుత్తరం. గబగబ చదవసాగాడు.

"ఇన్‌స్పెక్టర్‌కి!

విధి చాలా చిత్రమైనది. అందుకే మాధవిని నా జీవితంలోకి ప్రవేశపెట్టి, ఎన్నో మలుపులు తిప్పి, చివరికి ఈ మలుపుతో ముగిస్తోంది.

మాధవి వంచకి. ఆ విషయం తెలీక ఆమె వలలో చిక్కుకున్నాను నేను. అయితే ఆమె వలలో చిక్కుకున్న చేపల్లో రమేష్‌కూడా ఒకడని నాకు తెలియదు. నేను రమేష్ తండ్రీకొడుకులమని మాధవికీ తెలీదు. ఆమె పిశాచి. తెలిసినా పట్టించుకునేది కాదేమో.

అయితే మాధవిని చంపిన "హంతకుడి"గా రమేష్ నిర్ణయించబడ్డపుడు నేను హతాశుణ్ణయాను. కారణం ఆధారాలున్నా రమేష్ హంతకుడు కాడు. ఆ విషయం నాకు స్పష్టంగా తెల్సు.

ఎందుకంటే—మాధవిని హత్యచేసింది నేను!

ఆ రోజు, మాధవి ఒక వంచకి—అన్న కోపంతో ఆమె యింటికెళ్ళాను.

అప్పుడే ఆ వీధిలో పడుకునున్న ఓ ముష్టివాడి చేయి తొక్కేసాను. అతను నన్ను చూసాడు. పైగా మూడిగాడు కూడా. ఇప్పుడు మీకీవుత్తరం అందిస్తున్నది ఆ ముష్టివాడే.

తర్వాత మాధవి యింటికి వెళ్ళాను. ఆమెని తిట్టాను. ఆమె నన్ను పరిహసించి తను తీసిన ఫోటోలు చూపించింది. నన్నో కుక్కలా అధిలించింది.

ఇక ఆవేశం భరించలేక అక్కడే టీపాయ్‌మీద కత్తి కనపట్టంతో, ఆ కత్తితో చంపేసాను. కాని నేను లాయర్ని. అందుకే ఆవేశంలో కూడా జాగ్రత్తపడ్డాను. కత్తిని రుమాలుతో పట్టుకున్నాను.

అందుకే కత్తిమీది రమేష్ వేలిముద్రలు కొద్దిగా చెరిగిపోయాయి. తర్వాత ఫోటోలు, నెగిటివ్‌తో బైటపడ్డాను.

ఎందరో నిర్దోషుల్ని రక్షించిన నేను నా కొడుకుని రక్షించుకోలేకపోయేను.

రమేష్‌పై కేసు బలపడింది. నావలన ఏపాపం తెలియని రమేష్ శిక్ష అనుభవించాలన్న మాట.

చివరికి 'నిజం' ఒక్కటే రమేష్‌ని నిర్దోషిగా నిరూపించగలదని గ్రహించేను. అదృష్టవశాత్తూ ఆ ఫోటో, రుమాలు నా వద్దనే వుంచేను నాశనం చేయకుండా.

వాటిని చట్టంముందుంచి నా కొడుకుని విడిపించండి.

నిజం బైటపడ్డాక, లాయర్‌నైన నేను కోర్టులో ముద్దాయిగా నిలబడలేను. అందుకే ఆత్మహత్యచేసుకుంటున్నాను. నా శవం మా యింట్లో వుంటుంది.

మరో విషయం. లాయర్ విశ్వనాథ్‌కి జీవితంలో ఓటమి లేదు. ఈ కేసులో కూడా నేను గెల్చాను — ఋజువు మీకు పట్టిస్తూ. శలవు.

ఇట్లు,

లాయర్ విశ్వనాథ్